thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 279 కరీంనగర్ మంగళవారం, 16 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఎస్ఐఆర్ సంస్కరణ కాదు, బలవంతపు అణచివేత

న్యూఢిల్లీ: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తీవ్రమైన పని ఒత్తిళ్ల కారణంగా పలువురు బూత్ లెవెల్ ఆఫీసర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలపై ఘాటుగా స్పందించారు. ఎస్ఐఆర్‌ను బలవంతపు అణిచివేతగా అభివర్ణించారు. ఈ ప్రక్రియ దేశ ప్రజలను వేధించేందుకు చేపట్టిన 'ఉద్దేశపూర్వక కుట్ర' అని ఆరోపించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈమేరకు ఆయన ఒక ట్వీట్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ దేశంలో అలజడి రేపిందని, ప్రజాస్వామ్యానికి తిలోదకాలు వదిలి అధికారంలో ఉన్నవారికి కొమ్ము కాసేందుకు ఉద్దేశించిన ప్రక్రియ అని రాహుల్ పేర్కొన్నారు.

నిజమైన ఓటర్లను తప్పించడం ద్వారా ఎలక్టోరల్ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా తారుమారు చేయడం, ఓట్ల చోరీని అప్రతిహతంగా కొనసాగించం ఎస్ఐఆర్ లక్ష్యమని ఆరోపించారు. 'ఎస్ఐఆర్ పేరుతో పౌరులను వేధించేందుకు ఉద్దేశపూర్వకంగా కుట్ర జరిగింది. విపరీతమైన ఒత్తిడి బీఎల్ఓల మృతికి కారణమవుతోంది' అని తప్పుపట్టారు.




# ప్రచారం ముగిసింది పోలింగే మిగిలింది!

# ముగిసిన తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం

హైదరాబాద్, డిసెంబర్ 15: రాష్ట్రంలో తుది విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగిసింది. డిసెంబర్ 11న తొలి విడత, 14న రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరిగాయి. తుది విడత ఎలక్షన్ డిసెంబర్ 17న జరగనుంది. దీంతో అభ్యర్థుల ఎన్నికల ప్రచారం ఇవాల్టితో ముగిసింది. ఇన్ని రోజులు గ్రామాల్లో హోరెత్తించిన మైకులు మూగబోయ్యాయి. డిసెంబర్ 17న 182 మండలాలు 4157 గ్రామ పంచాయతీలు,28, 406 వార్డుల్లో పోలింగ్ జరగనుంది. తుది విడతలో 394 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. తుది విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 53 లక్షల 6వేల 401 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

ఇందులో 26 లక్షల 1861 పురుష ఓటర్లు, 27 లక్షల 4 వేల 394 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. అలానే146 మంది ఇతర ఓటర్లు ఉన్నారు. తుది విడత పంచాయతీ ఎన్నికల కోసం 36 వేల 483 పోలింగ్ కేంద్రాలను రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. ఇవాళ(సోమవారం) సాయంత్రం 6 గంటల నుంచి ఎల్లుండి సాయంత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. ఎల్లుండి(బుధవారం) ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తుది విడత గ్రామ పంచాయతీ పోలింగ్ జరగనుంది. ఇక రెండో విడత పంచాయతీ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ దుమ్మురేపింది. మొత్తం 4,333 స్థానాల్లో సగాని కంటే ఎక్కువ గెలిచి ఆధిక్యాన్ని చాటారు. సిద్దిపేట, కుమురం భీం, జనగామ, నిర్మల్ జిల్లాల మినహా మిగిలిన జిల్లాల్లో కాంగ్రెస్ బలపరిచిన వారే మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్నారు. తొలి విడత మాదిరిగానే రెండో విడతలోనూ ప్రతిపక్ష బీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచింది. బీజేపీ మద్దతుదారులకు నిర్మల్ జిల్లాలో మెజారిటీ స్థానాలు వచ్చాయి.




**హైదరాబాద్: జీహెచ్ఎంసీలోని డివిజన్ల పెంపును సవాల్ చేస్తూ వినయ్‌కుమార్ అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని ఉన్నత న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. డివిజన్ల పునర్విభజనలో అభ్యంతరాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని వినయ్‌కుమార్ పేర్కొన్నారు. రాంన గర్ డివిజన్‌పై తన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషనర్ కోరారు. అనంతరం పిటిషన్‌పై విచారణను హైకోర్టు రేపటికి వాయిదా వేసింది.**




హైదరాబాద్ : ఖైరతాబాద్‌లోని రవీంద్ర భారతి ప్రాంగణంలో ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్ బాబు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతోపాటు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. అనంతరం రవీంద్ర భారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. భావితరాల కోసమే రవీంద్రభారతిలో బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. స్వర సార్వభౌమత్వానికి బాలసుబ్రహ్మణ్యం నిలువెత్తు నిదర్శనమని అభివర్ణించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. నెల్లూరులోని తన ఇంటిని వేద పాఠశాలకు బాలు ఇచ్చేశారని గుర్తు చేశారు. బాలు మన మధ్య లేకున్నా.. పాట రూపంలో మనతోనే ఉన్నారని చెప్పారు. ప్రతిఒక్కరి మనస్సులో బాలసుబ్రహ్మణ్యం చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడాన్ని తెలంగాణ వాదులు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతోపాటు ఉద్యమకారుడు పృథ్వీరాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నేపథ్యంలో విగ్రహ ఆవిష్కరణ సమయంలో నిరసన తెలిపేందుకు సిద్ధమైన తెలంగాణ వాదులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. రవీంద్ర భారతితో పాటు ఆ పరిసర ప్రాంతాల్లో భారీగా పోలీసులను మోహరించారు.




## బయటకు వస్తున్న కేసీఆర్.. బీఆర్ఎస్ స్కెచ్ అదుర్స్?

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మళ్ళీ యాక్టివ్ అయినట్లు తెలుస్తోంది. దాదాపు రెండు సంవత్సరాలుగా ఫామ్హౌస్ కే పరిమితమైన కేసీఆర్, మళ్లీ యాక్టివ్ అయ్యేందుకు సిద్ధమవుతున్నారట. లోకల్ బాడీ ఎన్నికల్లో గులాబీ పార్టీ ప్రభంజనం సృష్టిస్తున్న నేపథ్యంలో కెసిఆర్ బయటకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు గులాబీ సోషల్ మీడియాలో ఓ ప్రకటన కూడా వైరల్ గా మారింది. డిసెంబర్ 19వ తేదీన కెసిఆర్ బయటకు వస్తున్నారట. KCR తన ఎర్రవెల్లి ఫామ్ హౌస్ లో కాకుండా తెలంగాణ భవన్ లో గులాబీ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించేందుకు స్కెచ్ వేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయాలను ఎండగట్టేందుకు సమావేశం నిర్వహించబోతున్నట్లు తెలుస్తోంది. డిసెంబర్ 19వ తేదీన తెలంగాణ భవన్లో గులాబీ పార్టీకి సంబంధించిన ఎమ్మెల్యేలు అలాగే కార్యవర్గ సభ్యులతో సంయుక్త సమావేశం కేసీఆర్ నిర్వహిస్తారు.

ఈ సందర్భంగా కృష్ణా గోదావరి జలాల మీద గులాబీ పార్టీ చేపట్టిన ప్రాజెక్టుల విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూపిస్తున్న నిర్లక్ష్య ధోరణ పై కెసిఆర్ చర్చించనున్నారట. ఈ సందర్భంగా ఎలా ముందుకు వెళ్లాలి అనే దానిపైన కార్యాచరణ కూడా రూపొందించబోతున్నారట. దీంతో గులాబీ పార్టీలో కొత్త ఉత్సాహం నెలకొంది. కెసిఆర్ బయటకు రాకపోయినా కాంగ్రెస్లో కాస్త టెన్షన్ వాతావరణ ఉంది. అదే కేసీఆర్ యాక్టివ్ గా ఉండి పాలిటిక్స్ చేస్తే గులాబీ పార్టీ వైపు జనాలు మల్లడం గ్యారెంటీ అంటున్నారు విశ్లేషకులు.



## వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయనున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. సామాజిక మాధ్యమమైన ఎక్స్ వేదికగా ఆస్క్ కవిత ప్రోగ్రామ్ లో భాగంగా ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు ఆమె ఈ విధంగా బదులిచ్చారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మీరు పోటీ చేస్తారా..? అని అడగ్గా.. అందుకు యెస్ అని ఆమె సమాధానం ఇచ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో నెటిజన్లు పలు ప్రశ్నలు సంధించగా ఆమె సమాధానాలు తెలిపారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత.. సామాజిక మాధ్యమమైన ఎక్స్ లో తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఎక్స్ వేదికగా ఆస్క్ కవిత అనే ప్రోగ్రామ్ లో నెటిజన్లు అడిగిన పలు ప్రశ్నలకు ఆమె సమాధానాలు ఇచ్చారు. ఈ క్రమంలో 2029 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తారా..? అని ఓ యూజర్ ప్రశ్నించగా.. అందుకు కవిత యెస్ అని రిప్లై ఇచ్చారు. దాంతో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె పోటీ చేయనున్నట్లు స్పష్టం అయింది. అలాగే మరో యూజర్ ప్రశ్నిస్తూ.. . జాగృతి కార్యక్రమాలను కేవలం నగరానికే పరిమితం చేశారని.. గ్రామీణ ప్రాంతాల్లో ఎందుకు విస్తరించలేదని ప్రశ్నించారు. దానికి కవిత స్పందిస్తూ.. తెలంగాణలోని ప్రతి గ్రామంలో కమిటీను ఏర్పాటు చేస్తామని.. నెమ్మదిగా.. కానీ బలంగా ముందుకొస్తామని స్పష్టం చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమంలో నెటిజన్లు పలు ప్రశ్నలు సంధించగా ఆమె సమాధానాలు తెలిపారు.




# ఆంధ్రా వర్సెస్ తెలంగాణ..

## ఈ ప్రాజెక్టుల యుద్ధం ఇప్పట్లో ఆగదా?

హైదరాబాద్ / అమరావతి : తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర జలశక్తి కార్యదర్శి వి ఎల్ కాంతా రావు కు రాసిన లేఖ కృష్ణా గోదావరి నదుల వివాదాలపై మరోసారి దృష్టి సారించింది. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిస్తున్న నల్లమల సాగర్ ప్రాజెక్ట్ గోదావరి నీటిని తరలించేందుకు ఉద్దేశించినదని ఉత్తమ్ సూచించారు. ఇది బచావత్ ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధమని ఆయన ఆరోపించారు. పోలవరం బనకచర్ల ప్రాజెక్ట్ స్థానంలో నల్లమల సాగర్ కు డీపీఆర్ తయారీకి ఆంధ్రప్రదేశ్ టెండర్ నోటీసు విడుదల చేసిందని ఉత్తమ్ తెలిపారు. ఈ చర్యలకు కేంద్రం అనుమతులు ఇవ్వకుండా ఆపాలని ఆయన కోరారు. కర్నాటక అల్మట్టి డ్యాం ఎత్తు పెంచేందుకు భూసేకరణకు అనుమతి నిరాకరించాలని ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. ఈ వివాదాలు రెండు రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపిణీ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.

గతంలో ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలను కేంద్ర అటవీ పర్యావరణ శాఖ తిరస్కరించిందని ఉత్తమ్ గుర్తు చేశారు. రాజకీయ విశ్లేషకులు ఈ ప్రాజెక్టుల యుద్ధం ఇప్పట్లో ముగియదని అంచనా వేస్తున్నారు. రెండు రాష్ట్రాలు తమ హక్కులు కాపాడుకోవడానికి కేంద్రం మధ్యవర్తిత్వం అవసరమని వారు సూచిస్తున్నారు. ఈ లేఖతెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు ఇవ్వాలని కూడా కోరుతోంది. ఈ ప్రాజెక్టుల యుద్ధం రెండు రాష్ట్రాల సంబంధాలను దెబ్బతీస్తోంది. ఉత్తమ్ లేఖ కేంద్రం జోక్యం కోసం కీలకమైనది. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు నిధులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ చర్యలు తెలంగాణకు నష్టం కలిగిస్తాయని ఉత్తమ్ అన్నారు.
రాజకీయ విశ్లేషకులు ఈ వివాదం ఇప్పట్లో ముగియదని అంచనా వేస్తున్నారు. కేంద్రం తటస్థంగా వ్యవహరించాలని వారు సూచిస్తున్నారు. ట్రిబ్యునల్ విచారణలు త్వరగా పూర్తి చేయాలని ఉత్తమ్ కోరారు. ఈ లేఖ రాష్ట్రాల మధ్య సమన్వయం అవసరాన్ని హైలైట్ చేస్తుంది. ప్రజలు ఈ వివాదాల వల్ల నష్టపోతున్నారని విశ్లేషకులు అంటున్నారు.

చరకలు

మంగళవారం 16 డిసెంబర్ 2025




ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌లోని ఓ ఆలయంలో దర్శన వేళల్లో మార్పు కేసు విచారణలో భాగంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని బృందావన్‌లో గల బాంకీ బిహారీజీ ఆలయంలో దర్శన వేళలు, పూజా విధానాల్లో మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం భక్తుల నుంచి డబ్బులు తీసుకుని ప్రత్యేక పూజలు చేయడంపై అసహనం వ్యక్తం చేసింది. ఈ కేసులో దర్యాప్తునకు ఉన్నత స్థాయి ఆలయ నిర్వహణ కమిటీని నియమించింది. బాంకీ బిహారీజీ ఆలయంలో దర్శన వేళల్లోనే కాకుండా.. పలు మతపరమైన పూజా విధానాల్లోను మార్పులు చేస్తున్నట్లు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్, న్యాయవాది తన్వి దూబే అత్యున్నత న్యాయస్థానానికి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం దేవుడికి విశ్రాంతి వేళలు ఉంటాయని.. కానీ ఆ సమయంలోనూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారని అన్నారు. దీనిపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. దేవతలకు విశ్రాంతినివ్వకుండా ప్రత్యేక పూజలు చేయాల్సిన అవసరమేంటని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. ఆచారం ప్రకారం వస్తున్న పవిత్రమైన ఆలయ నియమాలను, సమయాలను పాటించాలని ఆలయ అధికారులను ఆదేశించింది. ఆలయ నిర్వహణ కమిటీతో సహా సంబంధిత పార్టీలకు నోటీసులు ఇవ్వాలని దర్యాప్తు కమిటీని ఆదేశించింది. ఈ కేసు విచారణను జనవరి మొదటి వారానికి వాయిదా వేసింది.ఆలయ నిర్వహణ కమిటీ, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.




ఆస్ట్రేలియాలోని బోండీబీచ్‌లో యూదుల హనూకా వేడుకలపై దాడి చేసిన ఇద్దరు సాయుధులను తండ్రీకొడుకులుగా దర్యాప్తు బృందం గుర్తించింది. వీరిని నవీద్ అక్రమ్ (24), సాజిద్ అక్రమ్ (50) అని పేర్కొన్నారు. ఈ నిందితులిద్దరూ పాకిస్థాన్ నుంచి వచ్చినట్లు న్యూసౌత్‌వేల్స్ పోలీసులు వెల్లడించారు. భద్రతాదళాలు జరిపిన ఎదురుదాడిలో సాజిద్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సాజిద్ పేరిట 2015 నుంచి తుపాకీ లైసెన్స్ ఉన్నట్లు న్యూసౌత్ వేల్స్ పోలీసులు వెల్లడించారు. అతడు ఓ హంటింగ్ క్లబ్‌లో కూడా సభ్యుడని తెలిపారు. సాజిద్ వద్ద ఆరు ఆయుధాలు ఉన్నాయి. వీటిని అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. నిందితుల్లో ఒకరు ఆస్ట్రేలియా సెక్యూరిటీ ఇంటెలిజెన్స్ ఆర్గనైజేషన్ ఏజెన్సీ నిఘా రాడార్‌లో ఉన్నాడు. అయినా తక్షణమే అతడి నుంచి ముప్పు లేకపోవడంతో సీరియస్‌గా తీసుకోలేదని తెలుస్తోంది. **కోలుకుంటున్న సాహసి..** బోండీ బీచ్‌లో సాజిద్ అక్రమ్ అనే దుండగుడితో పోరాడి తుపాకీ లాక్కొన్న అహ్మద్ అల్ అహ్మద్ అనే వ్యక్తి పెనుగులాటలో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని సెయింట్ జార్జి ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి స్థిరంగా ఉన్నట్లు చెబుతున్నారు. అతడి సాహసాన్ని అభినందిస్తూ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్ బిల్ అక్మాన్ రివార్డ్‌ను ప్రకటించారు.




సంగారెడ్డి, డిసెంబర్ 15: మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం రంగయిపల్లిలోని ఎమ్మెస్ అగర్వాల్ స్టీల్ కంపెనీలో సోమవారం భారీ పేలుడు సంభవించింది. బట్టీ పేలుడు ఘటనలో కార్మికుడు మృతి చెందాడు. మరో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. కంపెనీ అధికారులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మరోవైపు ఈ ప్రమాదం జరిగిన సమయంలో బట్టీల వద్ద దాదాపు 50 మంది పని చేస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై కంపెనీ యాజమాన్యం మాత్రం ఇంతవరకు స్పందించ లేదు. ఈ పేలుడు ఘటనపై సమాచారం అందగానే.. మేడ్చల్, తుప్రాన్ ప్రాంతాల నుంచి అగ్నిమాపక సిబ్బంది రంగయిపల్లికి హుటాహుటిన వచ్చి.. ఈ మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకు వచ్చారు. ఈ ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని.. సహాయక చర్యలు చేపట్టారు. ఇక ఆ పరిసర ప్రాంతాలన్నీ దట్టమైన పొగతో కమ్ముకుపోయాయి. దాంతో ఆయా గ్రామస్తులు పొగతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్విభజన సరికాదు: తలసాని

హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ వార్డుల పునర్విభజన ముసాయిదాపై భారత రాష్ట్ర సమితి అభ్యంతరాలు వ్యక్తం చేసింది. కొత్త డివిజన్ల ఏర్పాటు, వార్డుల విభజన ముసాయిదాలో లోపాలు ఉన్నాయంటూ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో పలువురు పార్టీ నేతలు జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి వెళ్లి.. కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్ల పునర్విభజనలో తప్పిదాలను సరి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తలసాని మీడియాతో మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ డివిజన్ల విభజన గందరగోళంగా చేశారని విమర్శించారు. డివిజన్ల పునర్విభజనలో తొందరపాటు ఎందుకని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా డివిజన్లు విభజించడం తప్పు అని అన్నారు.



## సీతారామపురంలో ఉద్రిక్తత.. ఎన్నికల అధికారిని గదిలో బంధించిన గ్రామస్థులు

ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల హడవుడి నడుస్తుంది. సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం.. సీతారామపురం గ్రామంలో ఎన్నికల అధికారి నాగరాజును గ్రామస్థులు ఓ గదిలో బంధించారు. ఎన్నికల అధికారి ఏక పక్షంగా వ్యవహరిస్తున్నారని.. ఉపసర్పంచ్ పదవిని ముందుగానే ప్రకటించారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నాగరాజు వ్యవహారంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన్ని గదిలో బంధించారు. దీంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఈ ఘటనపై అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే విషయం తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు సంబరాలు చేసుకుంటే.. ఓడిన అభ్యర్థులు కొన్నిచోట్ల ఆందోళన చేస్తున్నారు. తమ వద్ద డబ్బు తీసుకొని వేరే వాళ్లను గెలిపించారని ఆరోపిస్తూ.. తిరిగి డబ్బు చెల్లించాల్సిందిగా ఓటర్లను ఒత్తిడి చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. గెలిచిన అభ్యర్థులపై ఓడిన అభ్యర్థులు దాడులకు పాల్పడుతున్నారు. వారి ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఓడిన అభ్యర్థిపై గెలిచిన అభ్యర్థి బంధువులు దాడికి పాల్పడ్డారు. కామారెడ్డి జిల్లా సోమార్‌పేటలో ఓడిపోయిన సర్పంచ్ అభ్యర్థి బాలరాజును గెలిచిన సర్పంచ్ (%ఖుతీజుఖుఅఎష్ట్ర%) తమ్ముడు ట్రాక్టర్ తో ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సర్పంచ్ గా గెలిచిన పాపయ్య తమ్ముడు చిరంజీవికి, ఓడిన బాలరాజు వర్గంతో గొడవలు జరిగాయి. ఆది మనసులో పెట్టుకొని ట్రాక్టర్ తో ఢీకొట్టి ప్రత్యర్థులపై తన కక్ష తీర్చుకున్నాడు. గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



## రవీంద్ర భారతి ప్రాంగణంలో ఎస్పీ బాలు విగ్రహావిష్కరణ

హైదరాబాద్: రవీంద్రభారతి ప్రాంగణంలో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మంత్రి శ్రీధర్‌బాబు, భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావు ఇతర ప్రముఖులు హాజరయ్యారు. 7.2 అడుగుల బాలు కాంస్య విగ్రహాన్ని తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్యేకంగా తయారు చేయించారు. విగ్రహావిష్కరణలో భాగంగా రవీంద్ర భారతిలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. బాలసుబ్రహ్మణ్యంకు ఇష్టమైన 20 పాటలతో ఇవాళ సాయంత్రం 50 మందితో సంగీత విభావరి కార్యక్రమం ఏర్పాటు చేశారు.

**పరిపూర్ణ కళాకారుడిని గుర్తు చేసుకుంటున్నాం: వెంకయ్యనాయుడు...** ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్నేహశీలి, మృదుస్వభావి అని, ఇవాళ పరిపూర్ణ కళాకారుడిని గుర్తు చేసుకుంటున్నామని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వివిధ రంగాల్లో ప్రతిభ చూపించారని చెప్పారు. " తెలుగు పాటకు ఘంటసాల, ఎస్పీ బాలు పట్టం కట్టారు. సినీ చరిత్రలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరు చిరస్థాయిగా ఉంటుంది. ఎస్పీ గళం.. సంగీత దర్శకుడు ఏది కోరుకుంటుందో అది ఇచ్చే అక్షయపాత్ర. గళంలో వైవిధ్యం చూపడం ఎస్పీ బాలు ప్రత్యేకత. ఆయన తెలుగు ఉచ్చారణ వింటుంటే ఎంతో ఆనందంగా ఉండేది. ఆయన హాస్యం, సమయస్ఫూర్తి అందర్నీ అలరించేది. 'పాడుతా తీయగా' కార్యక్రమం ద్వారా వందలమంది గాయకులను పరిచయం చేశారు" అని వెంకయ్యనాయుడు గుర్తు చేసుకున్నారు.

**ఘంటసాల తర్వాత బాలు: బండారు దత్తాత్రేయ...** "బాల సుబ్రహ్మణ్యం విగ్రహ ఏర్పాటు మన తెలుగు ప్రజలందరికీ గౌరవం అని భావిస్తున్నా. ఎస్పీబీ గాయకుడే కాదు సంగీత దర్శకుడు, నటుడు. పలు భాషల్లో 40 వేలకుపైగా పాటలు పాడారు. ఘంటసాల తర్వాత అంతటి పేరు తెచ్చుకున్నారు. 'శంకరాభరణం'లో ఆయన పాటిన 'శంకరా' పాట నా మనసుకు హత్తుకుంది. 'పుణ్యభూమి నా దేశం' దేశభక్తిని చాటింది. 'అదిగో అల్లదిగో శ్రీహరివాసము' గీతం వింటే సాక్షాత్తూ వేంకటేశ్వరుడిని చూసినట్లే ఉంటుంది. టీవీ కార్యక్రమం 'పాడుతా తీయగా' ద్వారా ఎంతోమంది గాయనీగాయకులను పరిచయం చేశారు" అని హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రశంసించారు.

## డివిజన్ల పునర్విభజన.. జీహెచ్‌ఎంసీ మేయర్‌తో ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల భేటీ

హైదరాబాద్: జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మితో నగరానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు సమావేశమయ్యారు. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, ప్రకాశ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌లతో కలిసి కార్పొరేటర్లు మేయర్‌ను కలిశారు. జీహెచ్‌ఎంసీ డివిజన్ల పునర్విభజనపై ఆమెతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడుతూ డివిజన్ల సరిహద్దులపై మార్కింగ్ చేసి వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఏ ప్రాతిపదికన డివిజన్ల పునర్విభజన చేశారో చెప్పాలని కోరామన్నారు. బృహత్ హైదరాబాద్‌లో డివిజన్ల పునర్విభజనకు ఆదేశాలిస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో నగరాన్ని 300 డివిజన్లుగా విభజించారు. ఆయా డివిజన్లకు హద్దులను ప్రకటిస్తూ కొన్నిరోజుల క్రితం ప్రభుత్వం గెజిట్ ప్రచురించింది. గతంలోని డివిజన్లతో పోలిస్తే పాత జీహెచ్‌ఎంసీలోని డివిజన్ల సంఖ్య దాదాపు




రెట్టింపయ్యాయి. కొన్నిచోట్ల హద్దులు, కొత్త డివిజన్లపై జీహెచ్‌ఎంసీకి అభ్యంతరాలు, ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ కార్పొరేటర్లు జీహెచ్‌ఎంసీ మేయర్‌ను కలిశారు.




మంచిర్యాల : మంచిర్యాల జిల్లా ముల్కల గోదావరి నది ఒడ్డున అమ్మవారి విగ్రహం బయటపడింది. దీంతో ఈ విగ్రహాన్ని చూసేందుకు ఆ పరిసర ప్రాంతాల్లోని గ్రామస్తులు పోటెత్తారు. అమ్మవారి విగ్రహానికి పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీగా భక్తులు తరలి రావడంతో ఆ ప్రాంతమంతా జనంతో కిక్కిరిసి పోయింది. దాంతో పోలీసులు రంగంలోకి దిగి ప్రజలు క్యూ లైన్ పాటించాలంటూ విజ్ఞప్తి చేశారు. ఒకానొక సమయంలో ప్రజలను అదుపు చేయడం పోలీసులకు కష్టంగా మారింది. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామమందిరం పూజారీతోపాటు పలువురు పీఠాధిపతులు, స్వామీజీలు గోదావరి పరిక్రమ యాత్ర చేపట్టారు. డిసెంబర్ 12వ తేదీన ఈ యాత్ర.. మంచిర్యాల జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా ముల్కల గోదావరి నది వద్ద పుష్కరఘాట్‌కు వెళ్లే మార్గంలో ప్రదేశాన్ని చూపించి.. ఈ ప్రాంతంలో ఏదో తెలియని శక్తి ఉందని వారు చెప్పారని గ్రామస్తులు తెలిపారు. ఈ స్థలం ప్రైవేట్ భూమి కావడంతో.. ఆ యజమాని అనుమతి తీసుకుని తవ్వకాలు జరిపినట్లు వారు చెప్పారు. ఈ ప్రదేశంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం తవ్వకాలు జరిపారని వివరించారు. ఈ సందర్భంగా సింహంపై కూర్చున్న దుర్గాదేవి విగ్రహం బయట పడిందన్నారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించామని తెలిపారు. అమ్మ వారి విగ్రహం బయటపడడంతో వారంతా హర్షం వ్యక్తం చేశారు. ఈ గ్రామంలో అమ్మ వారి విగ్రహం వెలుగులోకి రావడం తమ అదృష్టమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. అయితే ఈ ప్రాంతంలో దేవాలయం ఉందని స్వామిజీలు చెబుతున్నారని వివరించారు. దాంతో జేసీబీల సహాయంతో తవ్వకాలు జరుపుతున్నామని గ్రామస్తులు తెలిపారు.



# ప్రజాసేవే పరమార్థమైన మహా దాత మూర్తి రాజు

## - డిసెంబర్ 16... మూర్తిరాజు జయంతి



చింతలపాటి సీతా రామచంద్ర వరప్రసాద మూర్తిరాజు ప్రముఖ గాంధేయవాది. స్వాతంత్ర్య సమరయోధులు. వందలాది ఎకరాలు దానం చేసిన దాత...సర్వోదయ ఉద్యమానికి చేయూత...ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక...ఆక్వా పరిశ్రమకు ఆద్యుడు.. విద్యాదాత, అభినవ భోజుడు, గాంధేయవాది, సర్వోదయ నాయకుడు. పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయ ప్రముఖుడు. ఆయన కొల్లేరు రాజుగా గుర్తింపు పొందారు. చిన్ననాటనే రాజకీయాల్లో ప్రవేశించి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. 1952 నుంచి 1982 వరకు తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, పెంటపాడు నియో జకవర్గాల నుంచి పోటీ చేసి గెలు పొందారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్కెటింగు, గిడ్డంగులు, దేవాదాయ శాఖ మంత్రిగా పని చేశారు. ప్రోటెం స్పీకరుగా కూడా పనిచేశారు. మూర్తిరాజు తణుకు తాలూకా సత్యవాడలో 1919వ సంవత్సరం డిసెంబరు 16వ తేదీన . బాపిరాజు, సూరాయమ్మ దంపతులకు జన్మిం చారు. మగపిల్లలు పుట్టలేదని శ్రీరాముడిని వేడుకుంటూ భద్రా చలం శ్రీరాముని దర్శించారు.. భక్తి ప్రపత్తుల ఫలితంగా పుట్టినందున ఈయనకు సీతారామచంద్ర వర ప్రసాద మూర్తిరాజు అని నామ కరణం చేశారు. మూర్తిరాజుగారి బాల్యం కొంతమేర సత్యవాడలోనే గడిచింది. తరువాత నారాయణ పురంలో ఉండేవారు. ఇంటికి సమీపంలో గోదావరి ఏలూరు కాలువ పక్కనే పాకలు వేయించి, వాటిలో వివేకానంద మాధ్యమిక పాఠశాలను బాపిరాజు తమ స్వంత యాజ మాన్యంలో నిర్వహించేవారు. మూర్తిరాజు ఆ పాఠశాలలోనే మాధ్యమిక విద్య పూర్తిచేసారు. ఎనిమిదవ తరగతి వరకు అక్కడే చదివారు. మిడిల్ స్కూల్లో పిల్లలు ఎవరూ చేరలేదు. ఊరూరు తిరిగి,పాఠశాలను నిలబెట్టడానికి బాపిరాజు చాలా శ్రమించారు. ప్రభుత్వ అనుమతిని కూడా తెప్పించారు. అందునిమిత్తం 40ఎకరాల భూమిని హామీ ఇవ్వ వలసి వచ్చింది. స్కూల్ లో లక్ష్మీపతి ప్రధానోపా ధ్యాయులుగా, నరసింహాచార్యుల మంచి టీచర్లుగా ఉండేవారు. పాఠాలతోపాటు అనేక విషయాలు చెప్పేవారు. గాంధీ గురించి, ఆయన సిద్ధంతాల గురించి హృదయానికి హత్తుకునేలా చెప్పేవారు. వాస్త వానికి వారివల్ల దేశభక్తి అంటే ఏమిటో, ప్రజాసేవ అంటే ఏమిటొ మూర్తిరాజుకి తెలిసింది. మూర్తిరాజు తన జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేశారు. చిన్నతనంలోనే మహాత్మాగాంధీ ప్రభావం ఆయనపై పడి, చివరి వరకు నిజమైన గాంధేయవాదిగానే ఉన్నారు. మహాత్మాగాంధీ దేశ పర్యటనలో భాగంగా 1929లో జిల్లాకు వచ్చినప్పుడు చేబ్రోలు రైల్వేస్టేషనులో ఆయనను చూశారు. అప్పటి నుంచి గాంధీ మార్గంలోనే నడిచారు. గాంధేయ వాదిగా ముద్ర వేసుకొని సత్యం, అహింస, స్వదేశీ విధానాలను తాను ఆచరించడమే కాకుండా జిల్లా వ్యాప్తంగా వాటికి విశేష ప్రచారం కల్పించారు. మాంసా హారానికి దూరంగా ఉన్నారు. చిన్నతనం నుంచే ఖద్దరు వస్త్రాలను ధరించడం మొదలు పెట్టారు. అనేక మంది రాజకీయనాయకుల సభలకు హాజరయ్యేవారు. బాబూ రాజేంద్రప్రసాద్, జయప్రకాశ్ నారాయణ తణుకు వచ్చినపుడు, టౌన్ హాల్ లో బహిరంగ సభలు జరిగాయి. వారి ఉపన్యాసాలు మూర్తిరాజుని ఎంతగానో ఆకట్టుకోగా స్నేగితులలో కలిసి విద్యార్థి కాంగ్రెస్ ను ఏర్పాటు చేసారు. ఆయనను అధ్యక్షుడుగా ఉండమన్నారు. కార్యదర్శికి బాధ్యత ఎక్కువ కాబట్టి కార్యదర్శి పదవిని ఎంచుకున్నారు. ముళ్ళ పూడి హరిశ్చంద్రప్రసాద్ ను అధ్యక్షుడుగా చేశారు. విద్యార్థి కాంగ్రెస్ లోని వారంతా ఒకే తరగతిలోని విద్యార్థులు. కొవ్వలి గోపాలరావు, పుసులూరి కోదండ రామయ్య (ప్లీడరు), పొత్రాప్రగడ శ్రీరామారావు (ప్లీదదు), ముదిగంటి జగ్గన్నా శాస్త్రి మొదలైన నాయకులు తణుకు లోని కోమల విలాస్ దగ్గర గాంధీ బొమ్మ వద్ద సభలు జరిపేవారు. మూర్తిరాజు, స్నేహితులు కలసి సమావేశాలు ఏర్పాట్లు చేసేవారు. మూర్తిరాజు తణుకులో 1934 నుండి 1939 వరకు విద్యాభ్యాసం చేసారు. 1939 మార్చి నెలలో స్కూలు ఫైనల్ పరీక్ష జరగగా, అందులో ఫెయిలయ్యారు. దానితో చదువు మాని స్వగ్రామానికి తిరిగివెళ్ళారు. ఆతర్వాత చదువు కొనసాగిం చడానికి ప్రయత్నించలేదు. తన పక్క గ్రామమైన పెదనింద్ర కొలనులో పార్లమెంటు నమూనాలో గాంధీభవనం నిర్మించి ప్రజల స్మృతి పథం నుంచి మహాత్ముని చెరిగి పోకుండా చేశారు. సర్వోదయ ఉద్యమానికి ఊపిరులూదారు. 1955లో వినోభాబావే భూదానో ద్యమంలో భాగంగా జిల్లాకు వచ్చినప్పుడు 100 ఎకరాల భూమిని దానం చేశారు. 1961లో ఉంగుటూరు మండలం నాచు గుంటలో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం నిర్వహంచారు. విద్యా రంగంపై తిరుగులేని ముద్ర: విద్యా రంగంలో మూర్తిరాజు తనదైన ముద్ర వేశారు. భీమవరం, ఏలూరు నగరాలకే పరిమితమైన విద్యను గ్రామీణ ప్రాంతాలకు తీసుకొచ్చిన ఘనత ఆయనదే. తాను ఎస్ఎస్ ఎల్సీ వరకు చదివినా చదువు విలువ గుర్తించి ప్రతి ఒక్కరూ విద్యావంతులను చేయాలనే తపన పడేవారు. బాపిరాజు ధర్మసంస్థ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేశారు. వాటన్నింటికి దేశ నాయకుల పేర్లు పెట్టారు. కుటుంబంలో మహిళ చదువుకుంటే ఆ ఇల్లంతా విద్యావంతులవుతారనేది ఆయన దృఢ విశ్వాసం. అందుకోసం ఆయన జీవితాంతం కృషి చేశారు. కళల్ని సాహిత్యాన్ని ప్రేమించే మూర్తిరాజు కళాకారులకు ఎందరికో ఉపాధి చూపించారు. భూరి విరాళాలిచ్చి అభినవ భోజుడిగా పేరుపొందారు.. నేడు సినీరంగంలో ప్రముఖ హాస్య నటునిగా కొనసాగుతున్న ఎంఎస్ నారాయణ, పురాణ వ్యాఖ్యాత మైలవరపు శ్రీనివాసరావు ఆయన నెలకొల్పిన పాఠశాలల విద్యార్థులే. ప్రముఖ రచయిత, నటులు పరుచూరి గోపాలకృష్ణ ఆయన స్థాపించిన కళాశాలలో అధ్యాప కులుగా పనిచేశారు. మాజీ మంత్రులు దండు శివరామరాజు, మరో మాజీ మంత్రి కంతేటి సత్యనారాయణ రాజులు ఆయన శిష్యులే. శ్వాసకోశ, గుండె సంబంధ వ్యాధులతో 2012 నవంబర్ 12న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# ధనుర్మాసం వైశిష్ట్యం

**బృహత్సామ తథా సామ్నాం గాయత్రీ ఛందసామహమ్**
**మాసానాం మార్గశీర్షోహం ఋతూనాం కుసుమాకరః**

"వేదాలలో సామవేదాన్ని, ఛందస్సుల్లో గాయత్రీ ఛందస్సును, మాసాలలో మార్గశిర మాసాన్ని, రుతువులలో వసంత రుతువును" అంటూ సాక్షాత్తూ శ్రీ కృష్ణ పరమాత్ముడు భగవద్గీతలోని విభూతియోగంలో చెప్పిన శ్లోకమిది. మార్గశిర మాసానికి ఇంకొక ప్రాముఖ్యం ఉంది. పరమ పవిత్రమైన గోదాదేవి వ్రతం ఆరంభించి ఉపనిషత్తుల్యములైన పాశురములను అనుగ్రహించినది. "మార్గళంగల్ మదినిజైన్ద నన్నాళాల్ మార్గశిరము వచ్చినది. పూర్ణ చంద్రునితో కూడిన శుక్లపక్షము - వైష్ణవమాసము - మార్గశీర్షము అనగా భగవంతుని పొందుదారి- "నారాయణనే నమక్కే" అని శరణాగతి. భాగవతం దశమ స్కంధంలోనే భగవంతుని వెదకెడి ద్రోవలో హేమంతంలో ప్రథమ మాసంలో నందవ్రజ కుమారికలు భగవత్ ప్రసాదం "హవిష్యం భుంజానః" కాత్యాయనీ వ్రతం చేయుటకు పూనుకొన్నారని ప్రమాణం ఉన్నది. భాగవత దశమ స్కందంలో బమ్మెర పోతనామాత్యుడు, గోపభామలు "మార్గశీర్షవ్రతం" జరిపారని పేర్కొన్నాడు. జ్ఞానమును పెంపొందించే ధనుర్మాసంలో ఓంకారాన్ని ధనువుగా, ఆత్మను బాణంగా, బ్రహ్మమును లక్ష్యంగా చేసుకుని, సాధకులు నిర్మల, నిశ్చల మనస్కులై ఏకాగ్రత చిత్తంతో ధ్యానం చేస్తే, త్వరగా లక్ష్య సిద్ధి కలుగు తుందనేది విశ్వాసం. కాలాన్ని కొలిచేందుకు అనేక కొలమానాల్ని అనుసరిస్తారు. వాటిలో చాంద్రమాన, సౌర మానాలు ముఖ్యమైనవి. చంద్రుడు ఏ నక్షత్రంలో ఉంటే దానిని బట్టి చాంద్రమానం లెక్కిస్తారు. సూర్యుడు ఒక్కో రాశిని దాటడాన్ని బట్టి సౌరమానాన్ని లెక్కిస్తారు. ఆయా రాశులలో సూర్యుడు సంచరించే కాలమును సౌరమాసం అంటారు. సూర్యుడు ఒక రాశి నుండి మరో రాశిలోనికి ప్రవేశించ డాన్ని రాశి సంక్రమణం అంటారు. ఈ సంక్రమణం ప్రతి నెలలోను జరుగుతుంది. ధనుస్సు రాశిలో ప్రవేశించిన సమయం ధనుస్సంక్రమణం కాగా ధనుస్సులో సూర్యు డుండే కాలము ధనుర్మాసము అంటారు. సూర్యుడు ధనుస్సురాశిలో ప్రవేశించిన రోజు నుండి మకరరాశి లోకి ప్రవేశించు వరకు గల మధ్య రోజులను... సంక్రాంతికి ముందు ముప్పది రోజులను ధనుర్మాసమని అంటారు. సూర్యుడు ధను రాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం మొదలై, తిరిగి సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించే సంక్రాంతి రోజుతో ధనుర్మాసం ముగుస్తుంది. దక్షిణాయనానికి చివర, ఉత్తరాయ ణాయనానికి ముందుదే ధను ర్మాసం పరమ పవిత్రమైంది. ధనుర్మాసం అంటే దివ్య ప్రార్ధనకు అనువైన మాసం అని అర్థం. ధనుర్మాసం తెలుగు సంస్కృతిలో ఒక భాగం. దేవాలయాల్లో జరిగే కైంకర్యాలలో స్థానిక ఆచార వ్యవహారాలు, ఇతర సంప్రదా యాలు కలిసిన అంశాలలో ధనుర్మాసం ఒకటి. సంక్రాంతికి ఒక నెల ముందు నుంచి ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ధనుర్మాసం ప్రారంభాన్నే పల్లె సీమల్లో సంక్రాంతి నెల పట్టడము అంటారు. ధనుర్మాస వ్రతం దీని గురించి మొదట బ్రహ్మదేవుడు నారద మహర్షికి వివరించినట్లు పురాణ కథనం. ధనుర్మాస వ్రతానికి సంబంధించిన అంశాలు బ్రహ్మాండ, ఆదిత్య పురాణాలు, భాగవతం, నారాయణ సంహితాల్లోనూ కనిపిస్తాయి. విష్ణుమూర్తికి ఎంతో ప్రీతికరమైన మాసం ధనుర్మాసం. గోదాదేవి మార్గళి వ్రతం పేరుతో ధనుర్మాసంలో వ్రతాన్ని చేపట్టి నారాయణుని కొలిచింది. సాక్షాత్తు భూదేవి అవతారమైన అండాళ్ రచించిన దివ్య ప్రబంధమే తిరుప్పావై. ద్రవిడ భాషలో తిరు అనగా పవిత్రం, పావై అనగా వ్రతం అని అర్థం. వేదాలు, ఉపనిషత్తుల సారమే తిరుప్పావై అని పురాణాల ఆధారం. విష్ణుచిత్తుడి కుమార్తె గోదాదేవి మానవ మాత్రులని కాక శ్రీరంగ నాథుడినే వివాహం చేసుకుంటానని దీక్ష బూనుతుంది. ఆమె ధనుర్మాసంలో వేకువనే లేచి నిత్యం విష్ణువుని పూజిస్తూ తన అనుభూతిని, భావాలన్ని ఒక పద్యం అనగా పాశురం రూపంలో రచించేది. 30 పాశురాలను ఆ మాసంలో రచించి వాటిని విష్ణువుకు అంకితం చేసింది. ఆమె భక్తికి మెచ్చి విష్ణువు ప్రత్యక్షమై ఆమెను శ్రీరంగం రమ్మని చెపుతాడు. ఆమె ఈ విషయాన్ని తన తండ్రికి చెప్పడంతో ఆయన గోదాదేవిని తీసుకొని శ్రీరంగం చేరుకుంటాడు. రంగనాథస్వామితో వివాహం జరిగినంతనే గోదాదేవి ఆయన పాదాల చెంత మోకరిల్లి స్వామిలో అంతర్లీనమైపోతుంది. ధనుర్మాసం నెల రోజులు బ్రహ్మ ముహూర్తంలో నదీ స్నానాలు, పూజలు, జపాలు చేయడం, వైష్ణవ ఆలయాలను సందర్శిం చడం శుభప్రదం. ప్రతిరోజు సూర్యోదయానికి కంటే ఐదు ఘడియలు ముందుగా నిద్రలేచి కాలకృత్యాలను పూర్తి చేసుకుని, తలస్నానం చేసి నిత్య పూజలు ముగించి, అనంతరం ధనుర్మాస వ్రతాన్ని ఆచరించాలని పురాణాలు తెల్పుతున్నాయి. ఈ నెల రోజుల పాటు బాలికలు, మహిళలు తమ ఇళ్ల ముందు ప్రతి రోజూ అందమైన సంక్రాతి ముగ్గులు వేసి ఆవుపేడతో గొబ్బెమ్మలు చేసి ఆ ముగ్గుల మధ్యలో పెట్టి గొబ్బెమ్మల రూపంలో లక్ష్మీ దేవి రూపంగా పూలతో, పసుపు కుంకుమలతో అమ్మవారిని పూజిస్తారు. నెల రోజులూ హరిదాసుల కీర్తనలతో, జంగమ దేవరలతో, గంగిరెద్దులను ఆడించే వారితో సందడిగా వుంటుంది. ముంగిళ్ళలో కల్లాపి జల్లి, ముగ్గులతో కనుల విందుగా వుంటాయి. ధాన్యపు రాశులను ఇళ్ళకు చేర్చిన రైతుల సంబ రాలతో పల్లెలు "సంక్రాంతి "పండుగ కోసం ఎదురుచూస్తూ ఉండే కాలం ఇది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**



# ధనురాసోత్సవాలకు వేదిక అయిన ధర్మపురి క్షేత్రం

## డిసెంబర్ 16 నుండి ధనుర్మాస పూజలు ప్రారంభం

గోదావరీ తీరస్థ ప్రాచీన పుణ్య తీరమైన ధర్మపురి క్షేత్రం ధనుర్మాస ఉత్సవ వేడుకలకు వేదిక అయింది. దేవస్థానంలో ఉగ్ర, యోగానంద లక్ష్మీ సమేత నరసింహ, శ్రీ వేంకటేశ్వర దేవాలయాలతో పాటు గోదావరీ తీరస్థ శ్రీరామాలయం, సంతోషి మాత, సాయి బాలాజీ మందిరాలలో ఈ నెల 16వ తేదీ నుండి జనవరి 14వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్న ధనుర్మాస ప్రత్యేక ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు గావిస్తున్నారు. చైత్ర, వైశాఖ మాసములు, పాడ్యమి, విదియాది తిథులను చాంద్ర మానమును అనుసరించి లెక్కించడం జరుగుతుంది. ఔత్తరాహికులు బార్హస్పత్య మానమును అనుసరిస్తే, దక్షిణాత్యులు సౌర మానమును పాటించడం పరిపాటి. సూర్యోదయాస్తమయాదులు సౌర మానమునకు ఆధారములు. సూర్యుడు ఒక్కొక్క రాశిలో ప్రవేశించి, ఉండు నెల రోజులు అయా మాసములుగా గుర్తించ బడినవి. ఒక్కొక్క మాసము ఒక్కొక్క సంక్రాంతిగా చెప్పబడు చున్నది. నాగర ఖండ ప్రమాణము గానే మకర సంక్రాంతి (జనవరి 14) మొదలు కొని కర్కాటక సంక్రాంతి (జులై 10) వరకు ఉత్తరాయణము, తదాది మరల మకర సంక్రాంతి వరకు దక్షిణాయనముగా చెప్ప బడింది. ఇది మానవులు అనుసరించు కాలము కాగా, మానవులకు ఒక సంవత్సర ప్రమాణ కాలము దేవతలకు ఒక అహోరాత్రమైన దివసముగా పేర్కొన బడినది. అందున ఉత్తరాయణము దినము కాగా, దక్షిణాయణము రాత్రి భాగమగుచున్నది. ధనుస్సంక్రమణమైన మాసము దేవతలకు ఉషఃకాలముగును. అందుకే బ్రాహ్మీ ముహూర్తము నందు మేల్కొనాలి. అదే ప్రకారం దేవతలకు కూడా ధనుర్మాసం బ్రాహ్మీ ముహూర్త కాల మగు చున్నది. ఇట్టి సమయాన దేవతార్చన చాలా విశిష్టమైనదని స్పష్టమగు చున్నది. ముల్లోకాధిపతి యైన మహా విష్ణువు ఆషాఢము మొదలుకుని కార్తీకము వరకు నిదురించునని అట్టి భగనుని సూర్యుడు ధనుర్రాశి లో ప్రవేశించిన పిదప విష్ణు సంబంధమైన స్తోత్రాలతో మేల్కొలిపి , ఉషః కాల మందు శోడపోపచారములచే పూజించి, ముద్గాన్నము (పులగం), పొంగలి, చక్కెర పొంగలి) నివేదనం చేయాలి. సూర్యోదయం కన్నా ముందే ఉషః కాలమున అరుణోదయ సమయమున విష్ణుమూర్తిని నెల రోజులు పూజించాలని, అరుణోదయము అనగా ఉదయమునకు పూర్వము నాలుగు ఘటియలని, ఒక ఘటియ ఇరువది నాలుగు నిమిషములని, గంటన్నర పూర్వముగా స్కంద పురాణం వివరిస్తున్నది. ఈ నేపథ్యంలో ధర్మపురి క్షేత్ర విష్ణు సంబంధ ఆలయాలలో ఆనాదిగా, ధనుర్మాస ప్రత్యేక కార్యక్రమాలు ఆచరించడం సత్సంప్రదాయంగా మారింది. నెల రోజుల పాటు ఉదయాత్పూర్వం వివిధ ఆలయాలలో అభిషేకాలు, అర్చనలు, పూజలు, నిత్య కళ్యాణ సేవలను నిర్వహించేందుకు వలసిన ఏర్పాటును గానిస్తున్నారు. డిసెంబర్ 30
న వైకుంఠ ఏకాదశి తదితర ఉత్సవాలు, రంగ నాథుల కళ్యాణాది కార్యక్రమాలను ఘనంగా నిర్వహించ నున్నారు.

**సీతారామాలయంలో వేడుకలు...** సనాతన సాంప్రదాయాల సిరియైన గోదావరి తీరాన ధర్మపురి క్షేత్రంలో డిసెంబర్ 16వ తేదీ నుండి జనవరి 14వ తేదీ వరకు నెల రోజుల పాటు నిర్వహించనున్న ధనుర్మాసోత్సవ వేడుకల కోసం గోదావరి నది తీరాన వెలసిన శ్రీరామాలయంలో ప్రత్యేక ఏర్పాటు గావించారు. దక్షిణాభిముఖియై ప్రవహిస్తూ, విశేష ప్రాధాన్యతను సంతరించుకున్న పరమ పావనమైన గోదావరి నది తీరాన వెలసిన క్షేత్రంలోని అతి ప్రాచీన రామాలయంలో



ధనుర్మాస ఉత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తున్న క్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లను గావించడంలో నిర్వాహకులు నిరంతర నిమగ్న మైనారు. శ్రీరామాలయంలో దేశంలో వేరెచ్చటా లేని విధంగా, నల్ల శనపు రాతిపై సమంశ పద్ధతిలో చెక్క బడిన శ్రీరామ చంద్ర మూర్తికి మీసాలుండడం ఈ కోవెల విశేషం. పూర్వాభిముఖులైయున్న సీతారామ ఏక శిలా విగ్రహం, ప్రభపై దశావతారాలు, చత్రదారిగా భరతుడు, వింజామర వీస్తూ శత్రుఘ్నుడు, అనంత పద్మనాభ స్వామి, ఇరువురు దేవేరులతో కూడిన వేంకటేశ్వర, శివ పంచాయ తనాలతో శోభిల్లుతున్నది దేవాలయం. సూర్యుడు ధనుర్రాశి లో ప్రవేశించి, ధను సంక్రమణం కలుగు తున్నందున, దేవస్థాన పండిత వర్గ నిర్ణయం మేరకు 16వ తేదీ నుండి నెల రోజుల పాటు ఈ ఆలయంలో ఉత్సవాలు నిర్వహించ దానికి వలసిన ఏర్పాట్లు చేశారు. వంశ పారంపర్య అర్చకులు, జ్యోతిష్కులు దివంగత తాడూరి శివ రామయ్య ప్రారంభించి, రాష్ట్ర ఇతర ప్రాంతాలలో పురాణ ప్రవచనాలతో శిష్య సాంప్రదాయాన్ని కలిగిన కీర్తి శేషులు తాడూరి బాలకృష్ణ శాస్త్రి కొన సాగించిన, ఉత్సవాలను ఏటా ఘనంగా సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించడం ఆనవాయితి.

**దేవస్థానం వేళల్లో మార్పులు..** డిసెంబర్ 16న మధ్యాహ్నం ధనుర్మాసం ప్రారంభం కానున్నందున ధర్మపురి క్షేత్రంలో ఈనెల 17వ తేదీ నుండి విష్ణు సంబంధ ఆలయాలలో నెల రోజులపాటు ఉదయాత్పూర్వం నిర్వహించనున్న ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా సంబంధిత ఆలయాల వేళలలో మార్పులు చేయనున్నట్లు చేస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ తెలిపారు. మార్గశిర మాసం ధనుర్మాస ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 17వ తేదీ ప్రారంభమై జనవరి14 వరకు ప్రతినిత్యం ఉదయం 3-00 గంటలకు దేవాలయం తెరచి 4-00 గంటలకు అన్ని దేవాలయంలలో అభిషేకం ప్రారంభించబడునని, అలాగే 8-00 గంటలనుండి 2-30 గంటలవరకు అర్చనలు, హారతి టికెట్లు భక్తులకు ఇవ్వబడునని, తిరిగి 4-00 గంటలనుండి రాత్రి 6-00 గంటల వరకు అర్చనలు, హరతి టికెట్స్ భక్తులకు ఇవ్వబడునని తెలిపారు. సాయంత్రం 6-00 గంటలనుండి రాత్రి 7-00 గంటల వరకు స్వామి వారికి ఆరాధన, నివేదన కార్యక్రమంలు చేసి దేవాలయం మూసివేయ బడునని ఈఓ శ్రీనివాస్ వివరించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# దానం-ధ్యానం-నియమం: ధనుర్మాస జీవన సందేశం



ధనుర్మాసం భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో కేవలం ఒక కాలమానం కాదుబీ భక్తి, నియమం, త్యాగం, అంతర్ముఖతల సమ్మేళనంగా నిలిచిన మహత్తర జీవన సంస్కారం. సూర్యుడు ధనురాశిలో ప్రవేశించే సమయంలో ప్రారంభమయ్యే ఈ మాసం మార్గశిర%-%పుష్య మాస సంధికాలానికి చెందినది. వేదాలు, ఉపనిషత్తులు, ఇతిహాస%-%పురాణాలు ఈ కాలాన్ని 'దేవతల ఆరాధనకు అత్యంత అనుకూలమైన సమయం'గా గుర్తించాయి. అందుకే ధనుర్మాసాన్ని 'భక్తి మాసం', 'వైష్ణవ మాసం'గా విశేషంగా పిలుస్తారు. కాలగణన పరంగా చూస్తే ధనుర్మాసం సూర్యాధారంగా నిర్ణయించ బడుతుంది. సూర్యుడు ధనుస్సు రాశిలో సంచరిస్తున్నంత కాలమే ధనుర్మాసం. చంద్రాధార మాసాలకంటే భిన్నంగా, ఇది సౌర గమనానికి అనుసంధానమై ఉండడం వల్ల దీని ప్రాముఖ్యత మరింత పెరుగుతుంది. శాస్త్రాల ప్రకారం ఈ సమయంలో దేవతలకు రాత్రి సమయం అయినా, మనుషులకు తెల్లవారుజామునే దైవిక బ్రాహ్మ ముహూర్తంగా భావిస్తారు. అందుకే ఈ మాసంలో బ్రాహ్మ ముహూర్త స్నానం, జపతపాలు విశేష ఫలితాన్ని ఇస్తాయని నమ్మకం. భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఉద్ధవునికి బోధిస్తూ "మాసానాం మార్గశీర్షోహం" అని ప్రకటించాడు. మాసాలన్నింటిలో మార్గశిర మాసమే తనకు ప్రియమని చెప్పిన ఈ వాక్యం ధనుర్మాసానికి మూలాధారంగా నిలుస్తుంది. ఈ మాసంలో చేసిన పూజ, ఉపవాసం, దానం సాధారణ కాలంలో చేసినదానికంటే అనేక రెట్లు అధిక ఫలితాన్ని ఇస్తుందని భాగవత పురాణం, పద్మ పురాణం, స్కాంద పురాణాలు స్పష్టంగా పేర్కొన్నాయి. ధనుర్మాస వ్రతానికి గోదాదేవి (ఆండాళ్) అనుసంధానం అపూర్వమైనది. ఆమె రచించిన తిరుప్పావై పాశురాలు ధనుర్మాసానికి ప్రాణంగా నిలుస్తాయి. తెల్లవారు జామున లేచి, చలి నీటితో స్నానం చేసి, భగవంతుని నామస్మరణతో పాటు తిరుప్పావై పారాయణం చేయడం ద్వారా గోదాదేవి చూపిన భక్తి మార్గం నేటికీ అనుసరణీయంగా ఉంది. తిరుప్పావైలోని ప్రతి పాశురం తత్త్వ జ్ఞానంతో పాటు సామాజిక బాధ్యతను కూడా బోధిస్తుంది. వ్యక్తిగత మోక్షంతో పాటు సమూహ శ్రేయస్సే నిజమైన భక్తి అన్న భావన ఈ వ్రతంలో దాగి ఉంది. పురాణాలు ధనుర్మాసంలో దాన ధర్మాలకు విశేష స్థానం ఇస్తాయి. అన్నదానం, వస్త్రదానం, తిలదానం, గోదానం వంటి దానాలు ఈ కాలంలో అత్యంత పుణ్యప్రదమని పేర్కొంటాయి. స్కాంద పురాణం ప్రకారం ధనుర్మాసంలో చేసిన దీపదానం అజ్ఞానాంధకారాన్ని తొలగించి జ్ఞాన ప్రకాశాన్ని ప్రసాదిస్తుంది. "దీపో జ్ఞానప్రదో నిత్యం ధనుర్మాసే విశేషతః" అనే శ్లోకం ఈ భావనకు ఆధారం. అందుకే గ్రామాల నుంచి మహానగరాల వరకూ ఈ మాసంలో దీపారాధనకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది. ఆధ్యాత్మిక విశ్లేషణలో ధనుర్మాసం ఒక నియమబద్ధ జీవన శిక్షణ కాలంగా కనిపిస్తుంది. అతి భోగాన్ని తగ్గించి, ఆహార నియమాలు పాటించి, ఇంద్రియ నియంత్రణ సాధించాలన్నది ఈ మాసం బోధ. ఉపవాసం అంటే కేవలం ఆహారాన్ని త్యజించడం కాదుబీ దురాలోచనలను, దుష్ట ప్రవర్తనలను వదలడమే నిజమైన ఉపవాసమని శాస్త్రాలు చెబుతాయి. ఈ మాసంలో జపం, ధ్యానం, స్తోత్ర పఠనం ద్వారా మనస్సు శుద్ధి చెందుతుంది. శాస్త్రీయ కోణంలో చూసినా ధనుర్మాసానికి ప్రత్యేకత ఉంది. ఇది చలి కాలానికి చెందిన మాసం. ఉదయం స్నానం, నియమిత జీవన విధానం శరీర రోగనిరోధక శక్తిని పెంపొందిస్తాయని ఆయుర్వేదం సూచిస్తుంది. తేలికపాటి ఆహారం, నూనె దీపాల వెలుగు, ధ్యాన పద్ధతులు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి. ఈ విధంగా ఆధ్యాత్మిక ఆచారాలు శారీరక%-%మానసిక ఆరోగ్యానికి కూడా తోడ్పడతాయి. సామాజికంగా ధనుర్మాసం సేవా భావాన్ని పెంపొందించే కాలం. పేదలకు సహాయం, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, అవసరమైన వారికి వస్త్రాలు అందించడం ద్వారా 'సర్వే భవంతు సుఖినః' అనే ఉపనిషత్తు వాక్యాన్ని కార్య రూపంలోకి తీసుకు వస్తుంది. వ్యక్తిగత పుణ్యంతో పాటు సమాజ శ్రేయస్సు సాధించాలన్న దృక్పథమే ధనుర్మాస తత్త్వ సారం. అంతిమంగా ధనుర్మాసం మనిషిని లోకాసక్తి నుంచి లోకహితం వైపు నడిపించే ఆధ్యాత్మిక మహా పథం. ఇది కేవలం పూజలు, వ్రతాల పరిమితిలో ఆగిపోకుండా జీవన విధానాన్నే శుద్ధి చేసే సాధన. భక్తి, నియమం, దానం, సేవ అనే నాలుగు స్తంభాలపై నిలిచిన ఈ మాసం నిజంగా ఆచరించిన వారికి ఐహిక సౌఖ్యంతో పాటు ఆముష్మిక శ్రేయస్సును ప్రసాదిస్తుందన్నది శాస్త్రాల స్పష్టమైన నిర్ణయం. ధనుర్మాసం అనేది కాలచక్రంలో ఒక మాసం మాత్రమే కాదుబీ అది మనిషి జీవితాన్ని సార్థకత వైపు మళ్లించే అపూర్వ అవకాశ కాలం.

**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం

### బంగ్లా చేసిన పిచ్చి పని...భారత్ ఆగ్రహం

భారతదేశం ఎంతో సహన వంతమైన దేశంగా చెప్పుకుంటారు. అందరూ బాగుండాలి అందులో తాను ఉండాలని నమ్మే దేశంగా ప్రపంచంలో పేరుంది. విశ్వానికి మిత్రుడు అన్న పదం ఒక్క భారత్ కే సరిపోతుంది. శతృవు అన్న మాట భారత్ వైపు నుంచి ఉండదు, తమ జోలికి ఎవరైనా వస్తేనే మూడో కన్ను తెరుస్తుంది. పాక్ దాయాదిగా ఉంటూ శతృవుగా మారినా కూడా భారత్ ఎన్నో అవకాశాలు ఇచ్చింది. మారాలని కోరింది అయినా వినిపించుకోక తన బుద్ధి చూపించుకోగ్వడంతోనే ఆపరేషన్ సింధూర్ లాంటి గట్టి ప్రయోగం చేయాల్సి వచ్చింది. అలాగే సింధు జలాలను నిలుపు చేసి పాక్ గొంతు ఎండబెట్టాల్సి వచ్చింది.


**ఊపిరి పోసిన చోట :** ఇక మరో పొరుగు దేశం బంగ్లాదేశ్ గురించి చెప్పాలంటే ఆ దేశం ప్రతీ రోజూ భారత్ పేరు తలచుకోవాల్సిందే అని అంటారు. ఒక్కసారి చరిత్ర పుటల్లోకి వెళ్తే కనుక పాక్ కబంధ హస్తాల నుంచి తూర్పు పాకిస్తాన్ ని కాపాడి ఒక ప్రత్యేక దేశంగా ఏర్పాటు చేసిన మంచితనం భారత్ ది అని చెబుతారు. తూర్పు పాకిస్తాన్ ని అలా కనుక వదిలేసి ఉంటే ఈ రోజున బెలూచిస్తాన్ మాదిరిగా అన్ని విధాలుగా అణచివేతకు గురి అయి పాక్ చేతిలో హింస పడుతూ దిన దిన గండంగా ఉండేది. అంతకు ముందు కూడా మొదటి మూడు దశాబ్దాల పాటు అలాగే తూర్పు పాకిస్తాన్ హింసకు గురి అయింది భారత్ ని శరణు కోరడంతో న్యాయ సమ్మతంగా అది ఉండడంతో భారత్ శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో పాక్ తో యుద్ధం చేసి 1971లో బంగ్లాదేశ్ ఆవిర్భావానికి నాంది పలికింది. ఒక కొత్త దేశం ప్రపంచ పటం మీద ఊపిరి పోసుకోవడానికి దోహదదం అయింది. అంతటితో ఊరుకోలేదు నిన్నా మొన్నటి వరకూ ఆర్థికంగా అన్ని విధాలుగా బంగ్లాదేశ్ ని ఆదుకుంటూనే వచ్చింది. కానీ గత ఏడాదిన్నరగా మారిన పరిణామాలతో బంగ్లాదేశ్ భారత్ కి శతవుగా మారిపోయింది.

**విషం చిమ్ముతూ :** తన ఒకనాటి శత్రువు అయిన పాక్ తో చేతులు కలిపి భారత్ మీద విషం చిమ్మడంతో పోటీ పడుతోంది బంగ్లాదేశ్. ఆ దేశం తాజాగా చేసిన పిచ్చి పనికి భారత్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. పాక్ కి టెంపరరీగా ఒక ప్రధాని ఉన్నారు. ఆయనే మహమ్మద్ యూనస్. ఆయన భారత్ మీద అదే పనిగా తన వ్యతిరేకతను చాటుకుంటూనే ఉంటారు. తాజాగా ఈ పెద్ద మనిషి ఇంకో సారి భారత్ పై తనకు ఉన్న అసూయను వ్యతిరేకతను చాటుకున్నారు. భారత్ కు చెందిన కీలకమైన భూభాగాలను బంగ్లాదేశ్ దేశం మ్యాప్ లో ఆయన చూపించారు. ఇది ఒక విధంగా బరితెగింపు అని చెప్పాల్సి ఉంటుంది. అంతే కాదు చాలా గొప్పగా దానిని పాక్ నేస్తాలకు బహూకరించారు.

**పెడ ధోరణికి :** ఇదంతా బంగ్లాదేశ్ పెడ ధోరణికి నిదర్శనం అని అంటున్నారు తమది కానిది తమకు చెందనిది అయిన భూములను ప్రాంతాలను ఎలా కలుపుకుంటారు అని భారత్ లో ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఇది దిగజారుడు తనం చౌకబారుతనం బరితెగింపు అని అంటున్నారు. ఈ విధంగా తయారు చేసిన మ్యాప్ ని ఆయన పాకిస్థాన్ జనరల్ షంషాద్ మీర్జాకు ఇవ్వడం మరో రకమైన పైత్యానికి నిదర్శనంగా చూస్తున్నారు. ఇక బంగ్లా ఈ విధంగా రూపొందించిన మ్యాప్ లో చూస్తే భారత దేశంలోని ఈశాన్య రాష్ట్రాలు అన్నీ ఉండడం గమనార్హం. వాటిని తమ సొంతంగా సొత్తుగా బంగ్లా తాత్కాలిక పాలకుడు చూపించుకుంటూ మురిసిపోవడం కంటే తెంపరితనం వేరొకటి ఉండదని అంటున్నారు

**బంగ్లాకు తగిన గుణపాఠం :** ఈ మధ్యనే పాకిస్థాన్ కు చెందిన జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ ఛైర్ పర్సన్ జనరల్ షంషాద్ మీర్జా బంగ్లాదేశ్ లో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగానే ఆయనకు ఈ తాత్కాలిక ప్రధాని అయిన యూనస్ మహాశయుడు ఒక బుక్ ని ప్రజెంట్ చేశారు. ఆ బుక్ కి వేసిన కవర్ పేజి చిత్రంలో భారత్ లోని భూభాగాలను కలుపుకుంటూ ఉన్న మ్యాప్ లో ఉంది. భారత్ లో ఈశాన్యంలో ఏకంగా ఏడు రాష్ట్రాలు మావే అంటూ చేసిన ఈ మ్యాప్ ప్రదర్శన బంగ్లా బుద్ధిని బయట పెట్టింది. అంతే కాదు పిచ్చి తనాన్ని బయటపెట్టింది అని అంటున్నారు. దీని మీద మొత్తం భారతదేశం ఆగ్రహంగా ఉంది. సమయం చూసి భారత్ బంగ్లాకు తగిన గుణపాఠం చెప్పాలని అంతా కోరుకుంటున్నారు.

# సినీ సందర్శకుల మనసులు తెలిసిన ఆదుర్తి - డిసెంబర్ 16... ఆదుర్తి సుబ్బారావు జయంతి



నాటి సినీ ప్రేక్షకులకు ఎలాంటి సినిమాలు కావాలో సంపూర్ణంగా అవగాహన కలిగిన నిర్మాత, దర్శకులు ఆదుర్తి సుబ్బారావు. నాడు చిత్రం పేరు చివరన మనసులు ఉంటే ఆదుర్తి సినిమానే అని వేరే చెప్పాల్సిన అవసరం ఉండేది కాదని భావించే వారు. ఆదుర్తి సుబ్బారావు తెలుగు సినిమా రంగానికి చేసిన సేవలు ఎన్నో. ఆయన చిత్ర పరిశ్రమకు అందించిన ఆణిముత్యాలు ఎందరో. ఆదుర్తి సుబ్బారావు (డిసెంబరు 16, 1912 – అక్టోబరు 1, 1975) తెలుగు సినిమా దర్శకుడు, రచయిత, నిర్మాతగా, సంపాదకునిగా చిరపరిచితులు. తెలుగు సినిమా రంగంలో లబ్ధ ప్రతిష్టులు అయిన రచయితలు – ముళ్ళపూడి వెంకటరమణ (దాగుడు మూతలు), ఎన్. ఆర్. నంది (కన్నె మనసులు), డా. కొర్రపాటి గంగాధర రావు (ఇద్దరు మిత్రులు), మోదుకూరి జాన్సన్ (మరో ప్రపంచం), సత్యానంద్ (మాయదారి మల్లిగాడు)లను పరిచయం చేసిన ఘనత ఆదుర్తి సుబ్బారావుదే. అలాగే కె. విశ్వనాథ్, వి. మధుసూదన రావు, టి. కృష్ణ (ఖైదీ బాబాయ్ ఫేం), పెండ్యాల నాగాంజనేయులు (బుల్లెమ్మ ఫేం), టి. మాధవరావు ( తాళి బొట్టు ఫేం ), వై. చంద్ర శేఖర రెడ్డి, ఎం. మల్లిఖార్జున రావు ( గూఢాచారి 116 ఫేం ), ఎం. నందన కుమార్ ( ఇదేనా న్యాయం ఫేం ) ఆయన శిష్యరికంలో దర్శకులుగా ఎదిగిన వారే కావడం విశేషం. 1912 సంవత్సరం డిసెంబరు 16 న రాజమండ్రిలో తాసీల్దారు సత్తెన్న పంతులు ఇంట జన్మించిన ఆదుర్తి, సినిమాల మీద ఆసక్తితో తండ్రిని ఎదిరించి 1943 లో ముంబాయి లోని సెయింట్ జూనియర్ కాలేజ్ ఆఫ్ ఫోటోగ్రఫీలో చేరి ఫిల్మ్ లాబ్, ప్రోసెసింగ్, ప్రింటింగ్, ఎడిటింగ్ తదితర విభాగాలలో అనుభవం పొందారు. 'వనరాణి', 'మంగళ సూత్రం', 'ఒక రోజు రాజ', 'సర్కస్ రాజు' చిత్రాలకు మాటలు, పాటలు రాసారు. ఆనాడు సంచలనం రేపిన నాట్యాచార్యుడు ఉదయ శంకర్ నాట్యం ప్రధానాశంగా తాను తీస్తున్న 'కల్పన' చిత్రానికి సహాయ దర్శకుడిగా ఆదుర్తిని తీసుకున్నారు.ఆ చిత్ర నిర్మాణం కోసం ఆయన బొంబాయి నుండి మద్రాసుకు చేరారు. ఆ సమయంలోనే మచిలీపట్నానికి చెందిన కామేశ్వరీ బాలతో ఆయనకు వివాహం జరిగింది. అతని సోదరుడు ఆదుర్తి నరసింహమూర్తి ప్రచురించిన 'హారతి' పత్రికకు సంపాదకత్వం వహించారు. అది ఎక్కువకాలం నడవలేదు. కె.ఎస్. ప్రకాశరావు నిర్మించిన ' దీక్ష ' చిత్రానికి సహాయ దర్శకుడిగా పనిచేసి ప్రకాశరావు ప్రశంసలకు పాత్రులయ్యారు. 'సంక్రాంతి', 'కన్న తల్లి' చిత్రాలకు ఎడిటర్ గా పనిచేశారు. ప్రకాశరావు 'బాలా నందం' చిత్రానికి రెండవ యూనిట్ దర్శకుడుగా పనిచేశారు. ప్రకాష్ స్టూడియోలో పనిచేసిన డి. బి. నారాయణ, ఎస్. భావ నారాయణ ప్రోత్సాహంతో వారితో కలిసి సాహిణీ ప్రొడక్షన్స్ సంస్థను స్థాపించి 'అమరసందేశ ' అనే చిత్రాన్ని తన దర్శకత్వంలో నిర్మించారు. 1954 లో విడుదలైన ఆ చిత్రమే ఆయన తొలిసారిగా దర్శకత్వం వహించిన చిత్రం. ఆ చిత్రంలో ఆయన చూపించిన ప్రతిభ అన్నపూర్ణ పిక్చర్స్ లో ఆయన ప్రవేశానికి నాంది అయింది. ఆ సంస్థకు తొమ్మిది తెలుగు చిత్రాలు, మూడు తమిళ చిత్రాలు రూపొందించారు. తమిళ నిర్మాత సి. సుందరంతో కలిసి బాబూ మూవీస్ సంస్థను స్థాపించి 'మంచి మనసులు', 'మూగమనసులు', 'తేనెమనసులు', 'కన్నె మనసులు' చిత్రాలు నిర్మించారు. 'తేనె మనసులు' తెలుగులో మొదటి సాంఘిక రంగుల చిత్రం. అంతే కాదు అందరూ కొత్త నటీనటులతో తీసిన మొదటి చిత్రమని కూడా చెప్పవచ్చు. సూపర్ స్టార్ కృష్ణకు హీరోగా మొదటి చిత్రం. మొదట ఆరు రీళ్ళు నలుపు తెలుపులో తీసి నచ్చక మళ్ళీ రంగుల్లో తీసారు. ఆ చిత్రం సంచలనం సృష్టించింది. ఆయన హిందీలో 'మిలన్' (మూగ మనసులు), 'డోలీ' (తేనె మనసులు), 'జ్వార్ భలా' (దాగుడు మూతలు), ' మన్ కా మీత్ ' లాంటి సుమారు పది చిత్రాలకు దర్శకత్వం వహించారు. 'దర్పణ్', 'జీత్' (పూలరంగడు) చిత్రాలను స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఆయన అన్నపూర్ణా సంస్థకు నిర్మించిన ' డా.చక్రవర్తి ' చిత్రానికి నంది బహుమతి వచ్చింది. ఆ బహుమతిగా వచ్చిన నగదు పెట్టుబడిగా అక్కినేని నాగేశ్వరరావు తో కలిసి చక్రవర్తి చిత్ర సంస్థను స్థాపించి ప్రయోజనాత్మక చిత్రాలు 'సుడి గుండాలు', ' మరో ప్రపంచం' నిర్మించారు. అవి ఆర్థికంగా విజయం సాధించక పోయినా తనకు సంతృప్తినిచ్చిన చిత్రాలుగా ఆయన చెప్పేవారు. తన ఏకైక పుత్రుడు సాయి భాస్కర్ నిర్మాతగా రవి కళా మందిర్ స్థాపించి 'మాయదారి మల్లిగాడు', 'గాజుల కిష్టయ్య' చిత్రాలు నిర్మించారు. తర్వాత 'మహాకవి క్షేత్రయ్య' చిత్రానికి దర్శకత్వం వహిస్తూ షూటింగ్ ప్రారంభించిన తొలి రోజుల్లోనే తీవ్ర అనారోగ్యానికి గురై గాజుల కిష్టయ్య చిత్రం విడుదల కాకుండానే 1975 అక్టోబరు 1 వ తేదీన తనువు చాలించారు. ఆయన కుమారుడు సాయి భాస్కర్ తర్వాత 'సిరిమల్లె నవ్వింది' చిత్రం నిర్మించారు. భాస్కర్ కళా తపస్వి కె. విశ్వనాథ్ గారి దగ్గర 'సప్తపది' చిత్రానికి సహకార దర్శకుడిగా పనిచేశారు. తరువాత చిత్ర రంగంలో ప్రవేశించి పూలరంగడు, గాజుల కిష్టయ్య మొదలైన 26 చిత్రాలు, 9 తమిళ చిత్రాలకు దర్శకత్వం వహించాడు. ఇతని చిత్రాలు నిర్మాతలకు విశేష లాభాలు ఆర్జించి పెట్టాయి. మహాకవి క్షేత్రయ్య (1976), గాజుల కిష్టయ్య (1975), గుణ వంతుడు (1975), సునెహరా సంసార్ (1975), బంగారు కలలు (1974), జ్వర్ భట (1973), ఇన్సాఫ్ (1973), మాయదారి మల్లిగాడు (1973), జీత్ (1972), విచిత్ర బంధం (1972), రఖ్ వాలా (1971), మస్తానా (1970) దర్పన్ (1970), మరో ప్రపంచం (1970), పూల రంగడు (1970) డోలి (1969), మన్ కా మీత్ (1968), మిలన్ (1967), సుడి గుండాలు (1967), కన్నె మనసులు (1966), సుమంగళి (1965), తేనె మనసులు (1965) తోడు నీడ (1965), దాగుడు మూతలు (1964), డాక్టర్ చక్రవర్తి (1964), వెలుగు నీడలు (1964), చదువుకున్న అమ్మాయిలు (1963), మూగ మనసులు (1963), మంచి మనసులు (1962), ఇద్దరు మిత్రులు (1961), ఎంగళ్ కుల దైవి (1959), నమ్మిన బంటు (1959), ఆడ పెత్తనం (1958), మాంగళ్య బలం (1958), తోడి కోడళ్ళు (1957), అమర సందేశం (1954), డోలి (1969), మిలన్ (1967), సుడిగుండాలు (1967), తేనె మనసులు (1965) చదువుకున్న అమ్మాయిలు (1963), మాంగల్య బలం (1958), తోడికోడళ్ళు (1957) తదితర చిత్రాలకు రచయిత/ దర్శకత్వం వహించారు. గాజుల కిష్టయ్య (1975), మాయదారి మల్లిగాడు (1973) జీత్ (1972) (హిందీ), దర్పన్ (1970) (హిందీ) తదితర చిత్రాలకు నిర్మాతగా వ్యవహరించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# బంగ్లాదేశ్ దేశం ఆవిర్భవించిన దినం - డిసెంబర్ 16...విజయ్ దివస్




1971 డిసెంబర్ 16వ తేదీ, భారత దేశ చరిత్రలో ఒక మహోన్నతమైన రోజు. ఈ రోజు భారత సైన్యం పాకిస్తాన్‌తో తలపడి, అద్భుతమైన విజయాన్ని సాధించి, బంగ్లాదేశ్ అనే కొత్త దేశ ఆవిర్భావానికి మార్గం సుగమం చేసింది. ఈ విజయాన్ని స్మరించుకుంటూ విజయ్ దివస్‌ను ప్రతి సంవత్సరం డిసెంబర్ 16న ఘనంగా జరుపుకుంటాం.

**యుద్ధానికి నేపథ్యం...** 1971లో, పాకిస్తాన్ రెండు విభిన్న ప్రాంతాలుగా ఉండేది... పశ్చిమ పాకిస్తాన్ (ప్రస్తుత పాకిస్తాన్), తూర్పు పాకిస్తాన్ (ప్రస్తుత బంగ్లాదేశ్). తూర్పు పాకిస్తాన్ ప్రజలు పశ్చిమ పాకిస్తాన్ ప్రభుత్వంపై భాషా వివక్ష, ఆర్థిక దోపిడి, రాజకీయ హక్కుల కొరత వంటి అనేక అన్యాయాలకు గురయ్యారు. తూర్పు పాకిస్తాన్ నాయకత్వం వహించిన శేఖ్ ముజిబుర్ రెహమాన్ నేతృత్వంలో ప్రజలు తిరుగుబాటు చేపట్టారు. 1971లో జరిగిన ఎన్నికల్లో అవామీ లీగ్ (తూర్పు పాకిస్తాన్ ప్రధాన పార్టీ) ఘనవిజయం సాధించినప్పటికీ, పశ్చిమ పాకిస్తాన్ ప్రభుత్వం అధికారాన్ని అప్పగించడానికి నిరాకరించింది. దీనితో ఆగ్రహించిన తూర్పు పాకిస్తాన్ ప్రజలు స్వాతంత్ర్య పోరాటం చేపట్టారు. మార్చి 25, 1971న పాకిస్తాన్ సైన్యం తూర్పు పాకిస్తాన్‌లో 'ఆపరేషన్ సర్చ్‌లైట్' పేరుతో తీవ్రమైన దమనకాండకు తెర లేపింది. ఈ చర్యల కారణంగా వేలాది మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడులను తట్టుకోలేక లక్షలాది శరణార్థులు భారత దేశం లోకి ప్రవేశించారు. ఇది భారత దేశానికి తీవ్రమైన ఆర్థిక భారం, జాతీయ భద్రత సమస్యలను సృష్టించింది.

**భారత దేశం పాత్ర..** తూర్పు పాకిస్తాన్ పరిస్థితులను చూసిన భారత దేశ ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ, ముక్తి బాహిని (తూర్పు పాకిస్తాన్ స్వాతంత్ర్య పోరాట సైన్యం)కి మద్దతు ప్రకటించారు. దీనితో పాకిస్తాన్ రగిలిపోయి డిసెంబర్ 3, 1971న భారతదేశ వైమానిక స్థావరాలపై దాడి చేసింది. ఈ చర్యతో భారత దేశం యుద్ధంలో ప్రవేశించాల్సి వచ్చింది. భారత సైన్యం, నౌకాదళం, వాయుసేన సమన్వయంతో పాకిస్తాన్ సైన్యంపై దాడి చేసింది.

**యుద్ధం... 13 రోజుల ఘనత...** డిసెంబర్ 3న ప్రారంభమైన ఈ యుద్ధం కేవలం 13 రోజులు మాత్రమే సాగింది, కానీ ఈ కొద్ది కాలంలో భారత సైన్యం అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించింది. తూర్పు పాకిస్తాన్‌లో విజయాలు...భారత సైన్యం తూర్పు పాకిస్తాన్ నగరాలైన ఖుల్నా, జెసోర్, ఢాకాలను త్వరగా స్వాధీనం చేసుకుంది. నౌకాదళ విజయం... భారత నౌకాదళం పాకిస్తాన్ నౌకాదళ స్థావరాలపై దాడి చేసి, వాటి సామర్థ్యాలను నిర్వీర్యం చేసింది. వాయుసేన ప్రభావం...భారత వాయుసేన పాకిస్తాన్ సైనిక స్థావరాలను ధ్వంసం చేసింది, ఇది యుద్ధ విజయానికి కీలకంగా నిలిచింది. డిసెంబర్ 16, 1971న, పాకిస్తాన్ తూర్పు కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఏఏకే నియాజీ, తన 93,000 మంది సైనికులతో కలిసి, భారత ఈస్టర్న్ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ జగ్జిత్ సింగ్ అరోరా ఎదుట లొంగి పోయారు.

**బంగ్లాదేశ్ ఆవిర్భావం...** ఈ యుద్ధ ఫలితంగా బంగ్లాదేశ్ అనే కొత్త దేశం ఆవిర్భవించింది. డిసెంబర్ 16న, ఈ స్వతంత్ర దేశం రూపు దాల్చింది, ఇది దక్షిణ ఆసియా చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచింది.

**విజయ్ దివస్ ప్రాముఖ్యత...** విజయ్ దివస్ మనకు భారతదేశ సైన్యపు వీరోచితతను, దేశభక్తిని, అతుల్య త్యాగాలను గుర్తు చేస్తుంది. సైనిక సత్తా... భారతదేశ సైన్యం తన ప్రావీణ్యంతో, త్యాగాలతో ప్రపంచానికి తన శక్తిని చాటింది. భారతదేశ ప్రతిష్ట... ఈ విజయంతో భారత దేశం ప్రపంచ దేశాల ముందు ఒక ప్రముఖ శక్తిగా ఎదిగింది. శాంతికి పాటుపడిన దేశం... ఈ విజయం భారత దేశం శాంతికి మరియు ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉందని రుజువు చేసింది.

**విజయ్ దివస్ వేడుకలు...** ప్రతి సంవత్సరం డిసెంబర్ 16న, విజయ్ దివస్ సందర్భంగా, సైనిక స్మారక చిహ్నాల వద్ద నివాళులు అర్పిస్తారు. దేశవ్యాప్తంగా ఊరేగింపులు జరుగుతాయి. యుద్ధ వీరులను స్మరించి సైనిక వీర చరిత్రలు మననం చేయబడతాయి. విజయ్ దివస్, భారత దేశపు సైనిక సమర్థతను మాత్రమే కాదు, దేశ ప్రగతికి, శాంతికి, ప్రజాస్వామ్యానికి కీలకమైన వ్యక్తీకరణ. ఇది ప్రతి భారతీయుడిలో గర్వాన్ని, దేశభక్తిని నింపుతుంది. 1971 విజయంలో భాగస్వామ్యం అయిన ప్రతి సైనికునికి, ప్రజానీకానికి ఈ రోజు గౌరవ సూచికంగా నిలుస్తుంది. ఈ రోజు భారత దేశానికి సేవ చేయడంలో ఉన్న గొప్పతనం, ప్రతిబద్ధత, మరియు కృతజ్ఞత భావం గుర్తు చేస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# వచన కవితా పితామహుడు కుందుర్తి - డిసెంబర్ 16...కుందుర్తి ఆంజనేయులు జయంతి



అభ్యుదయ కవి గా, రచయితగా, వచన కవితా ఉద్యమ ఆధ్యునిగా, నయాగరా కవులలో ఒకరిగా తెలుగు సాహితీ ప్రియులకు సుపరిచితుడు వచన కవితా పితామహుడు అనే బిరుదాంకితుడైన కుందుర్తి ఆంజనేయులు. ఆయన అభ్యుదయ కవి, ప్రముఖ తెలుగు రచయిత. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత. తన కవిత్వంతో తెలంగాణా సాయుధ పోరాటానికి అజ్యం పోసిన కవులలో ప్రముఖుడు. పాతకాలం పద్యమైతే, వర్తమానం వచన గేయం....అని ఎలుగెత్తి చాటిన వచన కవితోద్యమకారుడు కుందుర్తి. సాంప్రదాయ పద్యానిదే పై చేయిగా ఉన్నరోజుల్లో ఛందస్సు పై తిరుగుబాటు బావుటా ఎగురవేశారు కుందుర్తి. ఆంజనేయులు 1922 డిసెంబర్ 16 న కామయ్య , నరసమ్మ దంపతులకు నర్సారావు పేట సమీపంలోని కోట వారి పాలెంలో వ్యవసాయ బ్రాహ్మణ కుటుంబములో జన్మించాడు. ఆయన వినుకొండలో చదువుకున్న కాలములో గుర్రం జాషువా ఆయనకు తెలుగు మాష్టారుగా బోధించారు. 1936 నుండి 1941 వరకు విజయవాడ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలలో చదివాడు. అక్కడే 1937లో కవిత్వం వ్రాయటం ప్రారంభించాడు. విజయవాడ ఎస్.ఆర్.ఆర్.కళాశాలలో అయన కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వద్ద శిష్యునిగా ఉన్నాడు. ఆ తరువాత గుంటూరు ఆంధ్రా క్రైస్తవ కళాశాల నుండి బి.ఏ ఉత్తీర్ణుడు అయినాడు. ఆంజనేయులు నరసరావుపేటలో నవ్యకళా పరిషత్తు స్థాపించాడు. ఆ కాలంలోనే ఆయన కమ్యూనిష్టు భావాలకు ఆకర్షితుడైనాడు. దేవేంద్రపాడు గ్రామములోని రెసిడెన్షియల్ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయునిగా, ప్రిన్సిపాలుగా పనిచేశాడు. అనంతరం గుంటూరు పొగాకు మార్కెట్ లో పని చేశాడు. 1956లో కర్నూలులో సమాచార ప్రసారశాఖలో అనువాదకునిగా చేరాడు. ఆ తరువాత హైదరాబాదుకు బదిలీ అయ్యాడు. 1958లో ఫ్రీవర్స్ ఫ్రంట్ స్థాపించాడు. 1967లో యువతలో వచన కవిత్వాన్ని ప్రోత్సహించ డానికి ఉత్తమ వచన కవిత్వానికి ఒక బహుమతి అందజేయడం ప్రారంభించాడు. 1977లో ఉద్యోగ జీవితము నుండి విరమణ పొందాడు. 1944లో కుందుర్తి అంజనేయులు... ఏల్చూరి సుబ్రహ్మణ్యం, బెల్లంకొండ రామదాసులతో కలిసి మొట్టమొదటి కవితా సంకలనం నయగారా ప్రకటించాడు. ఈ ముగ్గురూ నయగారా కవులుగా ఆధునిక తెలుగు సాహిత్యములో ప్రసిద్ధి చెందారు. అంజనేయులు సమగ్ర రచనలు 1974లో ప్రచురించ బడినవి. తెలంగాణ కవితా సంపుటిలో మొత్తం 26 కవితలున్నాయి. కుందుర్తి అనేక పురస్కారాలు అందుకున్నాడు. వాటిలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, రాష్ట్ర సాహిత్య అకాడమీ అవార్డుతో పాటు 1969లో అందుకున్న సోవియట్ లాండ్ నెహ్రూ పురస్కారము ప్రతిష్ఠాత్మకమైనవి.

మహా భారతం తరహాలో తెలంగాణా పోరాట కథను 18 పర్వాలు గా విభజించి తొలిసారిగా వచన కవిత్వంలో మహా కావ్యాన్ని రాసిన ఘనత కుందుర్తి కే దక్కుతుంది. సాహిత్యాన్ని పామరులకు సైతం దగ్గరగా తీసుకు వెళ్లిన గొప్పతనం వచనానిదే. అందుకే కుందుర్తి వచన కవిత్వానికి ఆద్యుడైనాడు. కుందుర్తి పేరు జ్ఞప్తికి తెచ్చుకుంటే గుర్తుకు వచ్చే కవిత " నగరంలోని వాన".నగరంలో వాన కవిత్వం నా ఊహాంచలాల్లో కదిలాడుతున్నట్లు జల్లులు జల్లులై కురుస్తుంది " అంటూ మొదలై, నగరంలో కురిసే వాన మనుషులతో ఆడే దాగుడు మూతలు , నగర వాసులకు కలిగించే ఇబ్బందులు, అప్పుడప్పుడు చూపించే కనికరం అన్నింటిని హృద్యంగా వర్ణించాడు కుందుర్తి. గాంధీజీ హతుడైన సందర్భంలో "మహాత్ముడిక లేడు" అనే కవితలో " గౌరీ శంకర శిఖరం యేరుగా పారింది, గంగానది శోక బాష్పములు కాల్వలు కట్టింది, వెన్నెల హృదిలో, తమస్సు తెర విరిసింది, నీవు వాటికి సహోదరుడువు, వాటి కీర్తికి సహోదరుడవు" అంటూ వర్ణించాడు. ఆయన రచనలలో సౌప్తికం, రసధుని, అమావాస్య, నా ప్రేయసి, నయాగరా, తెలంగాణ, దండియాత్ర, ఆషా, నగరంలో వాన, నాలోని వాదాలు, హంస ఎగిరిపోయింది, తీరా నేనుకాస్త ఎగిరిపోయాక, మేఘమాల, ఇది నా జెండా, కుందుర్తి పీఠికలు, కుందుర్తి వ్యాసాలు, బతుకు మాట మొదలైనవి ముఖ్యమైనవి. వచనాన్ని సాహిత్యముగా పరిగణించని రోజులలో కందుర్తి వచన కవిత్వాన్ని ప్రోత్సహించాడు. సాంప్రదాయ పద్య కవిత్వము గతమని, వచన కవిత్వము వర్తమానమని చాటాడు. 1982 అక్టోబర్ 25న మరణించాడు.

ఆయన మరణించిన తరువాత ప్రముఖ సాహితీ సమితి రంజని ఆయన పేరిట 1984 నుంచి ఇప్పటి వరకు ఏటేటా వచన కవితల పోటీలు నిర్వహించి అవార్డులు ప్రకటిస్తూ ఉంది. మరణించిన తరువాత కూడా ఆయన యువ కవులకు ఈ విధంగా స్ఫూర్తి ప్రదాతగా నిలిచే ఉన్నాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

చురకలు
మంగళవారం 16 డిసెంబర్ 2025

# గ్లోబల్ గుర్తింపు

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లాకే ప్రత్యేకమైన జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి పోచంపల్లి ఇక్కత్ డిజైన్ పట్టుచీర, పుట్టపాక తేలియా రుమాల్. వీటిని హైదరాబాద్‌లో నిర్వహించిన 'గ్లోబల్ సమిట్'లో తెలంగాణ రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలోని 'టెస్కో' సంస్థ ప్రత్యేకంగా ప్రదర్శించాయి. ప్రపంచం నలుమూలల నుంచి మేళాలో పాల్గొన్న ప్రముఖులు, దిగ్గజ పారిశ్రామికవేత్తలు, దేశాధినేతలు, భారత ప్రభుత్వ ప్రతినిధులు ఈ ప్రత్యేక వస్త్రాలను తిలకించారు. చేనేత కళాకారుల సృజనతో రూపుదిద్దుకున్న, జాతీయ భౌగోళిక గుర్తింపు సాధించిన ఈ వస్త్రాల ప్రదర్శనతో అంతర్జాతీయ మార్కెట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించింది. ఈ వస్త్ర ప్రదర్శన



ఈ నెల 13 వరకు గ్లోబల్ సమిట్ ప్రాంగణంలో కొనసాగుతుంది.
అసలు 'పట్టు' కథ: నిలువు, పేక మల్బరీ పట్టుకు ప్రకృతి దృశ్యాలను ప్రతిబింబించే డిజైన్లు వేసి, వాటికి రంగులద్ది, మగ్గంపై ఒక్కో పోగును అల్లుతూ కుటుంబమంతా శ్రమించి పట్టు చీరలను తయారు చేస్తారు. ఇక్కత్ అనే విధానంలో చేతి మగ్గంపై వస్త్రాలు నేయడం ఈ ప్రాంతానికి మాత్రమే ప్రత్యేకమని గుర్తించి 2003–04లో 'పోచంపల్లి ఇక్కత్ పట్టుచీర' భౌగోళిక గుర్తింపు(జీఐ)ను ప్రకటించారు.

**ఎందుకంత ప్రత్యేకత:** పత్తితో తయారు చేసిన నూలు దారాన్ని నువ్వుల నూనెలో కొన్ని రోజుల పాటు నానబెట్టి, తర్వాత కరక్కాయ పొడి, ఇతర సేంద్రియ పదార్థాలతో శుద్ధి చేసి, ప్రకృతి నుంచి సేకరించిన రంగులద్ది ఆ దారంతో ప్రత్యేకమైన జామెట్రికల్ డిజైన్లతో తేలియా రుమాళ్లను పుట్టపాకలోని చేనేత కళాకారులు మగ్గాలపై తయారు చేస్తారు. ఈ వస్త్రాలు పుట్టపాకకు మాత్రమే ప్రత్యేకమని గుర్తించి పుట్టపాక తేలియా రుమాల్ 2019–20లో భౌగోళిక గుర్తింపు(జీఐ) సాధించింది.

# నత్తనడకన.. రైల్వేస్టేషన్ ఆధునికీకరణ

కామారెడ్డి : అమృత్ భారత్ కింద రెండేళ్ల క్రితం ప్రారంభమైన కామారెడ్డి రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు అపరిష్కృతంగానే ఉన్నాయి. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. మీటర్ గేజ్ నుంచి బ్రాడ్‌గేజ్ స్థాయికి మారాక రైళ్ల రాకపోకలు మెరుగుపడ్డాయి. పదేళ్ల క్రితం ఆదర్శ స్టేషన్‌గా ఎంపికై రూ.6 కోట్ల నిధులతో ప్రగతి పనులు చేపట్టాక ప్రయాణికులకు సౌకర్యవంతంగా మారింది. ఆ తర్వాత రెండేళ్ల క్రితం రూ.39.84 కోట్ల కేంద్ర నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో మెరుగైన వసతులపై యంత్రాంగం దృష్టి పెట్టినా రెండేళ్ల నుంచి పనులు నత్తనడకన సాగుతూనే ఉన్నాయి.

**జరుగుతున్న పనులివే..**
స్టేషన్ ఆవరణలో 3 లిఫ్టులు, 2 ఎస్కలేటర్ల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 12 మీటర్ల వెడల్పుగల పాదచార వంతెన నిర్మించారు. స్టేషన్ ప్రాంగణంలో కళలు, సంస్కృతి వర్ణించే బొమ్మలు ఏర్పాటు చేయలేదు. స్టేషన్ భవనం ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. పాత భవనాన్ని కూల్చకుండా ఉన్నదానికే



మెరుగులద్దుతున్నారు. హైలాండ్ ఏర్పాటు ఇంకా జరగలేదు. పార్కింగ్ షెడ్లు, టికెట్ బుకింగ్ కేంద్రాల నవీకరణ ఇంకా మొదలు కాలేదు. ఈ డిసెంబర్ నెలాఖరు వరకు పనులు పూర్తి చేయడానికి లక్ష్యం నిర్దేశించగా.. ఇంకా 35–40 శాతం పనులు అపరిష్కృతంగా ఉన్నాయి. ఆర్థిక సంవత్సరం ముగింపులోపైనా పనులు పూర్తి చేసేనా అనే సందిగ్ధం నెలకొంది.

**ముఖద్వార విస్తరణపై సందిగ్ధం**
జిల్లా కేంద్రంలో స్టేషన్‌రోడ్డులో 94 మడిగెలు ఉన్నాయి. ముఖద్వార విస్తరణలో భాగంగా మడిగెలను తొలగించాలని ఇప్పటికే బల్దియా అధికారులు వ్యాపారులకు నోటీసులు ఇచ్చారు. ద్వారాన్ని విశాలంగా మారిస్తే పట్టణంలో ఈ మార్గ రూపురేఖలు మారిపోయే వీలుంది. ఇప్పటివరకు దీనిపై స్పష్టత కరవైంది. ఈ విషయమై పురపాలక కమిషనర్ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మరో నోటీసు అందజేసేందుకు యంత్రాంగం సిద్ధమవుతోంది.

**పూర్తికాని నవీకరణ**
కామారెడ్డి రైల్వేస్టేషన్‌ను సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో నాన్ సబర్బన్ గ్రేడ్ 4గా వర్గీకరించారు. ఈ స్టేషన్ వద్ద సికింద్రాబాద్, నాగర్‌సోల్, ముంబయి, నాందేడ్, తిరుపతి, బెంగళూరు తదితర ప్రాంతాలకు ముఖ్యమైన రైళ్లు ఆగుతాయి. స్టేషన్ నవీకరణకు కేంద్ర నిధులు మంజూరుకావడంతో అభివృద్ధిపై ఈ ప్రాంతవాసుల్లో ఆశలు నెలకొన్నాయి. కానీ ఇంకా పనులు పూర్తికాక ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

# హద్దులపై ఆందోళన వద్దు



హైదరాబాద్: డివిజన్ల పునర్విభజనపై జీహెచ్ఎంసీకి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. రెండు రోజుల్లోనే 320 వరకు ఫిర్యాదులు వచ్చాయి. కొత్త హద్దులతో కూడిన పటాలు ఇవ్వకుండా.. అభ్యంతరాలు, ఫిర్యాదులు ఆహ్వానించడం ఏంటని భాజపా, ఎంఐఎంలతో పాటు అధికార పార్టీ కాంగ్రెస్ నేతలు గగ్గోలు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో బల్దియా అధికారులు ఆన్‌లైన్‌లో డివిజన్ల హద్దులతోపాటు మరికొంత సమాచారాన్ని అందుబాటులోకి ఉంచాలని నిర్ణయించారు. అదే సమయంలో.. కొన్ని డివిజన్ల పేర్లు, హద్దులను మార్చాలని గురువారం ఉన్నతాధికారులు ఏకాభిప్రాయానికొచ్చారు.

**5 కి.మీ. తిరిగెళ్లాలి..**
జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయి పరిస్థితులను పట్టించుకోకుండా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను విభజించారని, డివిజన్‌కు పక్కనే ఉన్న గగన్‌పహాడ్ గ్రామాన్ని.. 5 కి.మీ.దూరంలోని రాజేంద్రనగర్ డివిజన్‌లో కలిపారంటూ.. మైలార్‌దేవ్‌పల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు ధనుంజయ కమిషనర్ ఆర్వీ.కర్ణన్‌కు ఫిర్యాదు చేశారు. తమ డివిజన్‌లో గతంలో లక్ష జనాభా ఉండేదని, ఇప్పటికీ 70 వేల జనాభాతో ఉంచేశారని, పునర్విభజన సరిగా కాలేదన్నారు. మీరాలం చెరువుకు దిగువన ఉండే ప్రాంతాలకు, జాతీయ రహదారికి అవతలి వైపు ఉన్న కాలనీలను కలిపి కిషన్‌బాగ్ డివిజన్‌ను ఏర్పాటు చేశారని.. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ విషయంలో మాత్రం.. జాతీయ రహదారిని హద్దుగా తీసుకున్నామనే అధికారుల తీరుపై నిరసన చేపడతామన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని శివరాంపల్లి ప్రాంతాన్ని సులేమాన్‌నగర్ డివిజన్‌లో కలపడంపై.. స్థానికులు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

**ఎక్కువ ఫిర్యాదులు పేర్లపైనే..**
చాంద్రాయణగుట్ట అసెంబ్లీ నియోజకవర్గంలోని లలితాబాగ్ డివిజన్, యాకుత్‌పుర నియోజకవర్గంలోని హరిబౌలి, చార్మినార్ నియోజకవర్గంలోని డివిజన్ల హద్దులు, పేర్లు మార్చాలంటూ ఎంఐఎం నేతల నుంచి 18 ఫిర్యాదులందాయి. సికింద్రాబాద్‌లోని అడ్డగుట్ట, ఎల్బీనగర్‌లోని హైకోర్టుకాలనీ, ఉప్పల్‌లోని చక్రిపురం కాలనీల పేర్లను మార్చాలని నేతలు కోరుతున్నారు. దాదాపు 20 డివిజన్లకు 60–80వేలు, కనిష్ఠంగా 20వేలు.. గరిష్ఠంగా 80వేల జనాభాతో సరిహద్దులు నిర్ణయించారు.

**16న పాలకమండలి సమావేశం..**
విలీనంపై చర్చించేందుకు, కార్పొరేటర్ల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన ఈనెల 16న పాలకమండలి సమావేశం నిర్వహించనున్నారు. కార్పొరేటర్ల అభిప్రాయాలను ప్రభుత్వానికి చేరవేస్తామని అధికారులు చెబుతున్నారు. డిసెంబరు 17తో అభ్యంతరాలపై గడువు ముగుస్తుంది. 18న డివిజన్ల పునర్విభజనకు తుది ఆమోదం తెలపాలని జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది.

# గండాలు దాటేదెలా?



హైదరాబాద్: మహానగరంలో రోడ్డు దాటడం దినదిన గండంగా మారుతోంది. ఇష్టారాజ్యంగా దూసుకొచ్చే వాహనాలు ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. జీబ్రా క్రాసింగ్‌ల దగ్గర సరైన సిగ్నళ్లు, ట్రాఫిక్ పోలీసులు లేకరోడ్డు దాటే క్రమంలో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్నిచోట్ల ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఉన్నా లిఫ్టులు పనిచేయడం లేదు. వృద్ధులు మెట్లు ఎక్కలేక రోడ్డు దాటుతున్నారు. నగరంలోని రోడ్డు ప్రమాదాల మృతుల్లో 40% మంది పాదచారులే ఉండటం సమస్య తీవ్రతకు నిదర్శనం.

**పాదచారుల హక్కులివే**
రహదారుల మీద వాహనాలకు రైట్ ఆఫ్ వే ఉన్నట్లు.. పాదచారులకు ఉంటుందిజీబ్రా క్రాసింగ్, సిగ్నళ్ల దగ్గర వాహనదారులు కచ్చితంగా నెమ్మదిగా వెళ్లాలి. ఫుట్‌పాత్‌లు లేని ప్రాంతంలో రహదారులకు ఒకవైపున నడిచేందుకు అవకాశముంది పాదచారులు రోడ్డు దాటేటప్పుడు స్టాప్.. లుక్.. గో విధానాన్ని పాటించాలి.

**ఎవరి దారి వారిదే**
జంక్షన్ల అభివృద్ధి, పాదచారుల భద్రతపై శాఖల మధ్య సమన్వయం లోపించింది. పాదచారులు రోడ్డు దాటకుండా డివైడర్ల నిర్మాణం, సిగ్నళ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచిస్తే జీహెచ్ఎంసీ స్పందించటం లేదని పోలీసులు.. పోలీసులు ఇష్టానుసారంగా జంక్షన్ల వద్ద మార్పులు చేయటం వల్ల పాదచారులు ఇబ్బందలు పడుతున్నారని బల్దియా సిబ్బంది పేర్కొంటున్నారు.

**చేపట్టాల్సిన చర్యలు**
రద్దీ ప్రాంతాల్లో పాదచారులు రోడ్డు దాటేందుకు కచ్చితంగా సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. పెలికాన్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలి. ట్రాఫిక్ పోలీసులు, వాలంటీర్లతో వాహనాలు నియంత్రించాలి.
ఇవి వీలుకాని చోట్ల ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలి.
ఇక్కడ సమస్యాత్మకం
ఎల్బీనగర్ డీసీపీ కార్యాలయం పక్కనే ప్రభుత్వ పాఠశాల ఉంది. ఒకవైపు అలకాపురి, ఇంకోవైపు కామినేని పైవంతెన మీదుగా, రోడ్డుకు రెండువైపులా వాహనాలు వేగంగా దూసుకొస్తుంటాయి. అక్కడి జీబ్రా క్రాసింగ్ దగ్గర సిగ్నళ్లు, ట్రాఫిక్ పోలీసులు ఉండటం లేదు. రాక్‌హిల్స్, రాక్‌టౌన్, రాజీవ్‌గాంధీనగర్ కాలనీలవాసులు, విద్యార్థులు రోజూ భయం భయంగా రోడ్డు దాటుతున్నారు. నెల క్రితం ఇక్కడే రోడ్డు దాటుతున్న మహిళను బస్సు ఢీకొట్టింది.
కేపీహెచ్‌బీ మెట్రోస్టేషన్ కింద ఎప్పుడూ జనం రోడ్డు దాటుతూనే ఉంటారు. రోడ్డు దాటేందుకు కొద్ది దూరంలోనే ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఉన్నా వృద్ధులు, మహిళలు మెట్లు ఎక్కలేకపోతున్నారు. డివైడర్ ఎత్తు పెంచాలని పోలీసులు లేఖ రాసినా స్పందించలేదు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.
కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ వద్ద సిగ్నల్స్ వ్యవస్థ ఆపేశారు.
మనవరాలికి తోడుగా వచ్చి..

**రోడ్డు ప్రమాదంలో తాత మృతి**
మనవరాలిని ఉద్యోగంలో చేర్పించేందుకు వచ్చిన తాత రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణగూడకు చెందిన వేల్పుల నరసింహ(65) మనవరాలు తేజావతికి ఉప్పల్ ఐడీఏలోని ఎన్‌ఎస్‌ఎల్‌లో ఉద్యోగం వచ్చింది. బుధవారం ఆమెను ఉద్యోగంలో చేర్పించేందుకు ఆయన తోడుగా వచ్చారు. అదే రోజు రాత్రి 9.30గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా ఉప్పల్–రామంతాపూర్ వెళ్లే గుర్తు తెలియని ఆటో ఆయన్ని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడటంతో గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. మృతుడి మనువడు రిషివర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విలీనమైనా.. శివారే

హైదరాబాద్: రాజధాని విశాల నగరంగా ఆవిర్భవించినప్పటికీ.. విలీనమైన పట్టణ స్థానిక సంస్థలు (యూఎల్‌బీ) యథాతథంగా కొనసాగుతున్నాయి. జీహెచ్ఎంసీ అధికారులు ఆయా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల హద్దులను అలాగే ఉంచారు. లోపలి ప్రాంతాలను డివిజన్లుగా విభజించారు. పాత జీహెచ్ఎంసీ విషయంలోనూ అదే సూత్రాన్ని పాటించారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు కోసం, సర్వే నెంబర్లలో సమస్యలు రావొద్దనే ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. పునర్విభజనలో 42 డివిజన్లను అధికారులు ముట్టుకోలేదు. వాటి హద్దులను అలాగే ఉంచారు. బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ, చార్మినార్ నియోజకవర్గంలో డివిజన్లను తక్కువ జనాభా, విస్తీర్ణం ఉన్నందున యథాతథంగా ఉంచారు. మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల నుంచి జీహెచ్ఎంసీలో కలిసి మున్సిపాలిటీల పరిధి ఎక్కువ ఉన్నప్పటికీ జనాభా తక్కువ ఉంది. నిర్ణయం ప్రభుత్వానిదే పాత జీహెచ్ఎంసీ పరిధిలో ఉచిత మంచినీటి పథకం అమలవుతోంది. శివారులో రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా ఆస్తిపన్ను విధానాన్ని కొనసాగిస్తున్నారు. వాటిని బృహత్ హైదరాబాద్ మొత్తం ఏకీకృతం చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. అందుకు ఎంత సమయం పడుతుందో తెలియదు. విలీన మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల హద్దులతో రెవెన్యూ రికార్డులు, సర్వే నెంబర్లు ముడిపడి ఉంటాయి.
పాత జీహెచ్ఎంసీలో..
6 జోన్లు, 30 సర్కిళ్లు, 150 డివిజన్లు.
ఆ 150 డివిజన్లు.. 247 అయ్యాయి.
విలీనమైన 27 యూఎల్‌బీల్లో వార్డులు.. 598. (53 డివిజన్లు అయ్యాయి)
విభజన జరగని డివిజన్లు.. 42

# నిర్వహణ ప్రశ్నార్థకం.. సగం ఆయకట్టుకే జలం

బోధన్ : ఎత్తిపోతల పథకాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. బోధన్ నియోజకవర్గంలోని గోదావరి, మంజీర నదులతో పాటు వాగుల ఆధారితంగా సుమారు తొమ్మిది ఎత్తిపోతల పథకాలను కొన్నేళ్ల కిందట నిర్మించారు. వీటి కింద వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ పథకాలకు నీరు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని మాత్రమే పూర్తి సామర్థ్యంతో పని చేస్తున్నాయి. మరికొన్ని నిర్వహణ సక్రమంగా లేక సగం ఆయకట్టుకే నీరందిస్తున్నాయి. తరచూ పంపులు, మోటార్లు కాలిపోవడం, ఆపరేటర్లు, వాచ్‌మెన్ల జీతభత్యాలు భరించలేక కర్షకులు చేతులెత్తేస్తున్నారు. మరికొన్ని చోట్ల నియంత్రికలు చోరీకి గురవుతున్నాయి. కాపలాదారులు లేక రాగి తీగలు, ఆయిల్ కోసం దుండగులు రూ.లక్షల విలువైన నియంత్రికలు, మోటార్లను ధ్వంసం చేస్తున్నారు.

**పరిస్థితి ఇలా..**
బోధన్ మండలం ఖండ్‌గావ్, పెద్దమావంది పథకాలు నిరుపయోగంగా మారాయి. వీటి పరిధిలో సుమారు 3 వేల ఆయకట్టు ఉంది.
నవీపేట మండలం నందిగామ ఎత్తిపోతల పథకం ఆయకట్టు పరిధి 1100 ఎకరాలు కాగా.. 15 ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. యంచలో గతేడాది నుంచి రెండు పంపులు పని చేయడం లేదు. దీని కింద 510 ఎకరాల ఆయకట్టు ఉంది.
వానాకాలంలో కురిసిన వర్షాలు, వచ్చిన వరదలతో నిజాంపూర్ పథకం



నీట మునిగింది. ఫలితంగా మూడు పంపులు దెబ్బతిన్నాయి. నియంత్రికలు చోరీకి గురయ్యాయి. దీంతో ఈ యాసంగిలో సాగునీరు అందించే పరిస్థితి లేదు. ఈ పథకం కింద సుమారు 1600 ఎకరాలు సాగవుతున్నాయి.
కందకుర్తి, తాడ్‌బిలోలి, సాలూర, శాఖాపూర్‌లో ఉన్న ఎత్తిపోతల పథకాలు పని చేస్తున్నాయి. వీటి పరిధిలో సుమారు 7 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే సాలూరలో మూడు పంపులకు గానూ రెండు మాత్రమే పని చేస్తున్నాయి. తాడ్‌బిలోలిలో సాగునీటి కాల్వలు అధ్వానంగా మారాయి.

**ఇవీ కారణాలు..**
ఎత్తిపోతల కమిటీలు లేని ప్రాంతాల్లో పథకాల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో నిరుపయోగంగా మారాయి.
వాగుల ఆధారితంగా ఏర్పాటు చేసిన పథకాల వద్ద నీటి నిల్వ కోసం చెరువులను తవ్వకపోవడం.

**అధికారులు ఏమన్నారంటే..**
ఈ విషయమై జలవనరుల శాఖ బోధన్ డీఈ లోక్యానాయక్, నవీపేట ఏఈఈ ప్రణయ్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎత్తిపోతల పథకాల పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, మరమ్మతులకు ప్రతిపాదనలు రూపొందించి పంపించామన్నారు. యంచలో రూ.39 లక్షలతో మరమ్మతులు కొనసాగుతున్నాయని, యాసంగి సాగుకు నీరందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# వెల్‌నెస్.. సేవలు భేష్!

ఆదిలాబాద్ : ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు, పాత్రికేయులకు నగదురహిత సేవలందించే వెల్‌నెస్ కేంద్రంలో ఇక సేవలు మెరుగయ్యే అవకాశాలున్నాయి. ఇన్నాళ్లు నిర్వహణ బాధ్యత ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆధీనంలో ఉండేది. వీటి నిర్వహణ హైదరాబాద్ నుంచి ఆ ట్రస్ట్ పర్యవేక్షించటంతో కేంద్రానికి వచ్చేవారు ఇబ్బందులను ఎదుర్కొనేవారు. డీఎంఈ పరిధిలోకి రావటంతో జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ కేంద్రం సోమవారం నుంచి రాజీవ్ గాంధీ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) పరిధిలోకి రావడంతో సేవలు మెరుగవుతాయని భావిస్తున్నారు.
జిల్లా కేంద్రంలోని వెల్‌నెస్ కేంద్రానికి ప్రతి రోజు 80 నుంచి 120 మంది బాధితులు సందర్శిస్తుంటారు. కేంద్రానికి మొత్తం మూడు వైద్యుల పోస్టులు మంజూరు ఉండగా.. ప్రస్తుతం ఒక డెంటల్ సర్జన్, మరో వైద్యాధికారి మాత్రమే ఉన్నారు. మరో డెంటల్ వైద్యురాలు దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీంతో కేంద్రానికి వచ్చిన బాధితులకు ఆశించిన మేర వైద్యం అందే పరిస్థితులు లేవు. మహిళలు వస్తే పరీక్షలు చేయటానికి గైనకాలజిస్ట్ వైద్యులు లేకపోవటం సమస్యగా మారింది. అవసరమైన ఔషధాలు సైతం అందుబాటులో ఉండేవి కావు. దీంతో బాధితులు తరచూ ఇబ్బందులు పడుతూ కేంద్రం నిర్వహణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.
ఆరోగ్యశ్రీ ట్రస్ట్ నుంచి రిమ్స్‌కు పరిపాలనా, నిర్వహణ బాధ్యతలు



అప్పగించటంతో ఈ సమస్యలకు ప్రస్తుతం తెరపడే అవకాశాలున్నాయి. రిమ్స్ సంచాలకుడిని వెల్‌నెస్ కేంద్రం నోడల్ అధికారిగా నియమించటంతో ఆయన సోమవారమే కేంద్రాన్ని స్వాధీనం చేసుకున్నారు. మెరుగైన సేవలందించటానికి ఏర్పాట్లు చేశారు. రిమ్స్ నుంచి ప్రత్యేక వైద్య నిపుణులు సేవలందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఔషధ కొనుగోళ్లు హైదరాబాద్ స్థాయిలో జరిగి సరఫరా అయినప్పటికీ ఏమైనా మందుల కొరత ఏర్పడితే రిమ్స్ లేదా సీడీఎస్ నుంచి సమకూర్చి ఇబ్బందులు లేకుండా చేసే అవకాశం ఉంది.
మెరుగైన సేవలందిస్తాం
వెల్‌నెస్ కేంద్రానికి వచ్చే బాధితులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశాం.. రిమ్స్ ఆసుపత్రి నుంచి ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. మందుల కొరత రాకుండా పర్యవేక్షణ పెంచాం. బాధితులకు అత్యంత మెరుగైన సేవలందించటానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తాం.
డాక్టర్ రాఠోడ్ జైసింగ్, రిమ్స్ సంచాలకుడు

# కొత్త బస్సులు.. అధునాతన హంగులు

హైదరాబాద్ : అధునాతన హంగులతో రూపుదిద్దుకున్న 65 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కాయి. అత్యాధునిక భద్రత ప్రమాణాలు, దివ్యాంగులు , వృద్ధుల ప్రయాణ తీర్చే అనేక సదుపాయాలు వీటిలో ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి కొండాపూర్, ఇస్నాపూర్, బోరబండ, రామాయంపేట్, గచ్చిబౌలి, మియాపూర్ క్రాస్‌రోడ్స్ మార్గాల్లో వీటిని తిప్పనున్నారు.

**సదుపాయాలివే..**

ప్రయాణికుల సామర్థ్యం 36. సీట్‌బెల్ట్ తప్పనిసరి.

12 మీటర్ల లోఫ్లోర్ యాక్సెల్ – గుంతల్లో బస్సుకు డ్యామేజీ జరగకుండా లోఫ్లోర్ యాక్సెల్ సదుపాయం ఉంది. దీని ద్వారా బస్సును 12 మీటర్ల వరకు ఎత్తు పెంచొచ్చు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు, వికలాంగులు బస్సు ఎక్కే సమయంలోనూ ఈ సదుపాయం ఉపయోగపడనుంది

లిథియం అయాన్ బ్యాటరీలు – 1.5 గంటల ఛార్జింగ్‌తో 250 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది.

అడ్వాన్స్‌డ్ మోటార్ కంట్రోల్ సిస్టమ్ – ఆటోమెటిక్ వ్యవస్థ ద్వారా బటన్ నొక్కితే ముందుకు, వెనక్కి వెళ్లొచ్చు.



ఫైర్ డిటెక్షన్ అండ్ సస్పెన్షన్ సిస్టమ్ – 3 ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు (డ్రైవర్ వద్ద 1, ప్రయాణికులకు సమీపంలో 2)

న్యూమాటిక్ డోర్స్ – బస్సు తలుపులు మూస్తేనే ముందుకు కదిలే వ్యవస్థ, ఫుట్‌బోర్డుకు ఆస్కారం ఉండదు.

ఛార్జింగ్ – ప్రతి సీటు వద్ద యూఎస్‌బీ సదుపాయం.

నాలుగు సీసీ కెమెరాలతో నిఘా – ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండేలా నాలుగు సీసీ కెమెరాలు అమర్చారు.

ఎత్తైన ప్రదేశాల్లో బస్సు ఆగిపోతే వెనక్కి కదలదు.

వేగం గంటకు 55 కిలోమీటర్లకు పరిమితం.

దివ్యాంగులు ఎక్కేలా వీల్‌ఛైర్ కోసం ప్రత్యేక ప్రదేశం.

డ్రైవర్‌కు సందేశం పంపేలా ప్రయాణికులకు ప్రత్యేక 'స్టాప్' బటన్.

అత్యవసర సమయాల్లో కిటికీలు బద్దలు కొట్టేలా విండో బ్రేకింగ్ సిస్టమ్.

# మూడు రోడ్లు.. ఆరు షెడ్లు

హైదరాబాద్ : అవుటర్ రింగ్ రోడ్డు గ్రోత్ కారిడార్ మాస్టర్‌ప్లాన్‌కు కొందరు తూట్లు పొడుస్తున్నారు. హెచ్ఎండీఏ నుంచి అనుమతులు తీసుకోకుండానే గ్రిడ్ రోడ్లు, షెడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. తాజాగా కోకాపేట ట్రంపెట్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు స్థలంలోకి గ్రిడ్ రోడ్డు నిర్మించిన వైనం వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ తరహా అక్రమాలు ఇతర ప్రాంతాల్లోనూ ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే ప్రాంతంలో ఓ ప్రైవేటు వ్యక్తి తన స్థలంలో ఏకంగా భవనాలను నిర్మించాడు. ఇది ప్రస్తుతం జీఓ 111లో భాగం. 158 కిలోమీటర్ల మేర చాలా ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ నిర్మాణాలున్నాయి. ఐటీ కారిడార్, పటాన్‌చెరు, శంషాబాద్, కొల్లూరు, ఘట్‌కేసర్, నార్సింగి.. ప్రాంతాల్లో ఓఆర్ఆర్ గ్రోత్‌కారిడార్ మాస్టర్‌ప్లాన్‌ను తుంగలోకి తొక్కినట్లు స్పష్టమవుతోంది. అక్రమ లేఅవుట్లతోపాటు వాటికి గ్రిడ్ రోడ్లు నిర్మించి నేరుగా ఓఆర్ఆర్ సర్వీసు రోడ్లకు కలుపడం.. షెడ్లు, భవనాలు, ఇళ్లు నిర్మించడం గమనార్హం. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లతోపాటు హెచ్ఎండీఏ నుంచి అభ్యంతరాలు లేకపోవడంతో అక్రమాలు మూడు పూలు ఆరు కాయలుగా నడుస్తున్నాయి.

**నిబంధనల ఉల్లంఘన ఇలా..**

ఈ జోన్‌లో రోడ్ల వెడల్పు, ఓపెన్ స్పేస్, పార్కులు, గ్రీన్ బఫర్లు, బిల్డింగ్ నిర్మాణానికి నిబంధనలు పాటించాలి. అలా జరగలేదు. ః అవుటర్ రింగ్ రోడ్డు పైకి ఎలా పడితే అలా రాకుండా నియంత్రణ ఉంది. కేవలం 22 జంక్షన్ నుంచే అవుటర్‌పైకి వెళ్లాలి. అవుటర్ పైకి రావాలంటే సర్వీసు రోడ్లే కీలకం. ఈ సర్వీసు రోడ్లకు



అనుసంధానంగా గ్రిడ్ రోడ్లు ఉంటాయి. మాస్టర్‌ప్లాన్‌లో ఎక్కడ గ్రిడ్ రోడ్లు నిర్మించాలో కూడా స్పష్టంగా ఉంది.

అవుటర్ రింగ్ రోడ్డుకి ఇరువైపులా ఒక కిలోమీటర్ వెడల్పుతో ఉన్న ప్రత్యేక అభివృద్ధి జోన్‌ను గ్రోత్‌కారిడార్‌గా వ్యవహరిస్తారు. ఈ ప్రాంతానికి హెచ్ఎండీఏ ప్రత్యేక మాస్టర్‌ప్లాన్ రూపకల్పన చేసింది. భవిష్యత్తులో అవుటర్ రింగ్ రోడ్డు చుట్టూ కీలకం కానున్న దృష్ట్యా ఒక ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. భవిష్యత్తులో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీతోపాటు ప్రమాదాలకు నెలవు కానున్నాయి. ఇప్పటికైనా హెచ్ఎండీఏ అధికారులు దృష్టిసారించి ఇలాంటి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

అవుటర్ పరిసర ప్రాంతాల్లో భారీ స్థాయిలో రియల్ ఎస్టేట్, పరిశ్రమలు, వాణిజ్య సముదాయాలు రానుండటంతో అస్తవ్యస్తంగా కాకుండా ఒక ప్రణాళికాబద్ధంగా ఉండేందుకు ఈ ప్రత్యేక గ్రోత్ కారిడార్ ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంటోంది. ఈ నిబంధనలు పాటించకుండా ఎక్కడ పడితే అక్కడ గ్రిడ్ రోడ్లు నిర్మిస్తున్నారు. వాటిని నేరుగా సర్వీసు రోడ్లకు కలుపుతున్నారు. ఇది చాలా ఇబ్బందికరం.

# పట్టణ రోడ్లు.. నడ్డి విరుస్తున్నాయ్



సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణ పరిధిలోని పలు రహదారులు గుంతలమయం అయ్యాయి. దీనికితోడు మిషన్ భగీరథ పైప్‌లైన్, కేబుల్ వైర్ల తవ్వకాలతో ఏర్పడిన గుంతలతో పట్టణ ప్రజల గుండెల్లో వణుకు పుట్టిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికి తాగునీరు అందించాలనే ఉద్దేశంతో చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో రహదారులు తవ్వారు. దీంతో రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులు కాకుండా వార్డుల్లో వేసిన సీసీ, బీటీ రోడ్లు సైతం ధ్వంసమయ్యాయి. ఇలా చాలాచోట్ల గుంతలను అలాగే వదిలేశారు.

**ప్రధానంగా ఎక్కడెక్కడంటే..**

పట్టణంలోని గాంధీనగర్ కూరగాయాల మార్కెట్ లోపలికి వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో గుంతలు పడి రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో.. రైతులు, వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వెంటనే గుంతలు పూడ్చి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

**కేబుల్ తీగల కోసం..**

పలు టెలికాం సంస్థలు ప్రభుత్వ అనుమతులు తీసుకొని రహదారులను ఇష్టానుసారంగా తవ్వి కేబుల్ తీగలు వేస్తున్నారు. ఎప్పటికప్పుడు రోడ్లకు మరమ్మతులు చేయాల్సి ఉండగా అలాగే వదిలేస్తున్నారు. దీంతో వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఎంత జాగ్రత్తగా ప్రయాణించినా కొన్నిసార్లు ప్రమాదాల బారిన పడక తప్పడంలేదు. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

పెద్దబజార్ నుంచి విమల్ థియేటర్‌కు వెళ్లే రోడ్డు ఏళ్లుగా గుంతలతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. రాత్రి వేళ గుంతలు కనిపించపోవడంతో వాహనాలు అదుపుతప్పి వాహనదారులకు గాయాలవుతున్నాయి. బాగు చేయాలని పలుసార్లు అధికారులకు మొరపెట్టుకుంటున్నా.. పట్టించుకునేవారే లేరని వాపోతున్నారు.

కోనరావుపేట ప్రధాన చౌరస్తా వద్ద, అంబేద్కర్ కూడలి నుంచి కొత్త బస్టాండ్ ప్రధాన రహదారికి ఇరువైపులా, గీతానగర్ ప్రభుత్వ పాఠశాల నుంచి ఎల్లమ్మ కూడలి వరకు అధ్వానంగా ఉన్నాయి. వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ఆసుపత్రికి వెళ్లాల్సిందే అనేలా ఉన్నాయి.

# సన్న బియ్యంలో నూకలు



జగిత్యాల : చిత్రంలో కనిపిస్తోంది జగిత్యాల అర్బన్ మండలంలోని ఓ రేషన్ దుకాణం పరిధిలో లబ్ధిదారుకు అందజేసిన సన్న బియ్యం. ఇందులో దాదాపు 30 శాతం నూకలుండగా 5 శాతం వరకు దొడ్డు బియ్యం వచ్చాయి. రేషన్ దుకాణాల నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వం చెబుతుండగా దొడ్డు గింజలు, నూకలతో కూడిన సరకు వస్తోందని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు.

షన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. ఇన్నాళ్లూ దొడ్డు రేషన్ బియ్యం తినలేక, బయటి మార్కెట్‌లో అధిక ధరలతో పేదలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎట్టకేలకు సన్న బియ్యం ఉచితంగా అందడంతో సంతోషించారు. కాగా ఈ నెలలో నూకలతో కూడిన బియ్యం వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 592 రేషన్ దుకాణాలుండగా ఆహారభద్రత, అంత్యోదయ కార్డులు కలిసి 348,058 ఉన్నాయి. వీటన్నింటికీ ప్రతి నెలా దాదాపు 6,391 మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నారు.

సన్న బియ్యంలో వచ్చిన దొడ్డు గింజలు

మిల్లుల్లోనే కల్తీ!

సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద ప్రభుత్వం ధాన్యాన్ని మర ఆడించేందుకు మిల్లర్లకు ఇస్తోంది. వారు బియ్యాన్ని పౌర సరఫరాల సంస్థకు అప్పగిస్తారు.

బియ్యాన్ని గోదాములకు తరలించే క్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరీక్షించాల్సి ఉంటుంది. కాగా మిల్లర్ల నుంచి వచ్చే మామూళ్లకు అలవాటు పడి పరీక్షలు చేయకుండానే గోదాములో దించుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

దీంతో సన్న బియ్యంలో నూకలు, దొడ్డు బియ్యం కలుపుతున్నట్లు విమర్శలు వస్తున్నాయి. గత నెలలోనూ సన్న బియ్యంలో నూకలు రాగా డీలర్లు ఆందోళన వ్యక్తం చేశారు.

పెద్దపల్లి నుంచి వచ్చే బియ్యమే కల్తీ జరుగుతున్నట్లు డీలర్లు చెబుతున్నారు. పరిశీలించకుండా బియ్యాన్ని రేషన్ దుకాణాలకు ఎలా సరఫరా చేస్తారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇలాగే సరఫరా చేస్తే తమకు, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, అధికారులు పర్యవేక్షించి నూకలు రాకుండా నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయాలని రేషన్ డీలర్లు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

రేషన్ బియ్యంలో నూకలు వచ్చినట్లు నా దృష్టికి రాలేదు. దుకాణాల్లో పరిశీలించి నూకలుంటే ఎక్కడి నుంచి వచ్చాయో తెలుసుకొని బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. మరోసారి రాకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. ప్రసాద్, పౌరసరఫరాల సంస్థ డీఎం

# లక్షల లీటర్ల శుద్ధ జలం వృథా

కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో లీకేజీల కారణంగా రోజుకు లక్షల లీటర్ల శుద్ధజలం వృథాగా పోతోంది. నగరంలో కొన్ని ప్రాంతాలకు రోజూ నీటి సరఫరా జరుగుతుండగా.. మరికొన్ని చోట్ల రోజు విడిచి రోజు అందిస్తున్నారు. ఉదయం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఆయా రిజర్వాయర్ల పరిధిలో నగరవాసులకు శుద్ధజలం పంపిణీ చేస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ లీకేజీలు అవుతుండగా, నియంత్రణ వాల్వులు చెడిపోతున్నాయి. వాటిని సకాలంలో మరమ్మతులు చేయకపోవడంతో నీరు వృథాగా రోడ్లపై ప్రవహిస్తోంది. కొన్ని చోట్ల తాగునీరు కలుషితం కూడా అవుతోంది.


**కార్మికుల కొరత.. లీకేజీల వెత**

హైలెవల్, లోలెవల్ జోన్ పరిధిలో 17 రిజర్వాయర్లు ఉన్నాయి. హైలెవల్ ప్రాంతంలో మొత్తం నలుగురు ఉండగా అందులో ఒకరు ఉద్యోగ విరమణ పొందారు. మరొకరు తరచూ విధులకు గైర్హాజరవుతుంటారు. ఇద్దరిపై భారం పడుతోంది. లోలెవల్ పరిధిలో ముగ్గురు ఉన్నారు. తక్కువ మంది కార్మికులతోనే లీకేజీలను పరిష్కరించాల్సి రావడంతో పైపులు పగిలిన చోట మరమ్మతులకు జాప్యం అవుతోంది.

**పది నెలలుగా అవస్థలు**

నగరవ్యాప్తంగా లీకేజీలను, వాల్వ్‌ల మరమ్మతులు చేసేందుకు 55 మంది లీకేజీ కార్మికులు పని చేసే వారు. వీరిని పది నెలల కిందట తొలగించడంతో పని భారం అధికమైంది. ప్రస్తుతమున్న ఇన్‌ఛార్జి లైన్‌మెన్లను లీకేజీలు సరి చేసేందుకు పంపుతుండటంతో ట్యాంకుకు ఇద్దరే మిగిలారు. అందులో ఒకరు పంపు ఆపరేటర్, మరొకరు లైన్‌మెన్‌గా పని చేస్తున్నారు. ఏ ఒక్కరూ సెలవు పెట్టినా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వేళాపాళా లేకుండా తిరగడంతో సరఫరా సమయాలపై ప్రభావం పడుతోంది. అంతేకాకుండా లీకేజీల మరమ్మతులు చేసే వారు లేకుండా పోతున్నారు.

**పట్టించుకోని అధికారులు**



అన్ని డివిజన్లలో తాగునీటి పైపులైన్లు పగలడం, వాల్వులు చెడిపోయి నీరంతా బయటకు రావడం, శుద్ధజలం రోడ్లపై ప్రవహిస్తున్నా మరమ్మతులు చేయడం లేదు. క్షేత్రస్థాయిలో పరిశీలించి మరమ్మతులు చేయాల్సి ఉండగా రోజుల తరబడి అలాగే ఉంటున్నాయి. నీటి విభాగం అధికారులు పట్టించుకోకపోవడంతో వీటి సంఖ్య పెరుగుతుంది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

నల్లా కనెక్షన్లు : 64,003

ప్రతి రోజు శుద్ధ జలం సరఫరా : 60 ఎంఎల్‌డీ

పైపులైన్ల దూరం : 609 కి.మీ

లీకేజీలు(సుమారు): 600

# నైపుణ్య శిక్షణ.. ఉపాధికి నిచ్చెన..!

ఖమ్మం : ఏటీసీ(ఐటీఐ)లను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం వివిధ రకాల కోర్సులను ప్రవేశపెడుతోంది. పారిశ్రామిక అవసరాలు తీర్చటానికి మార్కెట్లో డిమాండ్ ఎక్కువగా ఉన్న కోర్సులను ఎంపిక చేసి నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ఇలాంటి పలు రకాల కోర్సులకు అర్హుల నుంచి ఖమ్మం నగరం టేకులపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. తద్వారా యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని సర్కారు భావిస్తోంది. కేవలం పదోతరగతి అర్హతపైనే ఈకోర్సులు చదువుకునే అవకాశముంది. ఎలాంటి వయోపరిమితి లేకపోవటం విశేషం. నైపుణ్య శిక్షణ ద్వారా సొంతంగా యూనిట్లు నెలకొల్పవచ్చు లేదా ప్రైవేటుగా ఉద్యోగాలు చేసుకోవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో టర్నర్, సోలార్ టెక్నీషియన్, డ్రోన్ ఆపరేటర్ లాంటి కోర్సులకు ఎక్కువ డిమాండ్ ఉంది.




**మొదలైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ..**

ప్రధానమంత్రి కౌశల్ పథకం ద్వారా ఖమ్మం ఏటీసీలో వివిధ రకాల స్వల్పకాలిక కోర్సులను ప్రవేశపెట్టారు. ఈ కోర్సులకు మూడు నెలల పాటు శిక్షణ ఇస్తారు. ట్రైనింగ్ పూర్తయినట్లు సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఈ కోర్సులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలైంది.

**కులవృత్తుల వారికీ..**

పీఎం విశ్వకర్మ యోజన ద్వారా కులవృత్తుల వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇవి కేవలం 15 రోజుల కోర్సులు మాత్రమే. ప్రస్తుతం కార్పెంటర్(వడ్రంగి) పనిలో 20 మందికి శిక్షణ ఇచ్చేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. త్వరలోనే శిక్షణ మొదలుపెడతారు. 'విద్యార్థులు స్వల్పకాలిక కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లోని కులవృత్తులవారు తమ నైపుణ్యం పెంచుకునేందుకు ఇక్కడ శిక్షణ పొందవచ్చు. మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులకు అనుగుణంగా తర్ఫీదు ఇస్తాం' అని ప్రిన్సిపల్ ఎ.శ్రీనివాసరావుకు తెలిపారు.

# నోరూరించే.. నాంచారి పచ్చళ్లు

ఇల్లెందు : మెప్మా రుణాలు మహిళల ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నాయి. ఏదైనా వ్యాపారం చేసి ఆర్థికంగా ఎదగాలనే మహిళలకు మెప్మా అందిస్తున్న రుణాలు భరోసానిస్తున్నాయి. మెప్మా ద్వారా తీసుకున్న రుణంతో వ్యాపారం ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న పట్టణానికి చెందిన గిరిజన మహిళగొగ్గెల నాంచారిపై ప్రత్యేక కథనం..

ఇల్లెందు పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన నాంచారి 18 ఏళ్ల క్రితం మెప్మాలో చేరి మణికంఠ గ్రూపు ద్వారా రూ.50వేలు రుణం తీసుకుని అల్లికలు, మగ్గం పనులు చేసేవారు. ఆ పనిలో ఆశించిన అభివృద్ధి లేకపోవడంతో మరో వ్యాపారం చేయాలని నిర్ణయించుకున్నారు. నాంచారి వంటలు ఎంతో రుచికరంగా ఉంటాయని పలువురు ప్రోత్సహించడంతో ఆమెకు పచ్చళ్లు తయారు చేయాలనే ఆలోచన వచ్చింది. 8 ఏళ్ల క్రితం పచ్చళ్లు తయారు చేయడం ప్రారంభించారు. మొదట్లో మామిడి, ఉసిరి, కాకర, టమాటా, పచ్చిమిర్చి, నిమ్మకాయ వంటి పచ్చళ్లు తయారు చేసి సింగరేణి కార్మిక కుటుంబాలకు విక్రయించేవారు. దశలవారీగా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకుని చికెన్, చేప, నాటు కోడి, ప్రాన్స్ తదితర పచ్చళ్లు తయారు చేసి విక్రయించడం ప్రారంభించారు. ప్రస్తుతం రూ.2 లక్షల రుణం తీసుకుని రుచికరమైన పచ్చళ్లు చేయడంతో ఆర్డర్లు పెరిగి కుమారుడు ప్రశాంత్, కోడలు భవానీ సైతం పచ్చళ్ల తయారీలో నిమగ్నమై చేతి నిండా సంపాదించుకుంటున్నారు.

ఆర్నెళ్లుగా విదేశాలకు కొరియర్ ద్వారా వివిధ రకాల పచ్చళ్లు ఎగుమతి చేస్తున్నారు. ఇల్లెందులోని తన కుమారుడి దుకాణంలోనూ విక్రయాలు చేస్తున్నారు. నెలకు రూ. 40 వేలకు పైగా సంపాదిస్తున్నానని నాంచారి అన్నారు. కిలో చికెన్ పచ్చడి రూ.1000, ఉసిరి కాయ పచ్చడి పావుకిలో రూ.150 చొప్పున అమ్ముతున్నానన్నారు.

విదేశాలకు ఎగుమతి..నాంచారి తయారు చేసే పచ్చళ్లు ఇంటి వద్ద అమ్మడంతోపాటు, ఇల్లెందు, చుట్టు పక్కన మండలాలు, ఖమ్మం, కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్‌లోని జంగారెడ్డిగూడెంనకు సరఫరా అవుతున్నాయి. సింగరేణి కార్మికుల కుటుంబాల్లోని పిల్లలు చాలా మంది అమెరికా, దుబాయ్ వెళ్లి స్థిరపడిన వారున్నారు. ఆమె పచ్చళ్లకు అలవాటు పడిన వారంతా ఆర్డర్లపై కుటుంబ సభ్యులతో తెప్పించుకుంటున్నారు. తేగాక సామాజిక మాధ్యమాలను ఆమె వినియోగించుకుంటూ పచ్చళ్ల వ్యాపారాన్ని పెంపొందించుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

# అసంపూర్తి రోడ్డుతో అవస్థలు

ఖమ్మం : ఖమ్మం నగరంలోని వెలుగుమట్ల అర్బన్ పార్కుకు వెళ్లే రోడ్డు అసంపూర్తిగా ఉంది. నిర్మాణ పనులు నిలిచిపోవటంతో రాకపోకలకు ఇబ్బందవుతోంది. నిత్యం వేల మంది ఈ రహదారిలోనే అటవీ పార్కును సందర్శించేందుకు వెళ్తుంటారు. రోడ్డు నిర్మాణం కోసం 2024, నవంబరు నెలలో నగరపాలక సంస్థ నిధులు రూ.2కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో వైరారోడ్డు నుంచి పార్కు వరకు సీసీ రోడ్డును, డివైడర్లను అభివృద్ధి చేయాల్సి ఉంది. ప్రధాన రోడ్డు నుంచి కొద్ది దూరం వరకు రోడ్డు పూర్తి కాలేదు. కంకరలేచి ఉంది. అదేవిధంగా మధ్యలో కొంతదూరం వరకు డివైడర్లను నిర్మించారు. వాటికి ఇరువైపులా ఉన్న రోడ్డును ఇంతవరకు పూర్తి చేయలేదు. స్థల వివాదం నేపథ్యంలోనే పనులకు బ్రేక్ పడిందని తెలుస్తోంది. ఇంకోపక్క కంకర లేచి ఉండటంతో సందర్శకులు నడవాలంటే అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పార్కు నుంచి బయలుదేరి ప్రధాన రోడ్డు వరకు రావాలంటే తల ప్రాణం తోకకు వచ్చినట్టవుతోంది. ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు సైతం వెళ్లేందుకు కూడా రోడ్డు అనుకూలంగా లేదు. శని, ఆదివారాల్లో పార్కుకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్ అధికారులను వివరణ కోరగా నిర్మాణ స్థలం తమదంటూ కొందరు ప్రతిఘటించటంతో పనులు నిలిచిపోయినట్టు తెలిపారు.

## కళాశాలను బతికిస్తున్నారు

మల్యాల: మల్యాల మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాలుగేళ్ల కిందట విద్యార్థుల సంఖ్య 150. ఇందులో తరగతులకు హాజరయ్యేది మాత్రం 50 మందే. ప్రస్తుతం మొదటి సంవత్సరంలో 105 మంది, రెండో సంవత్సరంలో 115 మంది చదువుతున్నారు. ఈ మార్పు వెనక అధ్యాపకులు, ప్రిన్సిపల్ సమష్టి కృషి ఉంది. విద్యార్థుల సంఖ్య తగ్గకుండా, వారు నిత్యం కళాశాలకు హాజరయ్యేలా చూడటంతో పాటు నాణ్యమైన బోధన ఇందుకు దోహదపడింది.

**ఆకలి తీరుస్తూ.. అండగా నిలుస్తూ**

దృశ్య, శ్రవణ విధానంలో బోధిస్తే చాలా కాలం గుర్తుండిపోతుందన్న ఆలోచనతో ప్రిన్సిపల్ శివరామకృష్ణ సొంత డబ్బుతో ప్రొజెక్టర్‌ను కొనుగోలు చేశారు. యానిమేషన్ వీడియోలతో పాఠాలు బోధిస్తున్నారు. ఒక్కో అధ్యాపకుడు 15-20 మంది విద్యార్థులను దత్తత తీసుకొని ప్రతి రోజూ కళాశాలకు హాజరయ్యేలా చూస్తున్నారు. విద్యార్థుల గైర్హాజరు, చదువులో పురోగతిపై ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు సమాచారం అందిస్తుంటారు.

తల్లిదండ్రులు లేని, పేద విద్యార్థుల చదువుకు మలబార్ గోల్డ్ సంస్థ అందించే ఆర్థిక సాయం కోసం అధ్యాపకులే స్వయంగా దరఖాస్తు చేస్తున్నారు. కళాశాల నుంచి రెండేళ్ల కిందట 42 మంది, గతేడాది



28 మంది విద్యార్థులు రూ.8 వేల నుంచి రూ.10 వేల ఆర్థిక సాయం పొందారు. ఈ సంవత్సరం 32 మంది దరఖాస్తు చేశారు.

వార్షిక పరీక్షల సమయంలో దాతల సాయంతో కళాశాలలో మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద విద్యార్థుల రవాణా ఖర్చులను అధ్యాపకులే సమకూరుస్తున్నారు.

విద్యార్థులకు కిచిడీ అందించడానికి ముడి సామగ్రి సమకూర్చడానికి సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు ముందుకొచ్చారు.

పేరెంట్ టీచర్ సమావేశానికి అధ్యాపకులు స్వయంగా విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను ఆహ్వానిస్తున్నారు.

పాఠాలు గుర్తుండిపోతున్నాయి

ప్రొజెక్టర్ సాయంతో యానిమేషన్ వీడియోల ద్వారా బోధించే పాఠాలు గుర్తుండిపోతున్నాయి. అధ్యాపకులు వివిధ రకాల బోధనా సామగ్రిని మాతోనే తయారు చేయించడంతో సబ్జెక్టుపై మరింత అవగాహన పెరుగుతోంది. అధ్యాపకుల ఆర్థిక సాయంతో బల్వంతాపూర్ నుంచి 6 కిలోమీటర్ల దూరంలోని కళాశాలకు వస్తున్నా.

గంగాభవాని, బైపీసీ రెండో సంవత్సరం

విద్యార్థుల హాజరుపై ప్రత్యేక శ్రద్ధ

ఒక్కో అధ్యాపకుడు 15 నుంచి 20 మంది చొప్పున దత్తత తీసుకున్నాం. గైర్హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేస్తాం. కళాశాల జనావాసాలకు దూరంగా ఉండటంతో మధ్యాహ్న భోజనానికి ఇళ్లకు వెళ్తుంటే సమయం వృథా అవుతోంది. సత్యసాయి సేవాట్రస్టు నిర్వాహకులు కిచిడీ అందించడానికి ముందుకొచ్చారు. ఇటీవల మంజూరైన రూ.16 లక్షలతో అవసరమైన వసతులు కల్పిస్తాం.

శివరామకృష్ణ, ప్రిన్సిపల్

## ఆటలకు చోటేది.. పోటీలకు నిధులేవి?

జగిత్యాల : 'క్రీడల అభివృద్ధే లక్ష్యం, క్రీడలతోనే ఆరోగ్యం' ఇవన్నీ వివిధ వేదికలపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు చెప్పే మాటలు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మైదానాలు, క్రీడా సామగ్రి అంతంతే. నిధుల కేటాయింపు అలసత్వంతో ఆటలకంటూ ఓ పీరియడ్ ఉంటుందనే విషయాన్ని విద్యార్థులు మరచిపోతున్నారు. దీంతో విద్యార్థుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. చాలామందికి క్రీడల్లో ప్రవేశం లేకుండానే విద్యార్థి దశ ముగు స్తోంది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచేందుకు అవకాశం కల్పించే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని క్రీడాకారులు అభ్యర్థిస్తున్నారు.

**బాలబాలికల విభాగాల్లో..**

ఉమ్మడి జిల్లాలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్బాల్, హ్యాండ్‌బాల్, నెట్బాల్, సాఫ్ట్‌బాల్, యోగా, క్రికెట్, అథ్లెటిక్స్ తదితర పోటీలపై ఆసక్తి ఉంది. దీంతో 14 ఏళ్లు, 17 ఏళ్లలోపు బాల, బాలికలకు పోటీలు నిర్వహిస్తున్నారు. ఇటీవల జగిత్యాల జిల్లాలో కథలాపూర్, మెట్పల్లిలో ఖోఖో.. లక్ష్మీపూర్‌లో బాస్కెట్బాల్ పోటీలు, రాజన్న సిరిసిల్ల జిల్లాలో కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించగా.. ఆసక్తి, ప్రాధాన్యత, ప్రాచుర్యం తదితర పరిస్థితులకనుగుణంగా మండలాలను గుర్తించి ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. మిగిలిన చదరంగం, టెండికాయిట్, బ్యాడ్మింటన్, ఈత



తదితర క్రీడలకు పెద్దగా పోటీ లేకపోవడంతో ఎంపికలతోనే సరిపెడుతున్నారు. మొత్తం 50 వరకు క్రీడాంశాలుండగా.. ఉమ్మడి జిల్లాలో పోటీలు, ఎంపికలు చేపట్టే క్రీడల సంఖ్యను వేళ్ల మీద లెక్కపెట్టే పరిస్థితులుండటం గమనార్హం.

**దాతలు ముందుకొస్తేనే నిర్వహణ**

జిల్లా స్థాయి పోటీలకు ప్రభుత్వం నుంచి ఎంతోకొంత నిధులు మంజూరవుతుండగా.. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలకు పైసా లేకుండా పోతుంది. వీటి నిర్వహణకు రూ.వేలల్లో నిధులు వెచ్చించాల్సి రావడంతో దాతలపై ఆధారపడటం తప్పనిసరిగా మారింది.

ఇటీవల కథలాపూర్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి 14, 17 ఏళ్లలోపు విభాగంలో బాల, బాలికలకు ఖోఖో పోటీలు నిర్వహిస్తే ఒక్కో విభాగంలో నాలుగు జిల్లాల నుంచి 16 జట్లు పాల్గొన్నాయి. 192 మంది క్రీడాకారులు, న్యాయ నిర్ణేతలు, పీడీలు, పీఈటీలు, నిర్వాహకులు కలిపి మొత్తం 250 మందికి భోజనం ఖర్చు రూ.20 వేలు అయింది. సమ దుస్తులు ఒక్కో దానికి రూ.300 చొప్పున రూ.60 వేలు, బహుమతులకు మరో రూ.5 వేలు, నిర్వహణ కోసం టెంట్లు, మైక్, తాగునీరు తదితరాలకు రూ.10 వేలు కలిపి సుమారు రూ.లక్ష వరకు వెచ్చించాల్సి వస్తోంది.

# అధ్వాన దారికి మోక్షం



తాండూరు: తాండూరు నుంచి హైదరాబాద్ వెళ్లే ప్రధాన రోడ్డుకు రహదారులు, భవనాల శాఖ అధికారులు మరమ్మతులు ప్రారంభించారు. తాండూరులో ప్రారంభంలోనే 2 కి.మీ. పొడవున తారు తొలగిపోయి కంకర లేచిన రహదారిని సిమెంటు రోడ్డుగా మారుస్తున్నారు. మూడేళ్లుగా వర్షాకాలంలో ఎగువ నుంచి వరదంతా రోడ్డుపైకి రావడంతో గోతులమయంగా తయారైంది. దీంతో రాకపోకలు సాగించే వందల కొద్ది వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత వర్షాకాలంలో వరద కారణంగా రహదారి మరింత పాడైంది. మరికొన్ని చోట్ల గుంతలు పడి రాకపోకలకు ప్రతికూలంగా మారింది. తాండూరు నుంచి వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు ఈ దారిగుండానే హైదరాబాద్ వెళ్లివస్తుంటారు.

**20 రోజుల్లో గుంతల పూడ్చివేత..**

సిమెంటు రోడ్డు నిర్మాణం పూర్తి కాగానే హైదరాబాద్ రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చాలని ర.భ.శాఖ అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు 20 రోజుల వ్యవధిని నిర్ణయించారు. మొదట రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చేసి తరవాత రోడ్డును పూర్తిస్థాయిలో తారుతో నిర్మించే ప్రణాళికను రూపొందించారు.

**రెణ్నెల్లలో పూర్తి చేస్తాం..**

– శ్రావణ్‌కుమార్, ఇన్‌ఛార్జి డీఈఈ, తాండూరు

తాండూరు– హైదరాబాద్ రోడ్డును రెణ్నెల్లలో అన్ని విధాలా పూర్తి చేస్తాం. ప్రస్తుతం సిమెంటు రోడ్డు నిర్మిస్తున్నాం. ఇది పూర్తి కాగానే ప్యాచ్ వర్కులు చేస్తాం. తరవాత రహదారిని పూర్తిస్థాయిలో బాగు చేస్తాం. దీనికి రెణ్నెల్ల సమయం పడుతుంది.

రోడ్డు విస్తరణ: 38 కి.మీ.

2 కి.మీ. సిమెంటు రోడ్డు నిర్మాణానికి వ్యయం: రూ.5కోట్లు

మిగిలిన దానికి: రూ.43.80 కోట్లు

# ధ్రువపత్రం..జారీలో అంతరాయం




తాండూరు : జనన, మరణాలు నమోదు చేసేందుకు యూనిఫైడ్ బర్త్ అండ్ డెత్(యూబీడీ) వెబ్‌సైట్ తెరుచుకోవడం లేదు. రోజువారీగా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. శిశువు జన్మించిన పక్షం రోజుల్లోనే పూర్తి కావాలి. ఆ తరవాత చేసినా తీసుకోదు. కొన్ని రోజులుగా సైట్ మొరాయిస్తుండడంతో అంతరాయం ఏర్పడుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా జనన, మరణ ధ్రువపత్రాల జారీలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

**నాలుగు నియోజకవర్గాల పరిధిలో..**

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో నిత్యం వందల సంఖ్యలో జనన, మరణాలు చోటుచేసుకుంటున్నాయి. పంచాయతీలు, నాలుగు పురపాలక సంఘాల పరిధిలో సాధారణ మరణాలు నమోదవుతున్నాయి. మీసేవ ఆన్‌లైన్ ద్వారా జనన, మరణ ధ్రువపత్రం తీసుకోవాలంటే ఆస్పత్రిలో జన్మించినట్లు అంతర్జాలంలోని యూబీడీ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇలా నమోదైతేనే మీసేవలో అర్జీ పెట్టుకొని.. చిరునామా ప్రకారం పురపాలక సంఘం లేదా పంచాయతీ, మండల అభివృద్ధి అధికారి కార్యాలయానికి చేరుకుంటుంది. సంబంధిత శాఖ అధికారుల డిజిటల్ సంతకంతో ధ్రువపత్రాలు జారీ అవుతాయి.

**నిలిచిన ప్రక్రియ..**

సైట్ పనిచేయకపోవడంతో ధ్రువపత్రాల జారీ ప్రక్రియ నిలిచిపోయింది. పంచాయతీలు, పురపాలక సంఘాల్లో సమస్య ఉత్పన్నమవుతోంది. కొన్ని సందర్భాల్లో సైట్ తెరుచుకొని.. వెంటనే నిలిచిపోతోందని అంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే బాగు చేయించాలని కోరుతున్నారు. సమస్యను ఉన్నతాధికారులకు వివరించామని, త్వరలో పరిష్కరిస్తామన్నారని తాండూరు జిల్లా ఆస్పత్రి, మాతాశిశు ఆస్పత్రి సూపరింటెండెంట్ వినయ్‌కుమార్ తెలిపారు.

# బయోవ్యర్థాలు చెత్తలో వేస్తే ఫోన్ చేయండి




హైదరాబాద్: అనుమతి లేని క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఇళ్లలో చికిత్స తీసుకునే వ్యక్తుల వల్ల బయోమెడికల్ వ్యర్థాలు సాధారణ చెత్తలో కలుస్తున్నాయని పీసీబీ పరిశీలనలో వెల్లడైంది.

**అనుమతులు ఇలా...**

క్లినిక్ నుంచి ఆసుపత్రుల వరకు బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీతో కచ్చితంగా అనుసంధానం అవ్వాలి. ఆ తర్వాతే కాలుష్య నియంత్రణ మండలి అధీకృత అనుమతి తీసుకోవాలి. అనంతరం డీఎంహెచ్‌వో ఇతర విభాగాలు అనుమతులు ఇవ్వాలి. కొన్ని సందర్భాల్లో ముందు డీఎంహెచ్‌వో ఆరు నెలల పాటు తాత్కాలిక రిజిస్ట్రేషన్‌కు అవకాశమిస్తోంది. గడువులోగా అనుమతులన్నీ తీసుకోవాలి. ఆ తర్వాత శాశ్వత రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తారు. ఇలా నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రతి ఆసుపత్రి, క్లినిక్‌కు పీసీబీ ఇచ్చిన బార్‌కోడ్‌ను ఆవరణలో అతికిస్తారు. సేకరణ నుంచి శుద్ధి కేంద్రాల తరలింపు వరకు ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు ఇది దోహదపడుతోంది.

ఇళ్ల నుంచి ఏమేమీ కలుస్తున్నాయంటే..

ప్రెగ్నెన్సీ కిట్లు, మధుమేహ వ్యాధిగ్రస్థులు, ఇతరుల ఇంజెక్షన్‌లు, చికిత్సల్లో వినియోగించే దూది, వ్యక్తిగతంగా వేసుకునే ఇంజెక్షన్లు.

**ఈ నంబర్లలో..**

స్థానిక క్లినిక్‌లు, ఆసుపత్రుల్లో నిబంధనలు ఉల్లంఘించినట్టు కనిపిస్తే కాలుష్య నియంత్రణ మండలి టోల్‌ఫ్రీ నంబరు 040–23887500 లేదా 10741 నంబర్లను సంప్రదించి ఫిర్యాదు చేయొచ్చు.

**గ్రేటర్ పరిధిలో..**

ఆసుపత్రులు: 4వేలు

పడకలు: 60వేలు

రోజూ దవాఖానాల వ్యర్థాలు: 40 టన్నులు

శివారు పురపాలికలు : 20 టన్నులు

# వీరిది ఆందోళన.. వారిది ఆవేదన

షాద్‌నగర్ : ఎప్పుడూ ఏదో ఒక ఆందోళన.. గంటలకొద్దీ రహదారిపై నిలిచిపోయే వాహనాలు.. అత్యవసర పనుల మీద వెళ్లే ప్రయాణికులకు కష్టాలు తప్పట్లేదు. దేశంలోని పలు ముఖ్య ప్రాంతాలకు నగరం నుంచి అనుసంధానంగా రహదారులున్నాయి. ఒక్కోవైపు ఒక్కో జాతీయ రహదారి ఉంది. షాద్‌నగర్, రాజేంద్రనగర్, చేవెళ్ల తదితర ప్రాంతాల నుంచి హైదరాబాద్–బెంగళూరు, ముంబయి బైపాస్ మార్గాలు ఉన్నాయి. ఇవి నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటాయి. రాజధానికి ముఖద్వారంగా ఉండే షాద్‌నగర్ పట్టణం మీదుగా మహబూబ్‌నగర్, కర్నూలుతో పాటు రాయలసీమ, కర్ణాటక, తమిళనాడువంటి ప్రాంతాలకు నిత్యం వేల వాహనాలు వెళ్తుంటాయి. ముంబయి బైపాస్‌గా ఏర్పాటు చేసిన పరిగి రోడ్డు మీదుగా కూడా పరిశ్రమలకు సరకులు చేరవేసే లారీలు పెద్దఎత్తున రాకపోకలు సాగిస్తున్నాయి. బైపాస్ రోడ్డు ఉన్నప్పటికీ రైల్వేగేటు ఉండడంతో ఎక్కువ శాతం వాహనాలు ప్రధాన మార్గంలో ప్రయాణిస్తుంటాయి. నిత్యం వేలల్లో వాహనాలు రోడ్డు ఎక్కుతున్నాయి. ఎక్కడ చిన్నధర్నా జరిగినా గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోతున్నాయి.

సంఘటన ఏదైనా.. అక్కడే

ఏ నిమిషానికి ఏం జరుగుతుందో అర్థం కాని అయోమయ పరిస్థితి షాద్‌నగర్ కూడలిలో కనిపిస్తోంది. ఏ హత్య జరిగినా, అన్యాయం జరిగినా, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఆందోళనలు చేసినా, ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి సంబరాలు చేసుకున్నా రహదారులే అడ్డాగా మారుతున్నాయి. ఇటీవల తమను ప్రిన్సిపల్ వేధిస్తున్నారనే ఆరోపణపై గురుకుల విద్యార్థులు సుమారు 4 గంటలు రహదారిపై ఆందోళన చేశారు. ఇలాంటి సమయాల్లో వందల సంఖ్యలో వాహనాలు నిలిచిపోతున్నాయి. రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అత్యవసర వాహనాలూ కదిలే పరిస్థితి ఉండట్లేదు. పోలీసులు దృష్టి పెట్టి రహదారులపై వాహనాలను అడ్డుకోకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ప్రాణ వాయువుకే.. ఆయువు తీరింది

నల్గొండ: అత్యవసర సమయంలో రోగులకు ప్రాణవాయువు అందించే ఆక్సిజన్ ప్లాంట్లు నిరుపయోగంగా ఉన్నాయి. కొన్నిచోట్ల విద్యుత్తు బిల్లుల మోత పెరగడంతో నిర్వహణ ఆపేశారు. కరోనా సమయంలో శ్వాసకోస సమస్యలు తలెత్తి.. పలువురు ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయారు. దీంతో ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆక్సిజన్ ప్లాంట్లు నిర్మించాలని ఆదేశించింది. అయితే రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ప్లాంట్లు నిరుపయోగంగా మారాయి.

**ఆసుపత్రుల్లో వినియోగం ఇలా..**

ఒక్కో జిల్లాసుపత్రిలో అన్ని విభాగాలు కలిపి రోజూ 800 మంది ఓపీ నమోదవుతుంది. ఐపీ 300 మంది వరకు ఉంటారు. గర్భిణులు వైద్యసేవలకు ఎక్కువగా తరలివస్తారు. ఐసీయూ, అత్యవసర సేవలు, శస్త్రచికిత్స విభాగాల్లో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సంప్రదాయ ఆక్సిజన్ సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నారు. ప్రతి నెల గరిష్ఠంగా ఒక్కో ఆసుపత్రిలో 10 వరకు వాడుతున్నారు. ఒక్కో ఆసుపత్రిలో గరిష్ఠంగా రూ.60 లక్షలతో నిర్మించిన 500, 1000 లీటర్ ఫర్ మినిట్(ఎల్పీఎం) సామర్థ్యం కలిగిన ఆక్సిజన్



ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఐసీయూతో పాటు ఆక్సిజన్ అవసరం ఉన్న అన్ని విభాగాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

నల్గొండ జిల్లాసుపత్రిలోనూ లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్‌ను నిర్మించినా.. విద్యుత్తు బిల్లులు ఎక్కువ రావడం, వినియోగం తక్కువగా ఉండటంతో సిలిండర్లను వినియోగిస్తున్నారు.

దేవరకొండ ప్రాంతీయాసుపత్రిలో టెక్నీషియన్ లేక నిరుపయోగంగా ఉంది. మిర్యాలగూడ ప్రాంతీయ ఆసుపత్రిలో ప్రత్యేకంగా ఆక్సిజన్ సిలిండర్లు అమర్చే ఏర్పాటు చేశారు. అవసరమైనప్పుడు అనుసంధానిస్తున్నారు. గతంలో ఎన్నారై ఫోరం వారు ఆక్సిజన్ ప్లాంట్ నిర్మించాలని ప్రతిపాదించగా స్థలం సైతం కేటాయించారు.

నకిరేకల్, మునుగోడులో నిర్మించినా ప్రారంభించలేదు. చండూరు ఆసుపత్రిలో ఏర్పాటు చేయలేదు.

నాగార్జునసాగర్ కమల నెహ్రూ ప్రాంతీయ ఆసుపత్రిలో నిర్మించినా.. విద్యుత్తు ఖర్చులు పెరుగుతుండటంతో సిలిండర్లను వినియోగిస్తున్నారు.

గుత్తేదారుల నిర్లక్ష్యం వల్లే నిర్వహణ కష్టాలు

కరోనా సమయంలో ఒక్కో సెంట్రల్ ఆక్సిజన్ సిస్టంను జిల్లాసుపత్రిలో, తక్కువ పడకలున్న చోట్ల మినీ లిక్విడ్ ఆక్సిజన్ ట్యాంకులను నిర్మించి వదిలేశారు. దేవరకొండలో నెలకు రూ.40వేల వరకు విద్యుత్తు బిల్లులు వస్తుండటం, మరమ్మతులకు గురవుతుండటంతో సిలిండర్లు వినియోగిస్తున్నారు. గుత్తేదారుల సంస్థ కొన్ని ప్రాంతీయాసుపత్రుల్లో బిల్లులు రాక సగం నిర్మించి వదిలేశారు. నిర్మించిన చోట్ల మరమ్మతులు వచ్చినా పట్టించుకోవడం లేదు. డా.మాతృనాయక్, జిల్లాసుపత్రుల పర్యవేక్షకుడు, నల్గొండ


## ఆవాసంలో.. ఉంటలేరు నివాసం!

ఆత్మకూరు : సొంత గూడు లేని పేదల కల నెరవేర్చేందుకు గత ప్రభుత్వం రెండు పడక గదుల ఇళ్ల పథకం ప్రారంభించి, నిర్మాణాలు పూర్తి చేసింది. నాసిరకంగా నిర్మించారని, పూర్తిస్థాయిలో వసతులు కల్పించలేదని గృహప్రవేశాలు చేసిన లబ్ధిదారులు వాపోతున్నారు. జిల్లాలో పరిశీలన చేయగా..పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. భువనగిరి పట్టణం సింగన్నగూడెంలో జి– ప్లస్–2 విధానంలో 560 మంజూరు కాగా. 48 ఇళ్ల పనులు మధ్యలో నిలిచిపోయాయి. ఇటీవల ప్రభుత్వం రూ.2.55 కోట్లు నిధులు మంజూరు చేయడంతో డ్రైనేజీ, మంచినీటి, విద్యుత్తు, సీసీ దారుల పనులు కొనసాగుతున్నాయి. మోటకొండూరు మండలం ఆరెగూడెంలో నిర్మించిన 44 ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో అడవిలో నిర్మించడంతో సరైన రహదారి లేదు. సౌకర్యాలు లేక సగం మంది అక్కడ ఉండటం లేదు.

ఆలేరు పట్టణం, కొలనుపాక గ్రామంలో 64 చొప్పున ఇళ్లను నిర్మించి అప్పగించారు. ఆలేరులో పట్టణంలో ఇళ్ల పక్కనే మురుగు నిలిచి దుర్గంధం వస్తోంది.

యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో 40 ఇళ్లను నిర్మించి, లబ్ధిదారులను ఎంపిక చేసినా అప్పగించలేదు. చెరువు సమీపంలో నిర్మించడం వల్ల వర్షాకాలం ఇళ్ల మధ్యకు నీరు చేరుతోంది. ఇళ్ల మధ్యకు నీరు రాకుండా ఈ ఏడాది కట్ట ఏర్పాటు చేశారు. అయినా వెళ్లేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు.

ఆత్మకూరు(ఎం)లో నిర్మించిన 48 ఇళ్లలో రెండున్నర ఏళ్ల క్రితం



గృహప్రవేశాలు చేయించారు. సామూహిక సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం లేక మరుగుదొడ్లు వినియోగించడం లేదు. కిటికీలకు అద్దాలు బిగించలేదు. మురుగు కాల్వలు, సీసీ దారులు లేవు. విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఇంటి గోడలను తాకుతున్నాయి. కనీస వసతులు లేక 48 మంది లబ్ధిదారులకు ప్రస్తుతం 15 మంది మాత్రమే ఉంటున్నారు. చెత్త సేకరణ ట్రాక్టర్, వీధుల శుభ్రతకు పంచాయతీ సిబ్బంది రావడం లేదు. ఉప్పలపహాడ్‌లో 45 ఇళ్లు నిర్మించినా డ్రైనేజీ, సీసీ దారులు ఏర్పాటు చేయలేదు.

జిల్లాలో రెండు పడక గదుల ఇళ్ల వివరాలు..

మంజూరు చేసినవి : 3,620

పరిపాలనా ఆమోదం : 3,464

పనులు ప్రారంభించినవి: 1412

లబ్ధిదారుల ఎంపిక జరిగినవి: 945

అప్పగించినవి : 461

లబ్ధిదారులను ఎంపిక చేయాల్సినవి : 197

పనులు ప్రారంభించనివి: 2,051

ప్రగతిలో ఉన్నవి : 120 ఇళ్లు

# ఆపరేషాన్ థియేటర్

నంద్యాల : ఆసుపత్రుల్లో అత్యంత కీలకమైన ఆపరేషన్ థియేటర్(ఓటీ) లో సరైన వసతులు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగుల ప్రాణాలను రక్షించే అత్యవసర, సంక్లిష్ట శస్త్రచికిత్సలు ఇందులో జరుగుతుంటాయి. నంద్యాల సర్వజన ఆసుపత్రిలో గత నాలుగేళ్ల క్రితం ఉన్న వసతులే ఇప్పటికీ కొనసాగుతున్నాయి. దీంతో శస్త్రచికిత్స లో తీవ్ర జాప్యం జరుగుతోంది.

నంద్యాల సర్వజన ఆసుపత్రిలో రోజుకు 1200 నుంచి 1600 వరకు ఓపీ ఉంటుంది. అందులో శస్త్రచికిత్సల విభాగానికి సంబంధించి రోజుకు వందకు పైగానే ఓపీలు ఉంటాయి. అన్ని రక్త, ఇతర పరీక్షలు చేసిన తర్వాత శస్త్రచికిత్సలు అవసరమైతే వారిని ఆసుపత్రిలో చేర్చుకుంటారు. 24 గంటల ఓటీని ఏర్పాటు చేసినప్పటికీ సరైన వసతులు లేకపోవడంతో పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు.

**ప్రత్యేకంగా లేకపోవడంతో...**

ప్రత్యేకంగా ఆపరేషన్ థియేటర్లు లేవు. దీంతో ఉన్నవాటిలో ఆర్థో వైద్యులకు వారానికి నాలుగు రోజులు.. న్యూరో సర్జన్లకు రెండు రోజులు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. అత్యవసరంగా పక్షవాతంతో వచ్చే రోగులకు శస్త్రచికిత్స చేయాలంటే వారికి కేటాయించిన రోజు వరకు



వేచి చూడాల్సిన పరిస్థితి వస్తోంది.

**ఏ విభాగంలో ఎలా..**

సర్వజన ఆసుపత్రిలో వైద్యులు ఉన్నప్పటికీ శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాలు, స్టెరిలైజర్లు, ఆధునిక శస్త్రచికిత్స సాధనాలు, మానిటర్లు, వెంటిలేటర్లు, లైటింగ్ వంటి ముఖ్యమైన సదుపాయాలు లేవు. శస్త్రచికిత్సల అనంతరం రోగిని ఉంచాల్సిన రికవరీ గదులు కూడా సరిగా లేవు. పవర్ బ్యాకప్‌లో లోపాలు, శానిటేషన్ సమస్యలు, తగిన సంఖ్యలో సాంకేతిక నిపుణులు లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. శస్త్రచికిత్సలు చేసే గదిలో ఏసీలు లేకపోవడంతో ఫ్యాన్లతో నెట్టుకొస్తున్నారు. అనస్థీషియా మందు ఇచ్చే యంత్రం ఉండాలి. కానీ లేకపోవడంతో అనస్థీషియా వైద్యుడు వచ్చే వరకు ఎదురు చూడాల్సిన పరిస్థితి.న్యూరోకు సంబంధించి తల శస్త్రచికిత్సకు, వెన్నెముక వంటి శస్త్రచికిత్సలకు అరకొర వసతులు ఉన్నాయి.కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలకు ఆపరేషన్ థియేటర్ లేకపోవడంతో నెలకు పది కూడా చేయడం లేదు.

# విసుగెత్తిపోతున్న పత్తిరైతు..!

లావేరు : పత్తి రైతులు పంట అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ జిల్లాకు సంబంధించి సాగు వివరాలు నమోదు చేసే సీఎం యాప్ ఓపెన్ కాకపోవడంతో సచివాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మూడు నెలలుగా చాలా మంది పంటను ఇళ్లలోనే దాచుకోవాల్సిన దుస్థితి నెలకొంది. **ఇదీ పరిస్థితి..**


యాప్ పని చేయకపోవడంతో దళారులు దోచుకుంటున్నారు. పంట బాగుంటే క్వింటా రూ.4 వేల నుంచి రూ.5 వేల మధ్యలో కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో విజయనగరం జిల్లా రాజాంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి పత్తి తీసుకెళ్తే తిరిగి పంపిస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. నిల్వ చేసుకుంటే రంగు మారి కష్టం వృథా అవుతోందని వాపోతున్నారు. యాప్ పని చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జిల్లాలో మొత్తం సాగు విస్తీర్ణం: 1,970 ఎకరాలు

ఖరీఫ్ పంట వేసిన మండలాలు: లావేరు, కొత్తూరు, మందస, రణస్థలం, హిరమండలం, సరుబుజ్జిలి, పొందూరు, టెక్కలి, ఎచ్చెర్ల, జి.సిగడాం సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ప్రకటించిన మద్దతు ధర రూ.8,110

**ఇందుకే తగ్గుముఖం..**

వర్షాల ప్రభావం, వాతావరణ ప్రతికూల పరిస్థితులతో ఎకరానికి 3 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఎకరా పొలంలో పత్తి సాగు చేయాలంటే దుక్కి నుంచి ఎరువులు, విత్తనాలు, పురుగు మందు పిచికారీ, కూలీలు ఇతర పనులకు సుమారు రూ.30 వేల నుంచి




రూ.35 వేల వరకు ఖర్చవుతుంది. పంట బాగా పండితే ఎకరానికి 10 నుంచి 15 క్వింటాళ్ల పండుతుంది. ప్రస్తుతం ఈ పరిస్థితి జిల్లాలో ఎక్కడా లేదు. ఫలితంగా క్రమేపీ సాగువిస్తీర్ణం తగ్గిపోతోంది.

**త్వరలోనే పరిష్కారం..**

**– ఎన్.ఈశ్వరరావు, ఎమ్మెల్యే, ఎచ్చెర్ల**

పత్తి రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలో సీఎం యాప్ పని చేయకపోవడం, పత్తి కొనుగోలు, రైతులు ఎదుర్కొంటున్న అంశాలను వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలోనే రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది.

# గ్రానైట్.. అక్రమాలకు రైట్‌రైట్



చిత్తూరు:కుప్పం.. ప్రశాంతతకు నిలయం. అలాంటి నియోజకవర్గాన్ని వైకాపా ప్రభుత్వం అక్రమాలు, అరాచకాలకు చిరునామాగా మార్చింది. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన నేతలు సహజ వనరులను దోచుకుని రూ.కోట్లు సంపాదించుకొని వెళ్లారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తర్వాత గ్రానైట్, మట్టి, బియ్యం అక్రమ రవాణాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ నేతలున్నా ఉపేక్షించవద్దని హెచ్చరించారు. గనుల శాఖ యంత్రాంగం మాత్రం మొద్దునిద్ర నటిస్తోంది. విచ్చలవిడిగా ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నా తర్వాత చూద్దాంలే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. అక్రమాల్లో ఆరితేరిన వైకాపా నాయకులే.. తెదేపా నేతలను ముందుండి నడిపిస్తుండటం గమనార్హం.

**చంద్రబాబు తనిఖీ చేసిన ప్రాంతంలోనే**

కుప్పం నియోజకవర్గంలో ఒక్క రామకుప్పంలో మినహా గుడుపల్లె, శాంతిపురం, కుప్పం పట్టణం, కుప్పం మండల పరిధిలో గ్రానైట్ నిక్షేపాలున్నాయి. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలోని కీలక ప్రజాప్రతినిధి, వైకాపాలో నంబరు 2 నేత అడ్డగోలుగా దందాలకు పాల్పడ్డారు. చివరకు ద్రవిడ విశ్వవిద్యాలయంలో కూడా అక్రమంగా తవ్వకాలు చేశారు. శాంతిపురం మండలం సి.బండపల్లిలో అటవీ శాఖ పరిధిలోని భూముల్లోనూ పేలుళ్లు జరిపి గ్రానైట్ వెలికి తీశారు. ఇక్కడ ముఖ్య ప్రజాప్రతినిధికి నెలకు రూ.లక్ష– రూ.2 లక్షలు మామూళ్లు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. ఈవిషయం ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో నాలుగేళ్ల క్రితం ఆయనే స్వయంగా వెళ్లి తనిఖీలు నిర్వహించారు. అనంతరం తమిళనాడు, కర్ణాటక సీఎంలకూ లేఖలు రాశారు. కుప్పం నుంచి వస్తోన్న గ్రానైట్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరారు. తాజాగా ఈ ప్రాంతంలోనూ కొందరు తవ్వకాలు ప్రారంభించడం విస్మయానికి గురి చేస్తోంది. వైకాపా హయాంలో నామినేటెడ్ పదవి పొందిన నేత అనుచరులు ఈ దందాలో కీలక భూమిక పోషిస్తున్నారు. తెర ముందు మాత్రం తెలుగు తమ్ముళ్లను ఉంచారు.

**నియోజకవర్గవ్యాప్తంగా 25కుపైగానే**

శాంతిపురం మండలం రాళ్లబూదుగూరు, కోనేరుకుప్పం, గెసికపల్లి, 64– పెద్దూరు, 121.పెద్దూరు, సోమాపురం, సోలిశెట్టిపల్లె, సి.బండపల్లి, గుడుపల్లె మండలం పొగురుపల్లి, యామగానిపల్లి, కుప్పంలో శీగలపల్లి, తదితర ప్రాంతాల్లో అనధికారిక క్వారీలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గవ్యాప్తంగా 25 చోట్ల అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నారు. తమిళనాడు క్రిష్ణగిరిలోని పాలిషింగ్ యూనిట్లకు ఈ సంపద తరలుతోంది.

**అధికారులకూ వాటాలు**

అక్రమ రవాణాకు పచ్చజెండా ఊపినందుకు రెవెన్యూ, గనుల శాఖ అధికారులకు సైతం వాటాలు అందుతున్నాయి. లారీలు పట్టుబడినప్పుడు నామమాత్రపు జరిమానాలు విధించడమే దీనికి నిదర్శనం. ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినప్పుడు మాత్రమే వీటిని పెంచుతున్నారు. ఇప్పటికైనా దాడులతోపాటు భారీగా జరిమానాలు విధిస్తేనే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

# నౌకల మరమ్మతుల కేంద్రంగా దుగరాజపట్నం



గూడూరు : నౌకల మరమ్మతులకు వాకాడు మండలం దుగరాజపట్నం తీర ప్రాంతం కేంద్రం కానుంది. గతంలో కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలో భాగంగా ఇక్కడ ఓడరేవు నిర్మించాలని తలపెట్టినా అభ్యంతరాల కారణంగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. మళ్లీ ఈ ప్రాంతాన్ని నౌకల మరమ్మతు, నిల్వల కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం నిర్ణయం తీసుకుంది.

**భూసేకరణలో యంత్రాంగం**

రాష్ట్రంలో నౌకల మరమ్మతులు, నిర్వహణకు ప్రత్యేక వ్యవస్థ లేదు. కేరళలోని కొచ్చిన్, ముంబయితోపాటు గుజరాత్‌లో ఉన్న షిప్‌యార్డులపై ఆధారపడాల్సి వస్తోంది. రాష్ట్రంలో విశాఖపట్నం, గంగవరం, కాకినాడ, మూలపేట, రామయపట్నం, మచిలీపట్నం, కృష్ణపట్నం పోర్టులు ఉన్నాయి. వీటి ద్వారా ఏటా వందల మిలియన్ టన్నుల సరకు రవాణా జరుగుతోంది. నౌకల మరమ్మతులు, నిర్వహణ కోసం భవిష్యత్ అవసరాల దృష్ట్యా ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఇక్కడ కేంద్రం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. ఇందులో భాగంగా షిప్ బ్రేకింగ్ యూనిట్ ఏర్పాటుకు భూసేకరణ పనులు జరుగుతున్నాయి

**పోర్టు ప్రాక్సిమల్ ప్రాంతంగా**

దుగరాజపట్నం సముద్ర తీరం నుంచి 100 కి.మీ దూరంలో ఉన్న ప్రాంతాలను పోర్టు ప్రాక్సిమల్ ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేస్తారు. ఈ ప్రాంతంలో ప్రపంచస్థాయి మౌలిక వసతులు కల్పనకు ఏపీ మారిటోరియం బోర్డు తయారు చేసి కేంద్రానికి పంపారు. దీని సమీపంలో ఉన్న గ్రామాలను పోర్టు ఆధారిత సమగ్ర ఆర్థిక నగరాలుగా అభివృద్ధి చేస్తారు. నౌకల మరమ్మతుల కేంద్రానికి అనుబంధంగా మెరైన్ సెజ్, రోబోటిక్ షిప్‌యార్డు మాడ్యులర్ డ్రై డాక్‌యార్డులు, ఏకోసిస్టమ్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేశారు. కేంద్రం కూడా ఆమోదం తెలిపింది.

**మారనున్న రూపురేఖలు**

ఈ ప్రాంతంలోని వాకాడు, చిట్టమూరు, కోట, నాయుడుపేట మండలాల్లోని గ్రామాలు అభివృద్ధి చెందనున్నాయి. మౌలికవసతులు మెరుగుపడటంతోపాటు స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయి.

మొత్తం పెట్టుబడి: రూ.3 వేల కోట్లు

సేకరిస్తున్న భూములు: 5.028 ఎకరాలు

ఉద్యోగ అవకాశాలు: 10 వేలు

# గోదాముల్లో ఇంటి గుట్టు



కర్నూలు : గత వైకాపా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల కోసం కొనుగోలు చేసిన రూ.కోట్లాది విలువైన ఇంటి సామగ్రి ఎందుకూ పనికిరాకుండా పోతోంది. అధికారుల నిర్లక్ష్యం.. సమన్వయ లోపంతో ఏళ్లు గడుస్తున్నా లబ్ధిదారులకు చేరకుండా నిరుపయోగంగా మారింది. ఇంటి నిర్మాణానికి పనికి రాకుండా పోతుండగా.. మరికొంత మాయమవుతోంది. సిమెంట్ గడ్డకట్టుకుపోయి పాడైంది.

**వానకు తడిసి**

లబ్ధిదారుడికి కిలో రూ.65 చొప్పున 343 కిలోల ఇనుము సరఫరా చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాకు 20 లక్షల కిలోల ఇనుము కొనుగోలు చేశారు. అందులో 10.53 లక్షల కిలోలు లబ్ధిదారులకు విక్రయించారు. మరో 9.46 లక్షల కిలోల నిల్వలున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఇందులో లక్ష కిలోలకు పైగా స్టీల్ మాయమైందని స్థానికులు అంటున్నారు. మిగిలిన స్టీల్ కూడా ఎండకు ఎండి.. వానకు తడిసి పాడైపోయింది. రూ.6.10 కోట్ల విలువైన స్టీల్ పనికి రాకుండా పోయిందని పలువురు విమర్శిస్తున్నారు.

**యూనిట్ రూ.20 వేలు**

14 రకాలు కలిపి ఒక యూనిట్ చేసి రూ.20 వేల ధరగా నిర్ణయించారు. ఇందులో ట్యాంకులు తప్ప మిగిలిన అన్ని రకాల సామగ్రి తెప్పించారు. రెండు జిల్లాలకు 7 వేలకు పైగా యూనిట్లను కొనుగోలు చేశారు. ఉమ్మడి జిల్లాలో 2,500 యూనిట్లను లబ్ధిదారులకు విక్రయించారు. ఇందులో సుమారు 4,500 యూనిట్లు ఉన్నాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. సుమారు రూ.9 కోట్ల విలువైన సరకు గోదాముల్లో మూలుగుతోంది.

**సిమెంటు గడ్డకట్టిపోయి..**

గత ప్రభుత్వంలో ఒక సిమెంట్ బస్తా రూ.236 చొప్పున ఒక్కో లబ్ధిదారుడికి 90 బస్తాల సిమెంట్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో సుమారు 23.05 లక్షల సిమెంట్ బస్తాలను ఆయా కంపెనీల నుంచి కొనుగోలు చేసి మండల కేంద్రాల్లో గోదాములకు చేర్చారు. అందులో లబ్ధిదారులకు 22.75 లక్షల బస్తాల సిమెంట్‌ను విక్రయించగా.. మరో 30 వేల బస్తాలు ఉండాల్సి ఉంది. అందులో 15 వేల బస్తాల వరకు మాయం కాగా.. మరో 15 వేల బస్తాలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి.

**టన్నుల ఇనుప కడ్డీలు అదృశ్యం**

కోసిగి మండలానికి 109 టన్నుల ఇనుము రాగా.. అందులో ఇప్పుడు 27 టన్నులు మాత్రమే గోదాములో ఉన్నట్లు రికార్డులు చూపిస్తున్నాయి. పాత రైతు భరోసా కేంద్రం ఆవరణలో నాలుగేళ్లుగా ఎండ, వానకు తడిచి తుప్పుపట్టి పాడైపోయాయి. బయట పెట్టడంతో గతంలో గుర్తుతెలియని దుండగులు దొంగిలించారు. వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న గోదాములో 294 సిమెంట్ బస్తాలు నిల్వ ఉంచారు. సంచులన్నీ గడ్డకట్టి పనికిరాకుండా పోయాయి. రూ.2.75 కోట్ల విలువ చేసే సామగ్రి మాయమైనట్లు సమాచారం. ప్రస్తుతం రూ.16.15 కోట్ల విలువైన ఇంటి సామగ్రిని గోదాములో పెట్టారు.

# ఇఫ్కో.. ప్రగతికి మార్గమిదిగో!

నెల్లూరు: జిల్లా పారిశ్రామిక రంగంలో మరో మేలి అడుగు పడింది. దశాబ్దాల సమస్యకు పరిష్కారం లభించింది. రాచర్లపాడు సమీపంలో ఏర్పాటు చేసిన ఇఫ్కో కిసాన్ సెజ్ ప్రత్యేక ఆర్థిక మండలికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. భూములిచ్చిన వారికి పరిహారం చెల్లింపు అంశాలు కోర్టులో ఉన్నా.. ఆ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. దీంతో గతంలో ఎరువుల పరిశ్రమ కోసం తీసుకోగా.. ప్రస్తుతం పారిశ్రామిక పార్కుగా మార్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ మేరకు పరిశ్రమల ఏర్పాటుకు ఇటీవల విశాఖలో జరిగిన పారిశ్రామిక సదస్సులో ఎంవోయూ కుదుర్చుకోవడం గమనార్హం.




**పరిశ్రమలను ఆకర్షించేలా..**

ఇఫ్కో సెజ్ జాతీయ రహదారికి ఆనుకుని ఉండటం.. రైలు, రోడ్డు, వాయు, జల మార్గాల ద్వారా రవాణా అవకాశాలు పుష్కలంగా ఉండటంతో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతారని అధికారులు భావిస్తున్నారు. మొత్తం రూ. 870 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు సిద్ధమవుతున్నారు. అందుకు సంబంధించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసును కూడా జారీ చేశారు. ఇప్పటికే మూడు ప్రధాన సంస్థలు పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రాగా.. రూ. 356 కోట్లతో రామ్కీ బయో ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు డిసెంబరు 30న పర్యావరణ అభిప్రాయ సేకరణ జరగనుంది.

దీనిపై కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు ప్రోత్సాహకాలను అందించనుంది. ఈ సెజ్‌తో ఎంఎస్ఎంఈ/ఎస్ఎంఈలకు, స్థానికులకు ఉపాధి, వ్యాపార అవకాశాలు లభిస్తాయి. పార్కు పూర్తిగా అభివృద్ధి చెందితే కావలి–నెల్లూరు మధ్య కీలక ఆర్థిక కారిడార్‌గా మారుతుంది' అని అన్నారు.

# సకాలంలో చికిత్సే కీలకం..

విశాఖపట్నం: ఉత్తరాంధ్రలో 'స్క్రబ్ టైఫస్' కేసులు పెరుగుతుండటంతో ప్రజలు భయపడుతున్నారు. తాజాగా వ్యాధి లక్షణాలతో దేవరాపల్లికి చెందిన 50 ఏళ్ల వ్యక్తి మరణించడంతో ఆందోళన చెందుతున్నారు. అయితే 'స్క్రబ్ టైఫస్'పై ఆందోళన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు. ఇది కొత్తగా వచ్చిన వ్యాధి కాదని, సకాలంలో చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు.

కలెక్టర్ సూచనల మేరకు వైద్యులు, సిబ్బందితో కూడిన ర్యాపిడ్ రెస్పాన్స్ టీం (ఆర్ఆర్‌టీ)లు ఏర్పాటు చేశారు. ఒకే ప్రాంతంలో ఐదు కంటే ఎక్కువ కేసులుంటే ఆ బృందం వెళ్లి పరీక్షిస్తుంది.

ఇక్కడే ఎందుకంటే..ఈ ఏడాది ఇప్పటివరకు ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో 200కు పైగా కేసులు బయటపడ్డాయి. అందులో ఎక్కువ శాతం విశాఖలోవే.

జిల్లాలో ఆసుపత్రులు, ప్రయోగశాలలు ఎక్కువగా ఉన్నాయి. మెరుగైన వైద్య సదుపాయాలుండటంతో అనకాపల్లి, విజయనగరం జిల్లాల నుంచి అనుమానిత లక్షణాలున్న బాధితులు ఎక్కువగా ఇక్కడికి వస్తున్నారు. దీంతో ఇక్కడే కేసులు ఎక్కువగా బయట పడుతున్నాయి. అందులో అధిక భాగం కేజీహెచ్‌లో నిర్ధారణ అవుతున్నాయి.

మరోవైపు రాష్ట్రంలోనే ఎక్కువ కేసులు నమోదైన జాబితాలో విశాఖ ఉండటంతో జిల్లా అధికారులు అప్రమత్తమయ్యారు.

ఎవరికైనా వ్యాధి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రం వైద్యులను సంప్రదించాలని డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు సూచించారు.

లక్షణాలు..అకస్మాత్తుగా 99 డిగ్రీలకు పైగా జ్వరం, అలసట, తలనొప్పి, వాంతులు, దద్దుర్లు, శరీరంపై నల్లటి మచ్చలు.

అలా.. గుర్తించారుఆంధ్ర వైద్య కళాశాలకు చెందిన మైక్రోబయాలజీ విభాగ వైద్యులు గతేడాది దీనిపై పరిశోధన చేశారు. 2023 ఫిబ్రవరి నుంచి 2024 ఫిబ్రవరి వరకు కేజీహెచ్‌లో ఇన్‌పేషెంట్లుగా చేరిన మొత్తం 507 మంది అనుమానితుల నమూనాలు పరీక్షించారు. అందులో 49 మందికి స్క్రబ్ టైఫస్ పాజిటివ్‌గా గుర్తించారు. బాధితుల్లో మహిళల (30.6 శాతం) కంటే పురుషులే (69.4 శాతం) ఎక్కువగా ఉన్నారు. వారిలో ఆరుగురు జ్వరం రావడానికి ముందు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లినట్లు గుర్తించారు. వారిలోనూ యువత ఎక్కువగా ఉండటం గమనార్హం.

నిర్లక్ష్యం చేస్తేనే సమస్య..

'స్క్రబ్ టైఫస్'పై భయపడాల్సిన అవసరం లేదు. ఇది ఒకరి నుంచి మరొకరికి వ్యాపించదు. జ్వరం వచ్చిన 3 నుంచి 5 రోజుల్లో పరీక్షలు చేయించుకోవాలి. త్వరగా గుర్తించకపోవడం వల్ల సమస్య తీవ్రమవుతుంది' అని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు పేర్కొన్నారు.

# నిబంధనలకు నీళ్లు.. నచ్చినట్టు వసూళ్లు!

అనకాపల్లి : జిల్లాలోని వందల సంఖ్యలో క్వారీలు ఉన్నా.. గతంలో ప్రభుత్వానికి సీనరేజ్ రూపంలో ఒక్క రూపాయి కూడా ఆదాయం వచ్చేది కాదు. దీంతోపాటు అధికారిక క్వారీల్లో పరిమితికి మించి తవ్వేసేవారు. ఇవన్నీ పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం.. అక్రమ మైనింగ్, రవాణాను అడ్డుకట్ట వేసేందుకు సీనరేజ్ వసూళ్లను ప్రైవేటు సంస్థకు అప్పగించేసింది. దీంతో ఆ సంస్థ జిల్లాలో పలుచోట్ల అక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఈ చెక్‌పోస్టుల్లో ఎక్కడా నిబంధనలు అమలు కావడం లేదు.

అంచనా ప్రకారం లెక్కేసి.. నిబంధనల ప్రకారం క్వారీలున్న ప్రాంతాల్లో గ్రామసభలు నిర్వహించి ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించాలి. గ్రానైట్, గ్రావెల్, క్రషర్, నల్లరాయి, మెటల్ రవాణా వాహనాలకు వే బిల్లు లేకపోతే.. వాటి నుంచి సీనరేజ్ వసూలు చేయాలి. కానీ.. జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన చెక్ పోస్టులు వద్ద ఎక్కడా వే బ్రిడ్జిలు లేవు. వాహనంలో ఎంత పరిమాణంలో సరకు వెళ్తోందో కూడా చూడటంలేదు. అంచనా ప్రకారం లెక్కలేసి.. డబ్బులు ఇవ్వాలంటూ హుకుం జారీ చేస్తున్నారు. ఇవ్వమంటే.. వాహనాన్ని కదలనీయడం లేదు. కొన్నిచోట్ల వాహనాల వెంట ద్విచక్రవాహనాలపై వెంబడించి మరీ నిలుపుదల చేసి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు.

ఇటీవల పాయకరావుపేట మండలంలోని సత్యవరానికి చెందిన పడాల కృష్ణ సమీపంలోని క్వారీ బూడిదను పశువుల పాకను ఎత్తుచేసేందుకు ట్రాక్టర్‌తో తీసుకెళ్తుండగా.. ఇద్దరు బైక్‌పై వచ్చి ఆపారు. ట్రాక్టర్ బూడిదకు రూ. 800 ఇవ్వాలని ముక్కుపిండి వసూలు చేశారు.

రసీదులు ఇవకుండానే..కాంట్రాక్టు పొందిన సంస్థ ముద్రించిన బిల్లులు కూడా ఇవ్వడంలేదు. కొన్నిచోట్ల చేతి రాతతో.. వాహనం నంబర్, సమయం, తేదీ, చెక్‌పాయింట్ పేరు రాసి అదే రసీదంటూ డ్రైవర్ చేతిలో పెట్టేస్తున్నారు.

చురకలు



# కంకర మింగుతున్న కింకరులు

నంద్యాల : ఖనిజ అక్రమ రవాణాను అరికట్టడంలో భాగంగా సీనరేజ్ వసూలు చేసే బాధ్యతను ప్రైవేటు సంస్థకు అప్పగించారు. ప్రభుత్వం ఓ రకంగా ఆలోచిస్తే.. అక్రమార్కులు మరోలా పావులు కదుపుతున్నారు. అందొచ్చిన అవకాశంతో అక్రమ మైనింగ్‌ను మరింత పెంచారు. ప్రైవేటు సంస్థతో కొందరు ఒప్పందాలు చేసుకుని అనుమతుల్లేకుండానే తవ్వేస్తున్నారు. కంకర, రోడ్డు మెటల్‌కు సంబంధించిన అనుమతులు వేళ్లమీద లెక్కపెట్టే స్థాయిలో ఉండగా.. పదుల సంఖ్యలో అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి.

**నిబంధనలకు చెల్లు**

నంద్యాల జిల్లాలో రోడ్డు మెటల్ క్వారీ లీజులు ఎనిమిది మాత్రమే ఉన్నాయి. బనగానపల్లి కార్యాలయ పరిధిలో మూడు, నంద్యాల పరిధిలో ఐదింటికి మాత్రమే లీజులున్నాయి. కానీ పదుల సంఖ్యలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. పాణ్యం మండలం తమ్మరాజుపల్లె గద్దెలకొండలో రెండు లీజులు మాత్రమే అధికారికంగా ఉన్నాయి. మరికొన్ని రెన్యువల్ దశలో ఉన్నాయి. ఇక్కడ ఏకంగా 35 ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతుండటం గమనార్హం. ఆరు క్రషర్ యంత్రాల ద్వారా అక్రమ మైనింగ్ జరుగుతోంది. ఈ ప్రాంతమంతా కాలుష్య కోరల్లో చిక్కుకుపోయింది. క్వారీ నిర్వాహకులు నిబంధనలు తుంగలో తొక్కి తవ్వకాలు చేస్తున్నారు. ఇక్కడ ఏమేరకు మైనింగ్ జరుగుతుందన్న వివరాలు.. అటు రెవెన్యూ, ఇటు గనుల శాఖల వద్ద లేవు. బనగానపల్లిలో రెండింటికి మాత్రమే అధికారిక అనుమతులుండగా మరో మూడింటిలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి.



**బండరాళ్లను వదలరు..**

కర్నూలు జిల్లాలో ఏడు కంకర లీజులున్నాయి. పత్తికొండ నియోజకవర్గ పరిధి.. కృష్ణగిరి మండలం కంబాలపాడు సమీపంలోని హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ నిర్మాణంలో భాగంగా బయట పడిన రాళ్లను పగులగొట్టి కంకరగా మారుస్తున్నారు. దీనిని డోన్ సమీపంలోని కంకర క్వారీలకు తరలిస్తున్నారు. మరికొంత రోడ్డు నిర్మాణాలకు వాడుతున్నారు. కల్లూరు మండలం.. ఉలిందకొండ సమీపంలో నాలుగు కంకర క్వారీలకు అనుమతులుండగా మరో క్వారీలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. ఓర్వకల్లు మండలంలో పూడిచెర్ల సమీపంలో ఒకచోట అనధికార క్వారీ నడుస్తోంది.

**కానరాని తనిఖీలు**

అనుమతులున్న లీజుల నుంచి వసూలు చేసిన సీనరేజ్‌ను మాత్రమే సదరు సంస్థ ప్రభుత్వానికి చెల్లిస్తోంది. అనధికారికంగా.. అక్రమంగా తవ్వకాలు చేస్తున్న కంకర, రోడ్డు మెటల్ క్వారీల నుంచి తరలే 'సరకు' నుంచి వసూలవుతున్న మొత్తాన్ని స్వాహా చేస్తోంది. సీనరేజ్ వసూళ్ల బాధ్యతను ప్రైవేటు పరం చేసిన నాటి నుంచి గనుల శాఖ అధికారులు దాదాపు తనిఖీలు ఆపేశారు. ఇదే సమయంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని క్వారీలపై సదరు ప్రైవేటు సంస్థ గురి పెట్టింది. అనుమతి ఉన్న క్వారీల్లో ఎలాగైతే సీనరేజ్ వసూలు చేస్తుందో.. అనధికార క్వారీల్లోనూ అలానే వసూళ్లకు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతోంది.

# పోగు.. ఉపాధి పేగు

కర్నూలు : గద్వాల పట్టుచీరకు ఎమ్మిగనూరు పుట్టినిల్లు.. ఇక్కడ చేనేత ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతుంటాయి.. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుతో మరింత వన్నెరాబోతోంది. ఇక్కడి కార్మికులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో బనవాసిఫారం వద్ద యుద్ధప్రాతిపదికన టెక్స్‌టైల్ పార్కును నిర్మిస్తున్నారు. 77.37 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో 249 ప్లాట్లు అందుబాటులోకి తేనున్నారు. తొలిదశలో 24.38 ఎకరాల్లో లేఅవుట్‌ను అభివృద్ధి చేసి 107 ప్లాట్లు అందుబాటులోకి తెచ్చారు. తమిళనాడులోని ఈరోడ్, సేలం ప్రాంతాల టెక్స్‌టైల్ పార్కుల మాదిరిగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే రహదారుల నిర్మాణం పూర్తయ్యింది. మిగిలిన పనులు రెండు నెలల్లో పూర్తి చేసి ప్లాట్లను కార్మికులకు అప్పగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే కొందరు వ్యాపారులు ముందుకొచ్చారు. సమగ్రమైన



నివేదికతో రావాలని ఏపీఐఐసీ అధికారులు సూచించారు.

**విదేశాలకు ఎగుమతి చేసేలా**టెక్స్‌టైల్ పార్క్ నుంచే ఆన్‌లైన్‌లో ఉత్పత్తులు విక్రయించుకొనే సౌకర్యం కల్పించనున్నారు. ప్రస్తుతం సింగపూర్, అమెరికా వంటి దేశాలకు చీరలు ఎగుమతి అవుతున్నాయి. ప్రభుత్వ పరంగా వేగంగా సాయం అందేలా 'ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్'ను ఏర్పాటు చేయనున్నారు.

**కార్మికులకు 22 ఎకరాలు**

టెక్స్‌టైల్ పార్కులో చేనేతల కోసం ప్రత్యేకంగా 22 ఎకరాలు కేటాయించనున్నారు. చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేలా రూ.50 కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు. 1,500 వరకు అధునాతన ఎలక్ట్రానిక్ జాకార్డ్ మగ్గాలు అందుబాటులోకి తీసుకురాబోతున్నారు. ఇందుకు వర్క్‌షెడ్లు నిర్మించనున్నారు. వాటిని వీవర్లకు కేటాయిస్తారు. దీంతో అధునాతన విధానాల్లో పలు రకాల వస్త్రాలు ఉత్పత్తి చేయడానికి వీలుంటుంది. అదేవిధంగా ప్రత్యేక శిక్షణ కేంద్రం, డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం, డయ్యింగ్ సౌకర్యాలు, గోదాముల సదుపాయం, బ్రాండింగ్, ప్యాకేజింగ్‌లకు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు.

# ఏది అసలు... ఏది నకిలీ..




అనంతపురం: కాదేది కల్తీకి అనర్హం అని కేటుగాళ్లు నిరూపిస్తున్నారు. సబ్బులు, షాంపులు, వాషింగ్ పౌడర్లు, కొబ్బరి నూనె, వంట నూనె, గోధుమపిండి.. ఇలా అన్నింటిలోనూ కల్తీ చేస్తున్నారు. ఆఖరికి నకిలీ సిమెంట్ తయారీ చేసి బ్రాండెడ్ కంపెనీల పేరుతో అమాయకులకు అంటగడుతున్నారు. విజిలెన్స్ అధికారుల దాడుల్లో వెలుగు చూస్తున్న విషయాలను చూస్తే ఏది అసలు, ఏది నకిలీ తెలియక ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. తాము కొన్న వస్తువుపై కంపెనీ లోగో, ఐఎస్ఐ ముద్ర, బార్‌కోడ్, క్యూఆర్ కోడ్ ఉన్నా అది అసలు కాదోనని అనుమానించాల్సిన పరిస్థితి దాపురించింది.

**అచ్చం బ్రాండ్‌లాగే..**

నాణ్యత కోసం బ్రాండెడ్ వస్తువులను ఆశ్రయించే ప్రజల నమ్మకాన్ని మోసగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. అచ్చం బ్రాండ్లను పోలి ఉండే నకిలీ వస్తువులను తయారుచేసి అమ్ముతున్నారు. లోగో, ప్యాకింగ్ అన్నీ బ్రాండ్‌నే పోలి ఉండటంతో ప్రజలకు అనుమానం రావడం లేదు. సాంకేతిక సాయంతో బార్ కోడ్‌లను సైతం ట్యాంపరింగ్ చేస్తున్నారు. అనుమానం వచ్చి స్కాన్ చేసినా కంపెనీ పేరే చూపించేలా పకడ్బందీగా నకిలీలు తయారు చేస్తున్నారు. ఇటీవల గోరంట్లలో అల్ట్రాటెక్ పేరుతో తయారు చేస్తున్న నకిలీ సిమెంట్ బస్తాలను కంపెనీ ప్రతినిధులు కూడా గుర్తించలేక పోయారంటే కల్తీ ఏ స్థాయిలో చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు.

**ఇలా చేస్తున్నారు**

తమిళనాడు ప్రాంతంలోని ప్లాస్టిక్ సంచులు, కవర్లు తయారు చేసే కంపెనీలతో స్థానిక వ్యాపారులు కుమ్మక్కైనట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. తమకు కావాల్సిన కంపెనీ పేరు చెబితే చాలు వాళ్లే ప్యాకింగ్ కవర్లు తయారు చేసి ఇస్తున్నారు. అలాగే లేబుళ్లు, స్టిక్కర్లు వందశాతం అసలైన కంపెనీలాగే తయారుచేసి సరఫరా చేస్తున్నారు. బెంగళూరుతో పాటు కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో సబ్బులు, షాంపులు, నూనెలు, ఉప్పు, వాషింగ్ పౌడర్లు వంటి నకిలీ వస్తువులు తయారు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ప్రత్యేక డీలర్లను నియమించుకుని జిల్లాలో సరఫరా చేస్తున్నారు. ఒరిజినల్ కంపెనీ కంటే తక్కువ ధరకు ఇస్తుండటంతో హోల్‌సేల్ వ్యాపారులు నకిలీ వస్తువులనే తెప్పించుకుని జనాలకు విక్రయిస్తున్నారు.

**ఎమ్మార్పీ కంటే తక్కువకు ఇస్తే**

నాగభూషణం, డీఎస్పీ, విజిలెన్స్

నకిలీలపైనా ఒరిజినల్ కంపెనీకి చెందిన బార్ కోడ్‌లను ముద్రిస్తుండటంతో స్కాన్ చేయడం ద్వారా కనుక్కోలేం. అయితే ఒరిజినల్ బ్రాండ్‌తో పోలిస్తే నకిలీ వస్తువుపై ఉన్న రంగుల్లో కచ్చితంగా తేడా ఉంటుంది. మెరిసిపోయే రంగుల్లో ఉండే వస్తువులు నకిలీవి అయ్యే అవకాశం ఉంది. వాస్తవ ధర కంటే తక్కువకే ఇస్తామని చెబితే కచ్చితంగా అనుమానించాల్సిందే.

# జాతీయ రహదారిలో 18 వంతెనలు



అనంతపురం: ఉమ్మడి జిల్లా మీదుగా వెళ్లే 44వ నంబరు జాతీయ రహదారిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. హైదరాబాద్– బెంగళూరులను కలిపే ఈ రహదారిలో ప్రమాదాల నివారణకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా బ్లాక్‌స్పాట్లను గుర్తించారు. అవసరమైన చోట అండర్‌పాస్, ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మాణానికి రంగం సిద్ధమైంది. 14 అండర్ పాస్ బ్రిడ్జిలు, 4 ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. కేంద్రం నుంచి వీటి నిర్మాణం కోసం రూ.600 కోట్లు మంజూరయ్యాయి. పామిడి సమీపంలో 2, కల్లూరు, లోలూరు, వడియంపేట, ఆర్.ఫంక్షన్‌హాల్, ప్రసన్నాయపల్లి, రామినేపల్లి, హంపాపురం, మరూరు, యర్రంపల్లి, అమ్మవారిపల్లి, అమ్మినాయనపల్లి, మిషన్‌తాండ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జిలు ఈ రూ.600 కోట్లతో నిర్మించనున్నారు. ఇందులో పాదచారుల కోసం ఫుట్‌ఓబీ కూడా అనంతపురం వద్ద నిర్మిస్తారు వీటితో పాటు తపోవనం, రాప్తాడు, సోమందేపల్లి, కోడూరు వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని నిర్ణయించారు. వీటికి సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో జనసంచారం, చిన్నవాహనాలు ప్రయాణించే మలుపులు ఎక్కువగా ఉన్నాయి. బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే రాకపోకలకు సజావుగా సాగడానికి, ప్రమాదాలు తగ్గించడానికి అవకాశముంటుంది.

**ఆక్రమణ దారులకు తాఖీదులు**

ప్రసన్నాయపల్లి సమీపాన పెద్దపెద్ద హోటళ్లు జాతీయ రహదారి స్థలాన్ని ఆక్రమించి నిర్మించారని గుర్తించారు. వాటి యజమానులకు ఇటీవల నోటీసులు జారీ చేశారు. ఆక్రమణలు తొలగించడానికి పూనుకొంటున్నారు. ఆక్రమణలు తొలగించడానికి జేసీబీలతో సిబ్బంది వెళ్లారు. కొంత గడువు ఇవ్వాలని, నోటీసులు రాలేదని కొందరు చెబుతున్నారు.

అయితే కొందరు ప్రైవేటు వ్యక్తులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు సమాచారం. సోములదొడ్డి, కోడూరు వద్ద కూడా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించి, నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌ఫ్ సమీపంలో ఆక్రమణలకు వారం రోజుల క్రితం నోటీసులు ఇచ్చారు. ఆక్రమణలు తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జాతీయ రహదారుల శాఖకు చెందిన అధికారులు తెలిపారు.

# అడగరులే.. ఆక్రమించేయ్



తనకల్లు : అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండలంలోని అడవిచెరువు, రెడ్డిపల్లి గ్రామాలకు చెందిన కొందరు పేదలమంటూ ప్రభుత్వ భూమిలో పాగా వేస్తున్నారు. రాత్రికిరాత్రి ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. వీరికి ప్రజా సంఘాల సహకారం తోడవడంతో మరింత రెచ్చిపోతున్నారు. ఇప్పటికే తొమ్మిది ఇళ్ల నిర్మాణం చేపట్టి తితిదే ఫంక్షన్‌హాల్ నుంచి విద్యుత్తు కనెక్షన్ సైతం అక్రమంగా తీసుకున్నారు. ఇదంతా తనకల్లు మండలంలోని బొంతలపల్లి పంచాయతీ, అన్నమయ్య జిల్లా ములకలచెరువు మధ్యలో ఉన్న సర్వేనంబరు 183–ఎలో జరుగుతోంది.

**విలువ చూసి.. పాగా వేసి**

ములకలచెరువు వ్యాపారపరంగా అభివృద్ధి చెందుతున్న మండలం. దీనికితోడు 42 జాతీయరహదారి విస్తరించడం.. టమాటా మార్కెట్ ఉండటంతో అభివృద్ధి వేగంగా జరుగుతోంది. ఈ ప్రాంతంలో పీటీఎమ్ రోడ్డుకు తితిదే ఫంక్షన్‌హాల్ వద్ద సర్వేనంబర్ 183–ఎలో తనకల్లు మండలానికి చెందిన ప్రభుత్వ భూమి 4.28 ఎకరాలు ఉంది. ఇక్కడ సెంటు ధర రూ.4 లక్షలకుపైనే పలుకుతోంది. గతంలో రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ స్థలమని బోర్డు సైతం ఏర్పాటు చేశారు. అయినా అక్రమ నిర్మాణాలు వెలుస్తూనే ఉన్నాయి. అమాయక ప్రజల నుంచి కొందరు రూ.10 వేల నుంచి 20 వేల వరకు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

**చర్యలు తీసుకుంటాం..**

సర్వే నంబరు 183–ఎలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను గురువారం తహసీల్దారు షాబుద్దీన్ తనిఖీ చేశారు. సిమెంట్ ఇటుకలను ట్రాక్టర్‌లో తీసుకొచ్చి దింపుతుండగా అదుపులోకి తీసుకున్నారు. నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్లు ఎప్పటి నుంచి, ఎవరు నిర్మిస్తున్నారనే వివరాలు ఆరా తీశారు. అక్రమ నిర్మాణాలను పూర్తిగా తొలగిస్తామని చెప్పారు. అంతకుముందు బొంతలపల్లి పంచాయతీలోని వడ్డిపల్లికి చెందిన మహిళలు స్థలాలు ఏర్పాటు చేసుకునే ప్రయత్నం చేస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తామని, ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే చట్టపర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నోటీసులు ఇచ్చారు.. మరి వసూళ్లేవి..?

పుంగనూరు: అంతరాయం లేని, నాణ్యతతో కూడిన విద్యుత్తు సరఫరా చేయాలని సామాన్య వినియోగదారుడి నుంచి ప్రభుత్వ కార్యాలయాల అధికారులు, దుకాణదారులు కోరుకోవడం సహజం. గృహ, వాణిజ్య, చిన్న, మధ్య తరహా పరిశ్రమల నిర్వాహకులు బిల్లుల చెల్లింపులో నిబంధనలు పాటిస్తున్నారు. కానీ ప్రభుత్వ కార్యాలయాల బిల్లులు మాత్రం రూ.కోట్లలో పెండింగ్‌లో ఉంటున్నాయి. విద్యుత్తు అధికారులు బకాయిలు ఉన్న కార్యాలయాలకు నోటీసులు పంపుతున్నా ఎలాంటి ఫలితం ఉండటం లేదు. పుంగనూరు విద్యుత్తుశాఖ డివిజన్ పరిధిలో పుంగనూరు, సదుం, పలమనేరు సబ్ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల నుంచి విద్యుత్తు ఛార్జీలు సక్రమంగా వసూళ్లు కావడం లేదు. బకాయిల వసూళ్లపై దృష్టిసారించామని పుంగనూరు ఈఈ శ్రీనివాసమూర్తి తెలిపారు.



# కౌశలం.. సర్వర్ల విఘ్నం

కర్నూలు : పట్టణ ప్రాంతాల్లోని యువతకు స్థానికంగానే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. కౌశలం పేరిట ఇంటి నుంచే ఉద్యోగం (వర్క్ ఫ్రం హోం) కల్పనకు చర్యలు చేపట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2 లక్షల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరి అర్హతలను తేల్చేందుకు సచివాలయ ఉద్యోగులు చేపట్టిన సర్వే కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 68 శాతం మంది విద్యార్హతల ధ్రువపత్రాలను కౌశలం యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వీరికి ఈనెల 2వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో కౌశలం పరీక్షలు నిర్వహిస్తున్నారు.

**లక్ష మందికి అవస్థ**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 1,36,596 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను సచివాలయ సిబ్బంది కౌశలం యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ప్రసుతం వీరందరికీ గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆన్‌లైన్‌లో కౌశలం పరీక్ష నిర్వహిస్తున్నారు. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. రెండు పేపర్లు ఉంటాయి. కమ్యూనికేషన్ స్కిల్ అసెస్‌మెంట్‌కు 15 నిమిషాలు, స్కిల్ అసెస్‌మెంట్‌కు 45 నిమిషాలు కేటాయించారు. రోజుకు ఒకరిద్దరు



చొప్పున ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్య పరీక్ష నిర్వహిస్తున్నారు.

అభ్యర్థి ఎక్కడి నుంచి పరీక్ష రాస్తున్నారో గుర్తించేందుకు వీలుగా లైవ్ లొకేషన్ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాల్సి ఉంది. ఈ విధానంతో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి.

**అభ్యర్థులకు తప్పని పరీక్ష**పరీక్షకూ ఇబ్బందులు తప్పడం లేదు. సమస్య పరిష్కారానికి లైవ్ లొకేషన్ క్యాప్చర్ కోడ్‌ను తొలగించినా చాలాచోట్ల సర్వర్లు పనిచేయడం లేదు. సచివాలయాల్లోని కంప్యూటర్లకు యూపీఎస్, ఇన్వర్టర్ సదుపాయం లేకపోవడం వల్ల కూడా సమస్యలు ఎదురవుతున్నాయి. మరోవైపు దరఖాస్తు చేసుకున్న వారిలో చాలామంది అభ్యర్థులు అందుబాటులో లేకపోవడంతో పరీక్షకు గైర్హాజరవుతున్నారు. అనివార్య కారణాల వల్ల పరీక్ష రాయలేని అభ్యర్థులు వారికిచ్చిన లింక్‌లో ఆధార్ నంబరు ద్వారా రీషెడ్యూల్ చేసుకోవచ్చని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు.

# అడుగు దూరంలో.. ఆశల రేవు

నెల్లూరు: : దశాబ్దాల మత్స్యకారుల కల.. జువ్వలదిన్నె షిషింగ్ హార్బర్ ప్రారంభానికి ముహూర్తం కుదరడం లేదు. పనులు దాదాపు కొలిక్కి వచ్చినా.. దాని బాధ్యతను ఎవరు తీసుకోవాలన్న దానిపై ప్రతిష్టంభన నెలకొంది. మత్స్యశాఖ పేరు వినిపిస్తున్నా.. ఆ శాఖ సముఖంగా లేదు. ఒక వేళ తీసుకున్నా.. ప్రతి నెలా అయ్యే నిర్వహణ ఖర్చును ఏ పద్దు నుంచి భరించాలన్న దానిపై స్పష్టత కొరవడింది. ఇటీవల రాష్ట్రస్థాయి అధికారులు కృష్ణబాబు, రాజశేఖర్‌లు



పరిశీలించి.. సాధ్యాసాధ్యాలపై సర్వే చేయిస్తున్నా... క్షేత్రస్థాయిలో అందుకు తగ్గ పరిస్థితి కనిపించడం లేదు.

**దృష్టిసారించాల్సినవి ఎన్నో...**

బోగోలు మండలం జువ్వలదిన్నె సమీపంలో నిర్మించిన ఫిషింగ్ హార్బర్ దేశంలోనే అతిపెద్దది. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు కొలిక్కి వచ్చినా.. బకింగ్‌హామ్ కెనాల్‌పై వంతెన నిర్మాణం, సోలార్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు తాగునీరు, విద్యుత్తు సదుపాయాలు కల్పించాల్సి ఉంది. మత్స్యకారులకు రాయితీపై బోట్లు ఇచ్చే ప్రక్రియ పూర్తి కాలేదు. మెకనైజ్డ్ బోట్లు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా.. తమిళనాడు నుంచి వచ్చే మత్స్యకారులను ఎదుర్కొనేందుకు అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బోట్లు అవసరమని భావిస్తున్నారు. వాటి ధర కూడా అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం హార్బర్‌కు వెళ్లే దారిలో వంతెన పూర్తి చేసేందుకు రూ. 2.75 కోట్లు మంజూరు చేసింది. పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రాజెక్టు ఫిషింగ్ హార్బర్
ప్రాంతం జువ్వలదిన్నె
నిధులు రూ.288.80 కోట్లు
విస్తీర్ణం 115.69 ఎకరాలు
జెట్టీ సామర్థ్యం 1250 పడవలు
నిర్మించిన భవనాలు 45
ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి 25వేల మంది

# వీధి ఒక్కటే.. జిల్లాలు రెండు

వరికుంటపాడు: అదో కుగ్రామం.. దానికి రెండు పేర్లు.. రెండు జిల్లాల పరిధి. వీధే హద్దు. ఇదీ వరికుంటపాడు మండలంలోని భోగ్యంవారిపల్లె ప్రత్యేకత. కొత్తవారు వెళితే ఇట్టే తికమకపడే ఈ గ్రామం 565వ నంబరు జాతీయ రహదారిని ఆనుకుని ఉంది. ఇందులో ప్రధాన వీధి ప్రకాశం జిల్లా సరిహద్దుగా ఉండగా– ఉత్తరం వైపున్న ప్రాంతాన్ని పామూరు మండలంలోని తిరగలదిన్నెగా.. దక్షిణం వైపున్న భాగాన్ని మండలంలోని భోగ్యంవారిపల్లెగా పిలుస్తారు. భోగ్యంవారిపల్లెకు ఏడు గృహాలు ఉంటే.. తిరగలదిన్నెలో 100 వరకు ఉన్నాయి. జిల్లాల సరిహద్దులు కావడంతో.. ఎన్నికల సమయంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పోలీసులు 565 జాతీయ రహదారిపై పక్క పక్కనే చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకుంటారు.

# అనుసంధానానికి ఎన్నేళ్లో ?

రాయదుర్గం: ఏళ్ల తరబడి రైల్వే వంతెనలకు అనుసంధాన దారులు నిర్మించకపోవటంతో రైల్వేగేట్ల వద్ద తరచు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం మేర నిధులతో వంతెనలు, అనుసంధాన రోడ్లను నిర్మించాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం అనుసంధాన రోడ్లను నిర్మించాలని కేంద్ర ప్రభుత్వం చెబుతుండగా, రాష్ట్ర ప్రభుత్వం తమవద్ద నిధులు లేవని రైల్వే శాఖనే అనుసంధాన దారులు నిర్మించాలని పేర్కొంటుండటంతో నిర్మాణాల్లో జాప్యం ఏర్పడుతుంది. దీంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్‌జామ్‌తోపాటు ప్రమాదాలు జరుగుతున్న విషయం విదితమే.

**తరచూ ప్రమాదాలు** వారం కిందట ముదిగుబ్బలో పాతూరు రైల్వే గేటును మినీ బస్సు ఢీకొన్న ఘటనతో ప్రమాదం చోటుచేసుకుంది. రాయదుర్గం పట్టణం అనంతపురం రోడ్డులోని రైల్వే గేటు వద్ద పట్టణానికి చెందిన ఓ ఆటో రైల్వే గేటు వద్ద లిఫ్టింగ్ బ్యారర్(బూమ్‌ని) ఢీకొట్టడంతో అది విరిగింది. దీంతో సకాలంలో గేట్లు వేయక, సిగ్నల్ పనిచేయక రైళ్ల రాకపోకల్లో ఆలస్యం జరిగింది.




డి.హిరేహాళ్ మండలం హిర్దేహాళ్ వద్ద కాపలా లేని రైల్వే గేటు వద్ద స్థానిక ఆర్టీసీ బస్సును రైలు ఢీకొన్న ప్రమాదంలో పలువురు మృత్యువాతపడ్డారు. గతంలో కణేకల్లు రోడ్డులో గేటు సక్రమంగా పడకపోవటంతో రాకపోకలు నిలిపి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. ఇటీవల కొత్తగా నిర్మిస్తున్న రైల్వే లైన్లలో గేట్లు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. రాయదుర్గం నుంచి కదిరిదేవరపల్లి వరకు ఎక్కడా రైల్వే గేట్లు లేవు.

చోదకులు సంయమనం పాటించాలి

**– ఉమామహేశ్వర్, రాయదుర్గం స్టేషన్ మాస్టర్**

రైల్వే గేట్లవద్ద గేటు వేసిన తర్వాత రైళ్లు వెళ్లేదాకా ప్రజలు సహనంతో సంయమనం పాటించాలి. అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలి. సకాలంలో రైళ్లు గమ్యస్థానాలకు చేరేందుకు గేట్లు తప్పని సరిగా వేయాల్సి ఉంటుంది.

# అడ్డుకునేదెవరు.. తరలించేయ్

కళ్యాణదుర్గం : జిల్లాలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. నదులు, వాగులు, వంకలను తవ్వేస్తున్నారు. ఇసుకను ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా తెలిసినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. నిత్యం వందల ట్రాక్టర్లలో జిల్లా కేంద్రం, కర్ణాటకతోపాటు ఇతర ప్రాంతాలకు టన్నులకొద్ది ఇసుక తరలిపోతోంది.

**దూరాన్ని బట్టి ధర నిర్ణయం**

కళ్యాణదుర్గం నియోజకవర్గం సరిహద్దు గ్రామాలైన మానిరేవు, ఓబుళాపురం, కాలువపల్లి, ఆత్మకూరు, బాలవెంకటాపురం, నూతిమడు గుతండా గ్రామాల మధ్య పెన్నా పరివాహక ప్రాంతంలో ఇసుక అక్రమంగా లక్షల క్యూబిక్ మీటర్ల మేర తవ్వేస్తున్నారు. దూరాన్ని బట్టి ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.4,200 నుంచి రూ.4,800 వరకు విక్రయిస్తున్నారు. ఇటీవల వర్షాలు కురిసి పెన్నాలో నీరు చేరినా ఇతసుక తోడకం మాత్రం ఆగడం లేదు. తవ్వకాలు ఇలాగే జరిగితే వ్యవసాయ క్షేత్రాల్లోని బోరుబావుల్లో నీటిమట్టం తగ్గిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక తవ్వకాలపై ప్రశ్నించి, అడ్డుకుంటే తమపై అక్రమార్కులు దాడులకు తెగబడుతున్నారని రైతులు, ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఇసుకను తోడేయడంతో భారీ స్థాయిలో గుంతలు ఏర్పడ్డాయి.



**సెలవు రోజుల్లో తెగింపు**

కుందుర్పి మండలంలోని కొలిమిపాళ్యం, అల్లాపురం, బసాపురం, యర్రగుంట, తూముకుంట తదితర గ్రామాల సమీపాల్లోని వాగులు, వంకల్లో ఇసుకను తవ్వి కర్ణాటక సరిహద్దు గ్రామాలకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.3,200 నుంచి రూ.3,800 వరకు విక్రయిస్తున్నారు. కొందరు నాయకులు ఇదే పనిని వృత్తిగా మార్చుకున్నారు. రాత్రివేళ, సెలవు రోజుల్లో ఎవరు ఉండరనే ఉద్దేశంతో తవ్వకాలు చేస్తున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

**నిఘా ఉంచి అడ్డుకుంటాం**

వసంత్‌బాబు, కళ్యాణదుర్గం ఆర్డీవో

ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవు. ఏ ప్రాంతంలోనూ తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదు. ప్రత్యేక నిఘా ఉంచి అధికారులతో దాడులు చేయిస్తాం. ఇసుక తరలించే వాహనాలను సీజ్‌చేసి, బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం.

# ప్రయోగాలకు త్రీడీ ముద్ర

తిరుపతి : దీర్ఘకాల అనారోగ్య సమస్యలతో బాధపడే వారికి ఉపశమనం కలిగించే పరిశోధనలు చేస్తున్నారు శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ ఫార్మసీ విభాగం విద్యార్థినులు. మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ వంటి వివిధ వ్యాధులపై పరిశోధకురాలు హర్షిణి ప్రయోగాలు చేయగా.. శరీరంపై గాయాలను నయం చేయడానికి స్కాఫ్‌ఫోల్డ్ టిష్యూలను రూపొందించారు ఎం.ఫార్మసీ విద్యార్థిని కృష్ణతేజశ్విని. వీటి తయారీకి ఒకరు బయోసిరమిక్, బయోమెటీరియల్స్‌ను వినియోగిస్తే, మరొకరు గండపురా (వింటర్ గ్రీన్‌ప్లాంటు) మొక్క ఆకుల నుంచి తీసిన ఆయిల్‌ను వినియోగించారు. వీరి పరిశోధనలను వివరించారిలా..

**పుండ్లను నయం చేసేలా..** పుండ్లు, కాలిన గాయాలు నయం కావడానికి కొంత సమయం పడుతుంది. మధుమేహ బాధితులకు చాలా సమయం కావాలి. ఇవి పెద్దవైనప్పుడు నయం చేయడానికి మన శరీరం నుంచి కానీ, ఇతరుల శరీరం నుంచి కానీ కావాల్సిన చర్మాన్ని తీసి గాయాలపై అమరుస్తారు. ఇదెంతో ఖర్చుతో కూడుకున్న పని. కొన్నిసార్లు దుష్ప్రభావాలు ఎదురవుతాయి. దీని పరిష్కారానికి బయోసిరమిక్, బయోమెటీరియళ్లను వినియోగించి త్రీడీ ప్రింటింగ్‌తో స్కాఫ్‌ఫోల్డ్ టిష్యూ రూపొందించా. ఇప్పటివరకు విరిగిన ఎముకలు అతుక్కోవడానికే వీటిని వినియోగించేవారు. మన శరీరంలో ఉండే కొలాజిన్ ప్రొటీన్ చర్మం, ఎముకలు, కండరాలు, నరాలను బలోపేతం చేస్తుంది. మధుమేహం బాధితుల్లో కొలాజిన్ అంత శక్తిమంతంగా పని చేయదు. గాయాలను స్కాఫ్‌ఫోల్డ్ త్వరగా నయం చేస్తుంది. ఎలుకలపై చేసిన ఈ ప్రయోగం విజయవంతం కావడంతో దీనిపై పేటెంట్ పొందేందుకు దరఖాస్తు చేసుకున్నా.

ఎం.హర్షిణి, పరిశోధక విద్యార్థిని

**వింటర్ గ్రీన్ ఆయిల్‌తో..** పుండ్లు, గాయాలు నయం చేయడానికి రకరకాల పూత మందులు వినియోగిస్తుంటాం.

# ఏడు కొండలు.. ఏడు బ్రాండ్లు..



తిరుపతి : దేవుడికి అర్చన చేసిన పూలను అర్చకులు భక్తులకు ప్రసాదంగా ఇస్తే కళ్లకు అద్దుకొని స్వీకరిస్తారు. సాక్షాత్తు దేవదేవుడైన కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామికి అలంకరించిన పూలమాలలతో అగరబత్తీలు తయారు చేస్తే.. వాటి పవిత్రత గురించి చెప్పాల్సిన పనిలేదు. ఎస్వీ గోసంరక్షణ శాలలోని తితిదే (దర్శన్) కేంద్రంలో తయారు చేస్తున్న ఏడు రకాల అగరబత్తీలకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది.

**విస్తరించిన విక్రయాలు**

ఏడు కొండలను ప్రతిబింబించేలా అగర బత్తీలకు తందనాన, దివ్యపాద, అభయహస్త, దృష్టి, సృష్టి, ఆకృష్టి, తుష్టి అనే పేర్లు పెట్టారు. ఒక్కో రకం అగరబత్తీకి ఒక్కో రకం పువ్వును వినియోగిస్తారు. వీటికి విపరీతంగా ఆదరణ ఉండడంతో అనుబంధ ఆలయాలతోపాటు, తెలంగాణ, చెన్నై, బెంగళూరు రాష్ట్రాల్లోని తితిదే ఆలయాల్లోనూ విక్రయిస్తున్నారు.

**సరిపడా లేని ఉత్పత్తి**

ప్రారంభించిన రెండేళ్లలోనే భక్తుల డిమాండుకు తగ్గట్టు ఉత్పత్తి చేయలేకపోయారు. స్పందించిన తితిదే అధికారులు 2023లో మరో యూనిట్‌ను ప్రారంభించారు.

**మహిళలే ఎక్కువ..**

అగర్‌బత్తీ కేంద్రంలో మొత్తం 150 మంది పని చేస్తుండగా.. అందులో 128 మంది మహిళలే ఉండటం గమనార్హం. రోజుకు వంద గ్రాముల ప్యాకెట్లు 27వేల వరకు తయారుచేస్తున్నారు.

**రోజుకు ఉత్పత్తి: 27 వేల ప్యాకెట్లు**

ఆదాయం నెలకు: రూ. 4 కోట్ల నుంచి రూ.5 కోట్లు

ఎల్ఎస్‌నగర్ సమీపంలోని ఎస్వీగోసంరక్షణ శాల ప్రాంగణంలో 2021లో సెప్టెంబరు 13న దర్శన్ ఇంటర్నేషనల్, బెంగళూరు సహకారంతో తితిదే అగరబత్తీల తయారీ కేంద్రం ఏర్పాటుచేశారు.

**తయారీ ఇలా..**

ఏరోజుకారోజు స్వామి, అమ్మవార్లకు అలంకరించి తీసేసిన పూలమాలలను అగరబత్తీ కేంద్రానికి తరలిస్తారు.

పూలను వేరు చేసి జల్లెడపడతారు. తర్వాత ఓ యంత్రంలో వేసి వాటిని నిర్ణీత వేడిలో ఆరబెడతారు. ఆరబెట్టిన పూలను పొడిచేసి, పలు మిశ్రమాలను కలిపి యంత్రాల్లో పోస్తారు. యంత్రం నుంచి వచ్చే పొడితో అగరబత్తీలు తయారుచేస్తున్నారు.

# ఒకే డివిజన్.. కూటమి విజన్



పుత్తూరు : ప్రజలకు సులభతర సేవలు అందించేందుకు ఒక నియోజకవర్గానికి ఒక రెవెన్యూ డివిజన్ నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం నగరికి వరం కానుంది. ఈ నియోజక వర్గంలోని మూడు మండలాలు నగరిలో, మరో రెండు తిరుపతి రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. నూతన విధానంతో అన్ని మండలాలు ఒకే డివిజన్‌లోకి రానున్నాయి.

గత ప్రభుత్వం నియోజకవర్గంలోని మండలాలను అస్తవ్యస్తంగా విభజించింది. పుత్తూరు, వడమాలపేట మండలాలను తిరుపతి జిల్లాలో.. నగరి, నింద్ర, విజయపురం మండలాలను చిత్తూరులో కలిపారు. ఈ నేపథ్యంలో నగరి రెవెన్యూ డివిజన్‌లో నగరి, విజయపురం, నింద్ర, కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్.ఆర్.పురం, పాలసముద్రం మండలాలు ఉన్నాయి. పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి డివిజన్‌లో చేర్చారు. కార్వేటినగరం, వెదురుకుప్పం, ఎస్ఆర్‌పురం, పాలసముద్రం మండలాల ప్రజలు నగరి రావాలంటే పుత్తూరుకు వచ్చి వెళ్లాలి. దీంతో ప్రజల ఇబ్బందులు వర్ణనాతీతం. కూటమి ప్రభుత్వం దిశానిర్దేశంతో నగరి డివిజన్‌లో నగరి, పుత్తూరు, వడమాలపేట, నింద్ర, విజయపురం మండలాలు ఉంటాయి. గతంలో ఉన్న కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం, వెదురుకుప్పం, పాలసముద్రం చిత్తూరు డివిజన్‌లోకి వెళ్లి పాలనాపరమైన సౌలభ్యం ఉంటుంది.

**ఇతర శాఖల సమస్యలు ఇలా..**

ప్రస్తుతం నియోజకవర్గంలో ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు పనిచేస్తున్నారు. వ్యవసాయం, జలవనరుల శాఖలో పుత్తూరు, నగరి డివిజన్లు ఉండటం సమస్యగా మారింది. వీటిని ఒకే డివిజన్ కిందకు తీసుకొస్తే ఇది పరిష్కారమవుతుంది. పుత్తూరు వ్యవసాయ డివిజన్‌లో నగరి, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గంలోని మండలాలు ఉన్నాయి. దీంతో ఏ సమాచారం కావాలన్నా ఇబ్బందులే. రైతులు అక్కడికి చేరుకోవాలంటే అవస్థే. ఈ నేపథ్యంలో అన్ని శాఖలను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా తీసుకొస్తే ప్రజల కష్టాలు తొలగినట్లే.

# దేవుడా.. దేవుడా 'ఆనందపురం' దాటించు!



విశాఖపట్నం : ఎక్కడైతే... ప్రతి వాహనం కచ్చితంగా ఆగి తీరుతుందో..

ఎక్కడైతే... గజిబిజి గందరగోళం కనిపిస్తుందో..

ఎక్కడైతే.. ఇది జాతీయ రహదారేనా అని అనిపిస్తుందో..

ఎక్కడైతే... ట్రాఫిక్ పోలీసులు ఉరుకులు పరుగులు పెడతారో..

**అదే... ఆనందపురం కూడలి!!**

భోగాపురం విమానాశ్రయం నుంచి విశాఖ నగరానికి ట్రాఫిక్ ఇక్కట్లు లేకుండా వచ్చేందుకు అధికారులు కొన్ని రహదారులను విస్తరిస్తున్నారు. కానీ, అత్యంత కీలకమైన 'ఆనందపురం కూడలి'లో సమస్యను మాత్రం పట్టించుకోవడం లేదు. జాతీయ రహదారులపై రాష్ట్రంలో ఎక్కడా కనిపించనంత విచిత్ర, అయోమయ... ప్రమాదకర పరిస్థితిని ఇక్కడ చూడొచ్చు. అయినా... అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్య తీవ్రతను కళ్లారా చూస్తూనే కాలం గడిపేస్తున్నారు.

బీచెన్నై–కోల్‌కతా (జాతీయ రహదారి–16) మార్గంలో ఆనందపురం వద్ద నిత్యం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 నుంచి రాత్రి 8 గంటల వరకూ ట్రాఫిక్ చాలా రద్దీగా ఉంటుంది.

పెందుర్తి, పద్మనాభం, ఆనందపురం మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు సర్వీసు మార్గంలోనే రావాల్సివస్తోంది.

శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి వచ్చే వాహనాలకే ఇబ్బంది ఉండదు.

**సమస్య 1**

గండిగుండం నుంచి ఆనందపురం రావాలంటే.. సర్వీసు రహదారే దిక్కు. జాతీయ రహదారిపై ప్రయాణిస్తే ఆనందపురం దాటి 3 కి.మీ. ముందుకెళ్లి, మళ్లీ 3 కి.మీ. వెనక్కి రావాల్సిందే.

**సమస్య 2**

విశాఖ నుంచి (కొమ్మాది మీదుగా) వచ్చి ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారిపైకి చేరాలంటే చుక్కలు కనిపిస్తాయి. కూడలి నుంచి సర్వీసు రోడ్డులో 17 కి.మీ. ప్రయాణిస్తే గండిగుండం వద్ద జాతీయ రహదారిపైకి వెళ్లేందుకు అవకాశం ఉంది. లేదంటే... కూడలి దాటి 3 కి.మీ. ముందుకెళ్లి... మళ్లీ సర్వీసు రోడ్డులో 2 కి.మీ. వెనక్కి వస్తే జాతీయ రహదారిపైకి చేరొచ్చు.

**సమస్య 3**

విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా వైపు వెళ్లే ఏ వాహనమైనా జాతీయ రహదారి దిగి.. కూడలిని దాటి... మళ్లీ సర్వీసు రోడ్డు మీదుగా కి.మీ. ప్రయాణిస్తేగానీ జాతీయ రహదారిపైకి చేరదు.

**ఏం చేయాలంటే..** ఇక్కడ ప్రస్తుతమున్న సర్వీస్ మార్గాలను విస్తరించాలి. స్థానిక పరిస్థితులకు, వ్యాపారాలకు ఇబ్బంది లేని రీతిలో పరిష్కారమార్గం చూపించాలి. ఉత్తరాంధ్రలోనే అతి పెద్ద పూల మార్కెట్‌కు రాకపోకలు సజావుగా సాగేలా చూడాలి.

# ఎంపీ తలుచుకుంటే.. పనైపోద్ది..!

మధురానగర్ : గుణదల మూడు వంతెనల ఆర్ఓబీ.. రైవస్ కాలువ, ఏలూరు కాలువ, బుడమేరుల మీదుగా గుణదల నుంచి నున్నకు సులువుగా చేరేందుకు తలపెట్టిన పై వంతెన ఇది. 2009లో శంకుస్థాపన చేసుకోగా.. కొద్దిపాటి నిర్మాణం జరిగి ఆ తర్వాత నిలిచిపోయింది. ఇది ఎప్పుడు పూర్తవుతుందా..? అని గుణదల వాసులు ఎదురు చూస్తున్నారు. 2006లో రూ.36 కోట్ల అంచనాలతో సిద్ధం చేయగా.. తాజాగా రెట్టింపు అయింది. అయితే రైల్వేశాఖ గతిశక్తి ప్రాజెక్టు కింద పూర్తి స్థాయిలో నిర్మించేందుకు ముందుకు వచ్చింది.

**తప్పని ట్రాఫిక్ కష్టాలు**

గుణదల 1వ డివిజన్ ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోంది. వేలాది నివాసాలు వస్తున్నాయి. వారంతా ఈ మూడు వంతెనల మీదుగా రాకపోకలు సాగించారు. అవి ఇరుకుగా ఉండటంతో.. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. అందుకే పైవంతెనను వేగంగా పూర్తి చేస్తే ఈ కష్టాలు తీరతాయని స్థానికులు అంటున్నారు.

**చొరవ చూపితేనే పరిష్కారం**

రైల్వేశాఖ వద్ద పెండింగ్‌లో ఉండడంతో పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ చొరవ చూపితేనే పనులు ప్రారంభమవుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభమై.. నిర్మాణం పూర్తి చేసుకుని ఘనంగా ప్రారంభం చేస్తారని ఎదురు చూస్తున్నామని పేర్కొంటున్నారు. ఆ దిశగా ఎంపీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



**అన్నీ సిద్ధమైనా...**

పైవంతెన నిర్మాణానికి అన్నీ సిద్ధమయ్యాయి. నిర్మాణానికి అవసరమైన భూసేకరణ పూర్తయింది. కాలువగట్లను ఖాళీ చేయించారు. ప్రాజెక్టు నిర్మాణ పనులు రైల్వే వద్ద పెండింగ్‌లో పడడంతో పనులు ప్రారంభం కాలేదు. కారల్‌మార్క్స్ రోడ్డులో పైవంతెన నిర్మాణమయ్యే ప్రాంతం ఇప్పుడు చెత్తకుప్పలకు కేంద్రంగా మారిపోయింది. పనికి రాని మట్టి, చెత్తను తీసుకువచ్చి పైవంతెన నిర్మాణం జరిగే ప్రాంతంలో నిల్వ చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం డంపింగ్ యార్డ్‌లా మారిపోయింది.

**రైలు గేటు పడితే అంతే..**

విజయవాడ–గుడివాడ రైలు మార్గం ఉంది. గూడ్సు రైళ్లు ఎక్కువగా వస్తుంటాయి. ఒక్కోసారి రెండు వస్తాయి. అప్పటి వరకు గేటు తీయరు. దీంతో అరగంట సేపు ఆగిపోవాల్సిందే. గేటు తీసినా ఇరువైపులా భారీగా నిలిచిపోయిన వాహనాలు క్లియర్ అయ్యేందుకు ఎక్కువ సమయం తీసుకుంటుంది. సువర్చల, లెనిన్‌నగర్

**అరగంట ముందు బయలుదేరాలి**


పిల్లలను పాఠశాలకు తీసుకువెళ్లాలంటే వంతెనపై ఉదయం వేళ ట్రాఫిక్ నిలిచిపోతుంది. అందుకే అరగంట ముందు బయలుదేరాలి. ట్రాఫిక్ ఆగితే.. ఆ రోజు ఆలస్యమైనట్లే. వేరే వైపు వెళదామంటే.. సరైన మార్గమే లేదు. రోజూ నిలిచిపోయే ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నాం. సుబ్బారావు, కర్మెల్‌నగర్

# పాత పనుల్లో గుట్టు.. కొత్త బిల్లుల్లో కనికట్టు

అమరావతి : పెనుగంచిప్రోలు పంచాయతీలో పాత పనులకు కొత్తగా బిల్లులు చేసుకుని భారీగా నిధులు పక్కదారి పట్టించారు. 2014–19 తెదేపా పాలనలో చేసిన పనులకు వైకాపా పాలనలో బిల్లులు చేసుకున్నారు. పారిశుద్ధ్య పనులు చేసే సిబ్బంది జీతాలను సైతం పక్కదారి పట్టించారు. ఈ వ్యవహారం మొత్తం స్థానిక వైకాపా నాయకులు, సిబ్బంది కుమ్మక్కై చేసినట్లు తెలుస్తోంది.

**రూ.లక్షలు మింగేశారు...**

గ్రామంలో తాగునీటి అవసరాలకు 2023–24లో కొత్త ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణం చేసినట్లు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.31.6లక్షలు బిల్లులు తీసుకున్నారు. పంచాయతీలో 3 ట్యాంకులు ఉండగా 20 ఏళ్ల కిందటే రెండు నిర్మించారు. 2014–19 తెదేపా పాలనలో ఒక ట్యాంకు నిర్మించారు. దానికి అప్పుడే బిల్లులు చెల్లించేశారు. మరో ట్యాంకు ఎక్కడా నిర్మించలేదు. బిల్లులు మాత్రం స్వాహా చేశారు. గ్రామంలో ఓ సీసీ రహదారి నిర్మాణం 2022లో చేపట్టినట్లు రూ.11.34లక్షలు బిల్లులు తీసుకున్నారు. వాస్తవానికి ఆ రహదారి 2014–19 తెదేపా పాలనలోనే నిర్మాణం చేపట్టారు.



మరికొన్ని పనులు చేసినట్లు రూ.22లక్షలు బిల్లులు తీసుకున్నారు.

**వైకాపా నేతల దందా..**

పంచాయతీలో మొత్తం 30 మంది పారిశుద్ధ్య కార్మికులకు ఒక్కొక్కరికి నెలకు రూ.15,480 చొప్పున జీతం ఇస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వీరిలోనే 16 మందిని హరిత రాయబారులుగా నియమించినట్లు తీర్మానం చేశారు. ఒక్కొక్కరికీ నెలకు రూ.6వేల చొప్పున రూ.96వేలు చెల్లిస్తున్నారు. 15వ ఆర్థిక సంఘం నుంచి సాధారణ నిధులకు మళ్లించి అక్కడ నుంచి సొమ్ము స్వాహా చేస్తున్నారు. వైకాపా పాలనలో పంచాయతీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.50లక్షల వరకు స్వాహా చేశారు.

**ఇన్నాళ్లు ఏం చేస్తున్నారో?** వైకాపా మద్దతుదారుడైన సర్పంచి, కార్యదర్శి కలిసే నిధుల దుర్వినియోగం చేసినట్లు పంచాయతీ 14వ వార్డు సభ్యుడు ప్రవీణ్ నాయకులు, అధికారులకు ఫిర్యాదులు చేశారు. అధికారులు కనీసం పరిశీలించకుండానే రూ.కోటికి పైగా బిల్లులు మంజూరు చేశారంటే వారికీ భారీగా ముడుపులు అందినట్లు తెలుస్తోంది. 'అక్రమాల విషయం నా దృష్టి వచ్చింది. విచారణకు ఆదేశాలిచ్చాను. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం' అని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# కల్యాణ వేదిక.. గుత్తేదారుల వేడుక

కర్నూలు : ప్రైవేటు కల్యాణ మండపాల అద్దెలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇంటి వద్ద వసతి లేని సామాన్యులు ప్రైవేటు ఫంక్షన్ హాళ్లలో వివాహాలు, శుభకార్యాలు జరిపించడం భారంగా మారింది. ఈ పరిస్థితిని గుర్తించిన ఎన్టీ రామారావు.. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కల్యాణ మండపాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దశాబ్దాలపాటు ప్రజలకు సేవలు అందించిన వీటిని గత వైకాపా ప్రభుత్వం గుత్తేదారులకు ధారాదత్తం చేసింది.

**అడిగినంత ఇవ్వాల్సిందే..**

బేతంచెర్ల సమీపంలో నిర్మించిన తితిదే కల్యాణ మండపం శిథిలావస్థకు చేరుకుంది. నాలుగేళ్ల కిందట దీనిని ఓ వ్యక్తికి లీజుకు ఇచ్చారు. ఒక వివాహానికి రోజుకు రూ.6 వేలతో పాటు సామగ్రి, విద్యుత్తు, లేబర్ ఛార్జీల పేరుతో రూ.30,500 వరకు వసూలు చేస్తున్నారన్న



ఆరోపణలున్నాయి.

**లీజు పేరుతో..** ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 10 తితిదే కల్యాణ మండపాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో అత్యధిక కల్యాణ మండపాలను లీజుకు ఇచ్చారు. వీటిని దక్కించుకున్న గుత్తేదారులు.. నిర్వాహకుల నుంచి భారీగా సొమ్ము వసూలు చేస్తున్నారే తప్ప వసతులు మాత్రం సమకూర్చడం లేదు.

పత్తికొండ, ఆదోని, నందికొట్కూరు, బండిఆత్మకూరు మండలం పార్నపల్లి (నంద్యాల సమీపంలో), ఎర్రగుంట్ల, కోవెలకుంట్ల, బేతంచెర్లలోని ఫంక్షన్ హాళ్లను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. కర్నూలు, నంద్యాల, ఎమ్మిగనూరులోని కల్యాణ మండపాల్లో చేపట్టిన ఆధునికీకరణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

# ఈ- శ్రమ్ కార్డులు.. భద్రతకు భరోసా

కళ్యాణదుర్గం : సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేసే వారితోపాటు వలస కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తూ, సంక్షేమ పథకాలు అందించాలనే సుప్రీకోర్టు ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం 2021 ఆగస్టు 26న 'ఈ- శ్రమ్' పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. ఇందులో పేర్లు, వివరాలు నమోదు చేసుకున్న కార్మికులకు ఉచితంగా యూఏఎన్ గుర్తింపు కార్డులను జారీ చేస్తారు. దేశంలో ఎక్కడైనా ఈ కార్డు చెల్లుబాటు అయ్యేలా యూనివర్సల్ అకౌంట్ నంబరు(యూఏఎన్)ను అందజేస్తున్నారు. అనంతపురం జిల్లావ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత రంగాల్లో సుమారు 10 లక్షల కార్మికులున్నారు. ఈ-శ్రమ్ కోసం ఇప్పటివరకు 8 లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా.. కార్డులు సైతం జారీ చేశారు. పుట్టపర్తి జిల్లావ్యాప్తంగా మొత్తంగా 3.10 లక్షల మంది కార్మికుల్లో కేవలం 1.10 లక్షల మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకోగా.. వారికీ కార్డులు అందాయి.

**నమోదు ఎలాగంటే..?** సంఘటిత, అసంఘటిక రంగాల్లో పనులు చేసే కార్మికులు 21 సంవత్సరాల నుంచి 60 ఏళ్ల వయస్సు కలిగిన వారు భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ద్వారా లేదా సమీపాల్లోని కామన్




సర్వీస్ సెంటర్ల ద్వారా, సచివాలయాల్లో, కార్మిక శాఖ అధికారులు, చరవాణిలో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ కోసం నమోదు చేసుకోవచ్చు. దీనికి ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నంబరు, నామిని ఖాతా, చరవాణి నంబరు తప్పనిసరి. గత వైకాపా ప్రభుత్వం 'ఈ- శ్రమ్' కార్డుల పంపిణీని 2023లో నిలిపివేసి ంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిని పునరుద్ధరించింది.

**అనేక ప్రయోజనాలు**

ఈ-శ్రమ్ ద్వారా నమోదు చేసుకొన్న కార్మికుడికి 12 అంకెల గల యూఏఎన్ గుర్తింపు కార్డు అందజేస్తారు. ఈ కార్డు ఉన్న వారికి ప్రభుత్వం అందించే సంక్షేమ, సామాజిక భద్రత పథకాలు వర్తిస్తాయి. కార్డుదారులు ప్రమాదంలో మృతిచెందితే ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన పథకం ద్వారా రూ.2 లక్షలు, గాయపడినా, వైకల్యానికి గురైనా రూ.లక్ష పరిహారం వస్తుంది.

**ఉద్యోగ, ఉపాధి అవకాశాలు-** లక్ష్మీనరసయ్య, ఉపకార్మిక శాఖ కమిషనర్ 'ఈ-శ్రమ్' పథకం నమోదులో రాష్ట్రంలోనే ఉమ్మడి అనంత జిల్లా రెండో స్థానంలో ఉంది. ప్రతి కార్మికుడు నమోదు చేసుకుంటే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. వీటిపై అవగాహన కల్పిస్తూ నమోదు చేస్తున్నాం.

# వైద్యం.. మారని దైన్యం!



నెల్లూరు : గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వెనుకబడుతూనే ఉన్నాయి. జిల్లాలోని ఏ ఒక్క దానికీ 'ఏ' గ్రేడ్ రాకపోవడం.. వాటి పనితీరును తేటతెల్లం చేస్తోంది.

**అక్టోబరు నెలలో...**

జిల్లాలోని ఏ పీహెచ్‌సీకి ఏ గ్రేడ్ రాలేదు. 8 బీ, 36 సీ, 8 డీ గ్రేడ్‌లో నిలిచాయి. జిల్లాపరంగా బీ గ్రేడ్‌లో నిలిచిన కోవూరుపల్లి మొదటి స్థానంలో నిలవగా.. రాష్ట్ర స్థాయిలో 241వ ర్యాంకులో ఉంది. గట్టుపల్లి ఆసుపత్రి జిల్లాలో చివరి స్థానంలో.. రాష్ట్ర స్థాయిలో 1087 స్థానంతో సరిపెట్టుకుంది. ఈ పరిస్థితికి కాన్పులు జరగకపోవడం ఓ ప్రధాన కారణంగా తెలుస్తోంది. ఒక్కో పీహెచ్‌సీలో పది ప్రసవాలు చేయాలని లక్ష్యం నిర్దేశించగా.. గత నెలలో 26 మాత్రమే జరిగాయి. అదీ ఒక్క కుల్లూరులోనే 7 ఉన్నాయి. అత్యవసరమైతే శస్త్రచికిత్స చేసే పరిస్థితి లేకపోవడం.. ఎక్కువ మంది పెద్దాసుపత్రులకు వెళుతుండటంతో.. తక్కువ కాన్పులకు కారణమన్న మాట వినిపిస్తోంది. దీనిపై డీఎంహెచ్‌వో వి.సుజాత మాట్లాడుతూ.. మెరుగైన సేవలు అందించేందుకు ప్రయత్నిస్తాం. ఉత్తమ ఫలితాలు సాధించేలా ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాం అన్నారు.

**ఏ గ్రేడ్ గగనమే...**

గత నెలలోనే కాదు.. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏ గ్రేడ్ సాధించడం.. అదో పెద్ద విషయం అన్నట్లు తయారైంది. ఏ గ్రేడ్ రాకపోవడానికి.. సీ, డీ గ్రేడ్‌లు సాధించిన పీహెచ్‌సీలు.. ఆ స్థానంలో ఎందుకు నిలవాల్సి వచ్చిందో సమాధానం చెప్పాలని ఉన్నతాధికారులు కోరినట్లు తెలిసింది. రానున్న రోజుల్లో అయినా పరిస్థితిలో మార్పు వస్తుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

రోగులకు అందే వైద్య సేవలు, పనితీరు ఆధారంగా పీహెచ్‌సీలకు ప్రభుత్వం నెలవారీ గ్రేడ్‌లు ఇస్తోంది. తద్వారా లోపాలు సరిదిద్దుకుని మెరుగైన సేవలు అందించేలా చూడటం ప్రభుత్వ ఉద్దేశం. రోజువారీ వచ్చే రోగుల సంఖ్య(ఓపీ), చికిత్స నిమిత్తం చేరేవారి సంఖ్య(ఐపీ), ఆసుపత్రుల్లో జరిగే కాన్పులు, ల్యాబ్ పరీక్షలు, ఐయూసీడీ ఆధారంగా మార్కులు వేసి.. గ్రేడ్‌లు నిర్దేశిస్తారు.

# జలనిధికి.. పరీక్షా సమయం!



ఆత్మకూరు : వరదల సమయంలో సోమశిల జలాశయానికి గడ్డు కాలం షరామామూలుగా మారింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఉత్పన్నమైన కష్టాలు నేటికీ కొనసాగుతుండగా.. కూటమి ప్రభుత్వం వస్తూనే ప్రయత్నాలు మొదలు పెట్టినా అవి ప్రారంభ దశలోనే ఉండటం అందరినీ కలవరపరుస్తోంది.

**మరమ్మతుల ఊసేదీ** సోమశిల 1155 అడుగుల మట్టికట్ట, 1455 అడుగుల కాంక్రీట్ నిర్మితం కాగా- 735 అడుగుల స్పిల్‌వే రూపొందించారు. 50 45 ఎత్తు, వెడల్పు గల 12 క్రస్ట్‌గేట్లు ఏర్పాటు చేశారు. 2020, 2021 సంవత్సరాల్లో వరుసగా రెండు సార్లు భారీ వరద వచ్చింది. దాదాపు 5.6 లక్షల క్యూసెక్కులు రావడంతో ప్రాజెక్టు రక్షణ కట్టడాలు ధ్వంసమయ్యాయి. నీటి నియంత్రణలో ప్రధానమైన క్రస్ట్‌గేట్లను పట్టించుకోలేదు. దాంతో 11, 12 గేట్ల రోప్‌ల పొరలు తెగి ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. మరోవైపు ఆప్రాన్ మినహా.. మిగిలినవీ దెబ్బతిన్నాయి. స్టిల్లింగ్ బేసిన్‌లో వేగాన్ని తగ్గించే సిమెంట్ దిమ్మెలను మరమ్మతులు చేయలేదు. ఎడమ వైపు ఫ్లడ్ బ్యాంకు పూర్తిగా కొట్టుకుపోగా- కాంక్రీట్ గోడ నిర్మాణం జరగనే లేదు. కారణాలు ఏవైనా.. అధికారులు ప్రయత్నించినా.. పనులు చేపట్టేందుకు గుత్తేదారు తగిన రీతిలో ముందుకు రాలేదు. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వ 74 టీఎంసీలు ఉంది. ఈ పరిస్థితుల్లో అధిక స్థాయిలో నీరొస్తే.. ప్రవాహంలో ఒత్తిడి, వేగం పెరిగే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం రూ. 2.4 కోట్లు కేటాయించి.. టెండర్లు పిలిచింది. పనులు చేపట్టేలోపు నిల్వ పెరగడంతో నియంత్రణకు పరిమితులు ఏర్పడ్డాయి.

**పది గేట్లతో నియంత్రిస్తాం**

జలాశయం 11, 12 నంబరు క్రస్ట్‌గేట్లు కదిలించే అవకాశం లేదు. వరద సమయంలో పదింటితోనే నియంత్రించాల్సి ఉంది. అందుకు సిద్ధంగా ఉన్నాం. ఉన్నతాధికారుల సూచనలతో కార్యాచరణను పకడ్బందీగా చేపడుతున్నాం. శ్రీనివాసకుమార్, ఈఈ సోమశిల ప్రాజెక్టు

# కాలువలు కుదించి.. కన్నీళ్లకు దారి!



నెల్లూరు : కాలువలను అభివృద్ధి చేయడమంటే.. ఆక్రమణలు తొలగించడం.. పూడిక తీయించడం.. ఉన్నంత వరకు సిమెంట్ గోడలను కాంక్రీట్‌తో పటిష్ఠం చేయడం.. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో మాత్రం ఇందుకు భిన్నం. 15 అడుగుల వెడల్పు ఉన్న కాలువను మూడు అడుగులకు కుదించడంతో పాటు ఆక్రమణలకు అవకాశం ఇస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నెల్లూరు నగరంలో వరదనీటి కాలువ(స్ట్రామ్ వాటర్)ల ప్రాజెక్టును గత తెదేపా ప్రభుత్వంలో ప్రారంభించారు. దీని ప్రకారం రూ. 55 కోట్లతో సుమారు 11 కి.మీ. మేర డ్రెయిన్లు నిర్మించాల్సి ఉండగా- 25శాతమే పూర్తి చేశారు. పైగా 40 నుంచి 60 అడుగుల వెడల్పు ఉన్న కాలువలను బాగా కుదించి కట్టారు. నిర్మాణాలు ఆపేసిన దగ్గర అవుట్‌ఫ్లో సక్రమంగా లేకపోవడం తదితరాలతో చెత్తాచెదారం పేరుకుపోయి ప్రజలు ఇబ్బంది పడాల్సి వచ్చింది. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత.. ఈ పనులను రద్దు చేసింది. నగరంలోని అన్ని కాలువలను సుమారు 162 కి.మీ. మేర రూ. 365 కోట్లతో అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఆ తర్వాత అన్ని నిధులు ఇచ్చే పరిస్థితి లేదని.. రూ. 50 కోట్లతో అత్యవసరంగా చేయాలని నిర్ణయించారు.

**నగరమంతా కాదు...** నెల్లూరు నగరంలో రెండు నియోజకవర్గాలు ఉండగా- రూ. 50 కోట్లు విడుదలై.. టెండర్ల దశలో ఉన్న పనులు నగర నియోజకవర్గంలోనే చేస్తారనే ప్రచారం జరుగుతోంది. రూరల్ నియోజకవర్గంలో అధ్వానంగా ఉన్న పంట కాలువలను ఎన్ఎంసీ సాధారణ నిధులతో చేస్తున్నారు. ఇందులో భాగంగానే మనుమసిద్ధి నగర్ దగ్గర కుదించి కడుతున్నారు. ఇదే రీతిలో చేస్తే కాలువల వ్యవస్థ మరింత అధ్వానంగా.. పాలకులు, అధికారుల మధ్య సమన్వయ లోపం ప్రజలకు శాపంగా మారుతుంది. నగరానికి ముంపు ప్రమాదం పెరుగుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

దీనిపై నగరపాలక సంస్థ అధికారులను వివరణ కోరగా.. మనుమసిద్ధి నగర్ దగ్గర అవసరం ఉన్న మేరకే కాలువ నిర్మించామని, ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురికాకుండా మొక్కలు నాటామని చెప్పారు.

# భాషలందు కుల్లూరు వేరయా

కలువాయి : జిల్లాలోని 'కుల్లూరు' పేరు చెబితే.. ఆ ఊరి కంటే.. అక్కడి భాష గురించే ఎక్కువ మంది అడుగుతుంటారు. కారణం.. అక్కడి వారు ఇతరులకు అర్థం కాని గొలుసు భాషను మాట్లాడటమే.. మీరు చదవండి ఆ విశేషాలు.. కలువాయి మండలంలోని కుల్లూరు వ్యాపారాలకు నిలయం. ఇక్కడి వారంతా గతంలో వివిధ ప్రాంతాలకు వెళ్లి వస్తువులు విక్రయించేవారు. ఎక్కువ మంది ముంబయి, మైసూరు, సూరత్, కోల్‌కతా వంటి మహానగరాలకూ వెళ్లేవారు. అక్కడ మెలకువలు తెలుసుకునేందుకు.. క్రయ విక్రయాల సమయంలో మూడో వ్యక్తికి అర్థం కాకుండా ఈ గొలుసు భాష ఉపయోగించేవారు. గ్రామానికి ఎవరైనా కొత్త వ్యక్తి వచ్చినప్పుడు.. అతడు ఎవరు? ఎవరి కోసం వచ్చారు? ఏ పనిపై వచ్చారనే విషయాలనూ గొలుసు భాషలోనే చర్చించుకునేవారు. రాపూరు మండలం నాగులవారిపల్లిలో కొందరు వివాహాలు చేసుకోవడంతో.. ఈ రెండు గ్రామాల్లోనే ఈ భాష ఉంది. కాలక్రమంలో వచ్చిన మార్పులతో ప్రస్తుతం వృద్ధులకే పరిమితమైంది.

**గొలుసు భాషలోని కొన్ని పదాలు.. అర్థాలు**

ఇడుము - ఆడపిల్ల గీటు - రూపాయి ఎడమాయి - వ్యక్తి ఇరుసు - భార్య పెడం - భోజనం ఎర్రగాజు - మాంసం

# కట్టు కట్టి.. కట్టడి చేసి

తిరుమల : అధ్యయనం చేసింది: దిల్లీ, మద్రాస్ ఐఐటీ నిపుణులు కె.ఎస్.రావు బృందం, కేరళ అమృత యూనివర్సిటీ నిపుణులు
చేసిన సూచన: రాక్‌బోల్టింగ్
పూర్తయిన పనులు: 80 శాతం
మిగిలిన పనులు: రెండో ఘాట్‌రోడ్డులో 14వ కి.మీ. వద్ద కొద్దిదూరం
చేయాల్సింది: మొదటి ఘాట్రోడ్డులోని అక్కగార్ల గుడి వద్ద

తిరుమల రెండో ఘాట్‌రోడ్డులో కొండచరియలు విరిగి పడకుండా, జారిపడకుండా మద్రాస్ ఐఐటీ నిపుణుల సూచనలతో నిర్మిస్తున్న రాక్ బోల్టింగ్ సత్ఫలితాలనిస్తోంది. 2021 డిసెంబర్‌లో ఈ మార్గంలో భారీ వర్షాలతో కొండలపై నుంచి భారీ రాళ్లు జారిపడి ఘాట్‌రోడ్డు ధ్వంసమైంది. ఇందులో భాగంగా ఘాట్‌రోడ్డు ఇరువైపులా సున్నితమైన ప్రాంతాలను గుర్తించి బండరాళ్లకు ఫెన్సింగ్, రాక్‌బోల్టింగ్, షాట్ క్రీటింగ్, బ్రస్ట్ వాల్స్ ఏర్పాటు చేస్తున్నారు. తక్కువ ఎత్తున్న ప్రదేశాల్లో ఫెన్సింగ్‌తో నింపిన కొండరాళ్లను అడ్డుగా గోడలా అడ్డుపెట్టి మట్టి జారకుండా చర్యలు చేపట్టారు.

**రాక్ బోల్టింగ్ అంటే..?**

రాక్ బోల్టింగ్ అంటే కొండలపై పలకలుగా ఉన్న కొండరాళ్ల మధ్యలో నిర్ణీత దూరంలో వాటికి డ్రిల్లింగ్ చేస్తారు. బెజ్జాలు వేసి అందులో ఇనుప చువ్వలను దింపుతారు. ఆ చువ్వలపై ఇనుప ఫెన్సింగ్‌ను వేస్తారు. అనంతరం ఇనుప చువ్వకు, ఫెన్సింగ్‌కు పైన ఓ బోల్ట్‌ను వేసి బిగుతుగా చేసి కాంక్రీట్ వేస్తారు. రాక్ ఫెన్సింగ్‌లో పైదంతా



చేస్తారు. కాంక్రీట్ వేయరు.

**చర్యలు షురూ..**

రెండో ఘాట్రోడ్డులోని 14 కిలోమీటర్ వద్ద కొద్దిదూరం, మొదటి ఘాట్రోడ్డులోని అక్కగార్ల గుడివద్ద మరోమారు నిపుణులతో పరిశీలన జరిపి ఈ ప్రాంతంలోనూ రాక్‌బోల్టింగ్, ఫెన్సింగ్ చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి ప్రత్యేకంగా దృష్టిసారించి పనుల వేగవంతానికి చర్యలు తీసుకుంటున్నారు. దీంతో గతంతో పోల్చితే ఈ ఏడాది వర్షాకాలంలో కొండచరియం విరగడం, జారడం చాలావరకు తగ్గింది.

**కేటాయించిన నిధులు**

గతంలో రాళ్లు జారిపడిన చోట రాక్‌బోల్టింగ్ చేయడానికి ఆఫ్కాన్ సంస్థకు తితిదే రూ.3.95 కోట్లు కేటాయించగా పనులు పూర్తయ్యాయి. రెండో ఘాట్రోడ్డులో కొండచరియల జారకుండా శరత్‌చంద్ర కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ద్వారా రూ.5 కోట్లతో 2023లో ప్రారంభించారు.

# మల్బరీ..ఆ ఊరి ఉపాధి

చౌడేపల్లి: ఆ గ్రామంలో ఎక్కడ చూసినా మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకమే కనిపిస్తుంది. దీన్నే జీవనోపాధిగా మార్చుకున్నారు. ఆ ఊరే చౌడేపల్లె మండలం తెల్లనీళ్లపల్లె. గతంలో ఇక్కడ సంప్రదాయ పంటలు సాగు చేయగా, నష్టాలు చవిచూశారు. ఓ దశలో కొందరు మల్బరీని పండించి, పట్టుపురుగులు పెంచి అప్పుల నుంచి బయటపడ్డారు. ఇక అంతే అందరూ ఇదే బాటలో నడిచారు. మొత్తం 100 కుటుంబాలు ఉండగా.. 80 కుటుంబాలు దీన్నే నమ్ముకున్నాయి. 150 ఎకరాలలో మల్బరీ పండిస్తున్నారు. ప్రభుత్వ రాయితీలను వినియోగించుకొని షెడ్లు నిర్మించుకుని, పట్టు పురుగులు పెంచుతున్నారు. పెట్టుబడి తక్కువ కావడంతో అందరూ దృష్టిసారించారు. ప్రతి నెలా 5 వేల కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి అవుతున్నాయి. ఎంతోమంది తమ జీవితాల్లో ఈ సాగు మార్పు తీసుకొచ్చింది.

**నాలుగు దశాబ్దాలుగా..**

తెల్లనీళ్లపల్లెకు చెందిన తిమ్మారెడ్డి సంప్రదాయ పంటలు సాగు చేసేవారు. నష్టాలే మిగలడంతో 40 ఏళ్ల కిందట తొలిసారిగా 50 పట్టుగూళ్లు పెంచారు. ఆ తర్వాత అరెకరంలో పండించారు. ఆదాయం రావడంతో ఆయన జీవితమే మారిపోయింది. కుమార్తె పెళ్లికి చేసిన అప్పులు తీర్చేశారు. ఇంటిని నిర్మించుకున్నారు. బీఎస్సీ పూర్తిచేసిన ఈయన కుమారుడు తండ్రికి చేదోడుగా ఉంటున్నారు. ప్రస్తుతం 2.5 ఎకరాలలో మల్బరీ పండిస్తుండగా, 200 గూళ్లు పెంచుతున్నారు.

**నష్టాలు మిగలడంతో..** వెంకటరమణారెడ్డి.. 30 ఏళ్ల కిందటి వరకు చెరకు, వరి, వేరుసెనగ పండించారు. నష్టాలే మిగలడంతో మల్బరీ వైపు దృష్టిసారించారు. ముందుగా అరెకరంలో పండించారు. నష్టాలు తీరిపోవడంతో దీన్నే నమ్ముకున్నారు. రాయితీని సద్వినియోగం చేసుకొని షెడ్డు ఏర్పాటుచేసుకున్నారు. ప్రస్తుతం 4 ఎకరాలలో మల్బరీ పండిస్తున్నారు. పట్టుగూళ్లను పెంచుతున్నారు.

# పల్లెల్లో.. ఆగని స్వాహా పర్వం!

పెనుగొండ : మండలం నడిపూడిలోని ఈ ప్రాంతంలో మురుగు పారుదల నిమిత్తం గత ప్రభుత్వ హయాంలో పైపులైన్లు ఏర్పాటు చేశారు. ఈ పని నిమిత్తం అప్పట్లో బిల్లులు పెట్టగా కొందరి ఫిర్యాదుల మేరకు తిరస్కరణకు గురయ్యాయి. ఇటీవల మరోసారి ఇదే పనికి బిల్లు మంజూరు కోసం పంచాయతీలో తీర్మానం ఆమోదించే శారు. మరోపక్క ఇక్కడ పైపులైన్ల ఏర్పాటుకు అప్పట్లో స్థానిక నివాసితుల నుంచి రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు వసూలు చేసినట్లు గుర్తించడంతో స్థానిక వార్డు సభ్యుడు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంలో వైకాపాకు చెందిన ప్రజా ప్రతినిధి కుమారుడి పాత్ర ఉన్నట్లు ఆరోపణలున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీల్లో నిబంధనలకు విరుద్ధంగా నగదు చెల్లింపులు, తప్పుడు బిల్లులు, పన్ను వసూళ్లలో చేతివాటం వంటి వ్యవహారాలతో రూ. కోట్ల నిధులు పక్కదారి పట్టాయి. కొన్ని చోట్ల ఇప్పటికీ ఇలాంటి వ్యవహారాలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. మరోపక్క కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు బిల్లుల మంజూరు కోసం అడ్డదారులు తొక్కుతూ ఇష్టారాజ్యంగా తీర్మానాలు చేస్తున్నారు. పారిశుద్ధ్య పనులు చేయకుండానే చేసినట్లు చూపి సొమ్ము స్వాహా చేశారని, తాగునీటి పథకం నిర్వహణకు సంబంధించి సామగ్రి కొనుగోలులో చేతివాటం చూపారని, పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటి వరకు ఖర్చులు, ఆడిట్ వివరాలను సభ్యుల దృష్టికి తీసుకురా లేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. పెనుమంట్ర మండలం పొలమూరు పంచాయతీలో పెద్ద ఎత్తున సొమ్ము దుర్వినియోగమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఇక్కడ పనిచేసిన కార్యదర్శి పాలకవర్గ సభ్యులకు తెలియజేయకుండా రూ.7 లక్షలను ఏడు చెక్కుల రూపంలో శానిటేషన్ సామగ్రికి చెల్లించారు. దీనికి రెండు రోజుల ముందు పాలకవర్గ సమావేశం జరిగినా ఈ అంశాన్ని ప్రస్తావించలేదు. నడిపూడిలో ఆస్తి, కుళాయి పన్నులు, కొబ్బరిచెట్ల లీజు సొమ్ము పంచాయతీకి జమ కాలేదని, ఇసుక సీనరేజీ సొమ్ము ఏమైందో తెలియడం లేదని ఉన్నతాధికారులు ఫిర్యాదులు అందాయి.

# 3 నెలల్లో ఇంత లుక్కు ఎలా పాజిబుల్?

తీగ లాంటి లుక్కుతో రాకుమారిలా మారిపోవాలని కోరుకోనిది ఎవరు? అయితే బొద్దుగుమ్మ వామిక గబ్బి సైజ్ జీరో రూపానికి మారేందుకు ఎంతగా శ్రమిస్తోందో తాజాగా కొన్ని వీడియోలు, ఫోటోల రూపంలో రివీల్ చేసింది. వామిక ఇప్పుడు పూర్తి మేకోవర్ తో ఆశ్చర్యపరుస్తోంది. కేవలం మూడు నెలల్లోనే ఇంత మార్పు సాధ్యమైందా? అని అనుమానించేంతగా ఈ కొత్త లుక్కు షాకిస్తోంది. హే వైలీ .. అర్జున్... నువ్వు నన్ను 3 నెలల్లో ఈ స్థితికి తీసుకురావాలి. మనం డిసెంబర్‌లో ప్రారంభిద్దాం... మీ ప్రయాణానికి శుభాకాంక్షలు గురూజీ అని వ్యాఖ్యను జోడించింది. వామిక ఇప్పటికే తాను ఆశించిన మేకోవర్ ని సాధించింది. మునుముందు మరో ఛాలెంజ్ కి రెడీ అవుతోంది.. వామిక ఇటీవల వరుణ్ ధావన్ సినిమాలో నటించింది. ఆ తర్వాత పెద్ద తెర కమిట్ మెంట్లపై సరైన సమాచారం లేదు. వామిక గత కెరీర్ మ్యాటర్ లోకి వెళితే... బాలీవుడ్ క్లాసిక్ జబ్ వి మెట్ లో ఒక చిన్న పాత్రతో బాలనటిగా ప్రయాణాన్ని ప్రారంభించింది. తన



యుక్తవయసులో కథానాయికగా మారిపోయింది. తు మేరా 22 మై తేరా 22, ఇష్క్ బ్రాందీ, లాంటి చిత్రాల్లో నటించింది. నిక్కా జైల్దార్ సిరీస్ విజయంతో పంజాబీ సినీపరిశ్రమలోను గుర్తింపు పొందింది. వామికా గబ్బి చండీగఢ్‌కు చెందిన పంజాబీ కుటుంబానికి చెందిన యువతి. తండ్రి గోవర్ధన్ గబ్బి, గబ్బీ అనే మారుపేరుతో హిందీ - పంజాబీ రెండింటిలోనూ ప్రఖ్యాత రచయిత. చండీగఢ్‌లోని సెయింట్ జేవియర్స్ స్కూల్‌లో తన ప్రారంభ విద్యను పూర్తి చేసింది. చండీగఢ్‌లోని డిఏవీ కళాశాల నుండి ఆర్ట్స్‌లో డిగ్రీని పొందింది. సాహిత్య వాతావరణంలో పెరిగిన వామిక వినోద పరిశ్రమలో సృజనాత్మకంగా రాణించాలని కలలు కంది. ఈ బ్యూటీ రొమాంటిక్ డ్రామా మాలై నెరతు మయక్కంతో తమిళ సినిమాల్లోకి అడుగుపెట్టింది. గోధాతో మలయాళ సినీరంగంలోను ఆరంగేట్రం చేసింది. ఇందులో ఆమె పంజాబీ రెజ్లర్‌గా నటించింది. గోధాలో వామిక నటనకు విమర్శకుల ప్రశంసలు దక్కాయి. హిందీ వెబ్ సిరీస్ గ్రహణ్, మై: ఎ మదర్స్ రేజ్, మోడరన్ లవ్: ముంబై లాంటి సిరీస్ లతో వామిక గబ్బి అందరి దృష్టిని ఆకర్షించింది. వామికకు సోషల్ మీడియాల్లో భారీ ఫాలోయింగ్ ఉంది.

# శ్రుతిహాసన్ ఇంట్లో పూజలు పునస్కారాలు ఉండవా?

శ్రుతి హాసన్ కెరీర్ దేదీప్య మానంగా సాగిపోతున్న సంగతి తెలిసిందే. తెలుగు, తమిళ, హిందీ సినిమాలతో బిజీ బిజీగా ఉంది. విజయాల పరంగా వెనుకబడినా అవకాశాల పరంగా కొదలేదు. ఏదో పరిశ్రమలో సినిమాలు చేస్తోంది. వాల్తేరు వీరయ్యతో మాస్ హిట్ అందుకోగా అటుపై సలార్ మరో విజయం ఖాతాలో వేసుకుంది. ఇతర భాషల్లో కొన్ని సినిమాలు రిలీజ్ అయ్యాయి. ఇటీవలేకూలీతో అలరించింది. తాజాగా ఈ బ్యూటీ బాలీవుడ్-సౌత్ ఇండస్ట్రీ మధ్య వ్యత్యాసం చెప్పే ప్రయత్నం చేసింది. సౌత్ పరిశ్రమలో తారలు ఎంతో వినయంతో ఉంటారంది. ఇక్కడ సంస్కృతి సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తారు. సినిమా ప్రారంభోత్సవం రోజున దేవుడి పటాల ముందు కొబ్బరి కాయలు కొట్టడం..దేవుళ్లకు నమస్కరించడం.. మనసులో కోరికలు కోరుకోవడం.. పూజలు చేయడం వంటివి కనిపిస్తాయి. సౌత్ లో అన్ని పరిశ్రమల్లో ఇలా కనిపిస్తుంది. పరిశ్రమలోకి అడుగు పెట్టిన కొత్తలో నాకు ఇదంతా చాలా కొత్తగా



అనిపించేదంది. ఎందుకంటే మా ఇంట్లో అలా చేయడం ఎప్పుడూ చూడలేదు. ఆచారాలను మా ఇంట్లో వారు ఎవరు నమ్మరు. పూజలు..పునస్కారాలు పెద్దగా ఉండవు. కానీ ప్రతీ విషయంలోనూ క్రమ శిక్షణ ఉంటుందంది. సౌత్ లో ఉన్నట్లు ఈ రకమైన కల్చర్ బాలీవుడ్ లో పెద్దగా కనిపించదన్నారు. చాలా తక్కువ మంది మాత్రమే చేస్తారని, హిందీ సినిమాలు చేస్తున్నప్పుడే ఈ రెండు పరిశ్రమల మధ్య వ్యత్యసం తెలిసిందన్నారు. సౌత్ లో బాగా డబ్బు సంపాదించిన వారు కూడా చాలా పద్దతులు పాటిస్తుంటారు. వారు ఇప్పటికీ అదే పాత పద్దతి కొనసాగించడం చూస్తుంటే వీరు ఇంకా పాత అంబాసిడర్ కారులోనే ప్రయాణిస్తున్నారా? అనిపిస్తుందన్నారు. ఆడంబరమైన వస్తువులతో తమ విజయాన్ని నిరూపించుకోవాలనుకోరంది. కమల్ హాసన్ కూడా ఆచారాలు పాటించరు. దేవుళ్లు..దెయ్యాలు గురించి టాపిక్ ను ఆయన టచ్ చేయరు. పలు సందర్భాల్లో ఆయన చేసిన వ్యాఖ్యలు కూడా వివాదాస్పదమయ్యాయి. ఈ నేపథ్యంలో క్షమాపణలు చెప్పాలనే డిమాండ్ వ్యక్తమైనా? కమల్ మాత్రం ఎక్కడా తగ్గలేదు. తాను నమ్మిన సిద్దాంతానికే కట్టుబడి ఉంటారు.కమల్ లాగే తనయ శ్రుతి హాసన్ కూడా ఉంటుందని ఆమె మాటల్ని బట్టి తెలుస్తోంది.




# మొదట్లో ఐరన్ లెగ్.. కట్ చేస్తే స్టార్ హీరోయిన్స్.. ఎవరంటే?



సినిమా ఇండస్ట్రీలోకి రావడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. హీరోయిన్లు మాత్రమే కాదు హీరోలు కూడా చాలా ఇబ్బందులు పడతారు. అయితే హీరోయిన్లు ఇండస్ట్రీలో స్టార్స్ గా రాణించాలి అంటే కమిట్మెంట్లు, క్యాస్టింగ్ కౌచ్ లు ఇలా ఎన్నో ఉంటాయి. ఇవన్నీ దాటుకొని ఇండస్ట్రీలో రాణిస్తేనే ముందుకు వెళ్తారు. అయితే సినిమాల్లోకి వచ్చిన మొదట్లోనే అందరికీ హిట్స్ పడిపోవు. ఎన్నో ఫ్లాప్ సినిమాలను, అవమానాలు ఎదుర్కొన్నాకే హిట్ సినిమాలు పడతాయి. అలా కొత్త హీరోయిన్ ఇండస్ట్రీకి వచ్చి రెండు మూడు సినిమాలు హిట్ కొడితే ఓకే.. లేకపోతే మాత్రం ఐరన్ లెగ్ అనే ముద్ర వేస్తారు. అలా ఇండస్ట్రీకి వచ్చిన కొత్తలో ఐరెన్ లెగ్ ముద్ర వేసుకొని ఆ తర్వాత సినిమాల్లో స్టార్ హీరోయిన్స్ గా రాణించిన వాళ్లు ఎంతోమంది ఉన్నారు. వారెవరో ఇప్పుడు చూద్దాం..

**విద్యాబాలన్:** బాలీవుడ్ బోల్డ్ బ్యూటీ విద్యాబాలన్ గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. అయితే ఈ హీరోయిన్ సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఐరన్ లెగ్ అనే ముద్ర వేసుకుంది. దానికి కారణం మోహన్ లాల్ తో ఆగిపోయిన చక్రం మూవీ..ఈ సినిమా డైరెక్టర్ కి - హీరో కి మధ్య గొడవలు రావడంతో ఆగిపోయింది. ఈ సినిమాలో హీరోయిన్ గా తీసుకున్న విద్యాబాలన్ కి బిగ్ షాక్ తగిలింది. ఎందుకంటే మోహన్ లాల్ తో సినిమా అనగానే విద్యాబాలన్ కి దాదాపు 8,9 సినిమాల్లో ఆఫర్స్ వచ్చాయి.కానీ ఎప్పుడైతే చక్రం మూవీ ఆగిపోయిందని తెలిసిందో ఆ తర్వాత రాత్రికి రాత్రే ఏకంగా 8,9 సినిమాల నుండి విద్యాబాలన్ ని తీసేసారట. దాంతో విద్యాబాలన్ పై ఐరన్ లెగ్ ట్యాగ్ వేశారు. కానీ ఆ తర్వాత డర్టీ పిక్చర్ అనే మూవీ తో విద్యాబాలన్ ఇండస్ట్రీని షేక్ చేసింది.

**రమ్యకృష్ణ:** సౌత్ స్టార్ హీరోయిన్ రమ్యకృష్ణ కూడా సినిమాల్లోకి వచ్చిన కొత్తలో ఐరన్ లెగ్ ముద్ర వేసుకుంది. ఈ ముద్దుగుమ్మ మొదట తమిళ సినిమా ద్వారా సినిమాల్లోకి వచ్చింది. ఆ తర్వాత తెలుగులో భలే మిత్రులు మూవీతో ఎంట్రీ ఇచ్చింది. అయితే 1984లో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన రమ్యకృష్ణకి దాదాపు ఏడు సంవత్సరాలు గడ్డుకాలం నడిచిందట. ఆమె చేసిన సినిమాలన్నీ ఫ్లాప్ అవ్వడంతో ఐరన్ లెగ్ అనే ట్యాగ్ ని తగిలించారు. కానీ విశ్వనాథ శాస్త్రి దర్శకత్వంలో వచ్చిన సూత్రధారులు సినిమా రమ్యకృష్ణ కెరియర్ ని మార్చేసింది. ఈ సినిమాతో ఆమెకు వరుస సినిమాల్లో ఆఫర్స్ వచ్చాయి. అలా సినిమాల్లోకి వచ్చాక దాదాపు 7 సంవత్సరాలు ఐరన్ లెగ్ అనే ముద్రతోనే రమ్యకృష్ణ ఇండస్ట్రీలో రాణించింది. ఆ తర్వాత ఈమెకు తెలుగు, తమిళ భాషల్లో బ్రహ్మరథం పట్టారు.

**నయనతార:** ఈ హీరోయిన్ మలయాళ సినిమాలతో ఇండస్ట్రీలోకి వచ్చినప్పటికీ ఆ సినిమాలు ఏవి అంత గుర్తింపు తెచ్చిపెట్టలేదు. కానీ తెలుగు, తమిళ భాషలో విడుదలైన చంద్రముఖి సినిమా నయనతారకి మంచి క్రేజ్ తెచ్చింది.ఆ తర్వాత వచ్చిన గజిని కూడా నయన్ కెరీర్ ని మార్చేసింది.అలా తెలుగు, తమిళ భాషల్లో ఇప్పడికి స్టార్ హీరోయిన్ గా రాణించింది.

**శృతిహాసన్ :** కమల్ హాసన్ కూతురు అయినప్పటికీ శృతిహాసన్ కి వరుస డిజాస్టర్స్ తప్పలేదు. అలా ఇండస్ట్రీ లోకి వచ్చిన కొత్తలో లక్, అనగనగా ఓ ధీరుడు, 3, ఓ మై ఫ్రెండ్,7 ఓం అరివు వంటి వరుస సినిమాలు ఫ్లాప్స్ అయ్యాయి. కానీ ఎప్పుడైతే పవన్ కళ్యాణ్ తో గబ్బర్ సింగ్ మూవీలో చేసిందో. ఆ తర్వాత ఈమె దశ తిరిగిపోయింది. ఈ మూవీతో ఐరన్ లెగ్ హీరోయిన్ కాస్తా స్టార్ హీరోయిన్ గా మారిపోయింది. ఇక ఈ మధ్యకాలంలో శృతిహాసన్ ఫ్లాపుల్లో ఉన్న హీరోలకు గోల్డెన్ హీరోయిన్ గా మారిపోయింది.

# కొత్త సంవత్సరంలో డెకాయిట్.. రిలీజ్ ఎప్పుడంటే?




టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్.. ఇప్పుడు పలు సినిమాలతో బిజీగా ఉండగా.. అందులో ఒకటి డెకాయిట్. విభిన్నమైన కథలతో ఇప్పటికే ఆడియన్స్ ను మెప్పించి సూపర్ హిట్లు అందుకున్న అడివి శేష్.. ఇప్పుడు డెకాయిట్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. పూర్తి యాక్షన్ డ్రామాగా ఆ సినిమా రెడీ అవుతోంది. అడివి శేష్ హీరోగా ఇప్పటికే నటించిన క్షణం, గూఢచారి చిత్రాలకు సినిమాటోగ్రఫర్ గా వర్క్ చేసిన షనీల్ డియో.. ఇప్పుడు డెకాయిట్ కు దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాతోనే ఆయన డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. హీరోయిన్ గా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. ముందు ఫిమేల్ లీడ్ రోల్ కు శ్రుతి హాసన్ అనుకున్నా.. ఆమె తప్పుకున్నారు. అయితే డెకాయిట్ మూవీ 2025 క్రిస్మస్ కానుకగా డిసెంబరు 25న రిలీజ్ చేస్తున్నట్టు మేకర్స్ కొన్ని రోజుల క్రితం అనౌన్స్ చేశారు. అందుకు తగ్గట్టే షూటింగ్ షెడ్యూల్ ను కూడా ప్లాన్ చేశారు. జెట్ స్పీడ్ లో చిత్రీకరణ నిర్వహించాలని అనుకున్నారు. కానీ డెకాయిట్ షూటింగ్ లోనే అడవి శేష్ ఇటీవల గాయపడడంతో చిత్రీకరణ వాయిదా పడింది. ఇంకా సినిమాకు సంబంధించిన కీలక సీన్స్ ను షూట్ చేయాల్సి ఉంది. అయితే అడివి శేష్ ఇప్పుడు గాయం నుండి కోలుకున్నా.. ప్రస్తుతం వైద్యుల సలహాతో విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో షూటింగ్ మళ్లీ ప్రారంభమవ్వడానికి కాస్త సమయం పడుతుంది. దీంతో మేకర్స్ సినిమా రిలీజ్ ను వాయిదా వేశారు. క్రిస్మస్ కు విడుదల చేయడం లేదు. తాజాగా సినిమా కొత్త రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు. వచ్చే ఏడాది ఉగాది పండుగ కానుకగా మార్చి 19న రిలీజ్ చేస్తున్నామని అఫీషియల్ గా మంగళవారం ఉదయం ప్రకటించారు మేకర్స్. ఆ సమయంలో స్పెషల్ పోస్టర్ కూడా రిలీజ్ చేశారు.

అందులో అడివి శేష్, మృణాల్ ఠాకూర్ యాక్షన్ మోడ్ లో కనిపించారు. ఓ యాక్షన్ సీన్స్ కు సంబంధించిన పిక్ గా తెలుస్తోంది. కొత్త పోస్టర్ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇక సినిమా విషయానికొస్తే.. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. బాలీవుడ్ ఫిల్మ్ మేకర్, యాక్టర్ అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. తెలుగులో డెకాయిట్ తోనే ఆయన అరంగేట్రం చేస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. మరి కొత్త సంవత్సరంలో రానున్న డెకాయిట్ ఎలా మెప్పిస్తుందో చూడాలి.

# గార్జియస్ లుక్ లో అమృత!

అమృత అయ్యర్.. ఈ పేరు గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తెలుగులో చేసింది తక్కువ సినిమాలే అయినా తన అద్భుతమైన నటనతో అందరి దృష్టిని ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ముఖ్యంగా ప్రముఖ యాంకర్ ప్రదీప్ మాచిరాజుతో కలిసి '30 రోజుల్లో ప్రేమించడం ఎలా?' అనే సినిమాతో ఓవర్ నైట్ లోనే లైమ్ లైట్ లోకి వచ్చేసింది. ఆ తర్వాత ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో యంగ్ హీరో తేజ సజ్జ నటించిన హనుమాన్ సినిమాలో హీరోయిన్గా నటించి మరోసారి ప్రేక్షకులను అబ్బురపరిచింది. ఈ సినిమాలో ఈమె నటనకు విమర్శకుల ప్రశంసలు కూడా లభించాయి. అంతేకాదు ఈ సినిమా తర్వాత ఆఫర్లు వరుసగా తలుపు తడతాయని అందరూ అనుకున్నారు. కానీ అనుకున్నంత స్థాయిలో అవకాశాలు అయితే రాలేదు. ఇక బచ్చల మిల్లి సినిమాలో అల్లరి నరేష్ సరసన హీరోయిన్గా నటించినా కానీ ఈ సినిమా కూడా ఈమెకు కలిసి రాలేదని చెప్పాలి. ఇకపోతే అటు సినిమాలకు ఇటు సోషల్ మీడియాకి కూడా కాస్త దూరంగా ఉన్న ఈమె తాజాగా తన స్నేహితులతో కలిసి సరదాగా గడిపిన క్షణాలను ఇంస్టాగ్రామ్ వేదికగా షేర్ చేసుకుంది..ఆ ఫోటోలలో



చాలా గార్జియస్ లుక్ లో కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది అమృత అయ్యర్. తాజాగా స్లీవ్ లెస్ ముదురు నీలం రంగు దుస్తులు ధరించిన ఈమె.. ఆ దుస్తులలో తన ఆత్మవిశ్వాసాన్ని రేకెత్తించింది. బోల్డ్ స్లిట్ తో కప్పబడిన స్కర్ట్ ఆమెకు క్లాసీ లుక్కును అందించింది. ఈ గ్లామర్ లుక్కులో చాలా రిలాక్స్ గా కనిపించి సరికొత్త వైబ్ క్రియేట్ చేసింది అమృత అయ్యర్. ప్రస్తుతం ఈమె షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి చాలా రోజుల తర్వాత ఇలాంటి లుక్కులో చూసేసరికి అభిమానులు ఈ ఫోటోలను తెగ లైక్, షేర్ చేస్తున్నారు. అమృత అయ్యర్ విషయానికి వస్తే.. 1994 మే 14న తమిళనాడులోని చెన్నైలో తమిళ్ మాట్లాడే కుటుంబంలో జన్మించింది. కర్ణాటకలోని బెంగళూరులో పెరిగిన ఈమె అక్కడే ఎన్ హెచ్ ఆర్ పాఠశాలలో స్కూల్ విద్యాభ్యాసం పూర్తి చేసి, సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ లో డిగ్రీ పూర్తి చేసింది. 2018లో తమిళ చిత్రం పడైవీరన్ సినిమాతో తొలిసారి హీరోయిన్ గా అడుగుపెట్టిన ఈమె ఆ తర్వాత బిగిల్, లిఫ్ట్ వంటి చిత్రాలు చేసి ప్రేక్షకులను మెప్పించింది.. రెడ్ చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఆ తర్వాత 30 రోజుల్లో ప్రేమించడం ఎలా అనే సినిమా చేసి ఆకట్టుకుంది. హనుమాన్ సినిమాతో వంద కోట్ల క్లబ్లో చేరిన ఈమె బచ్చల మిల్లి , అర్జున ఫాల్గుణ సినిమాలు చేసింది..

# ఒకేసారి ముగ్గురు సూపర్ స్టార్స్‌తో మమిత..!

'ప్రేమలు' సినిమాతో ఓవర్ నైట్‌లో స్టార్ హీరోయిన్‌గా మారిన ముద్దుగుమ్మ మమిత బైజు. అంతకు ముందు వరకు మలయాళ సినిమాలకు పరిమితం అయిన మమిత బైజు ఇప్పుడు వరుస తమిళ సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉంది. టాలీవుడ్ నుంచి కూడా ఈ అమ్మడికి ఆఫర్లు తలుపు తడుతున్నాయని తెలుస్తోంది. ఇటీవలే తమిళ మూవీ డ్యూడ్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించిన డ్యూడ్ సినిమా రూ.100 కోట్లకు మించి వసూళ్లు నమోదు చేసిన నేపథ్యంలో మమిత మరింత బిజీగా కోలీవుడ్‌లో మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలుగులోనూ డ్యూడ్‌కి మంచి రెస్పాన్స్ దక్కింది. అందుకే తెలుగు ఫిల్మ్ మేకర్స్ నుంచి ఈమెకు ఆఫర్లు తలుపు తడుతున్నాయని తెలుస్తోంది. మొత్తానికి మమిత బైజు ఒకే ఏడాది వరుసగా పెద్ద హీరోల సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది.

**విజయ్ జన నాయగన్ సినిమాలో మమిత బైజు...** ఇప్పటికే తమిళ్



సూపర్ స్టార్ విజయ్ హీరోగా నటిస్తున్న జన నాయగన్ సినిమాలో మమిత ముఖ్య పాత్రలో కనిపించబోతుంది. ఆ సినిమాలో హీరోయిన్ రోల్ కానప్పటికీ చాలా కీలకమైన పాత్ర అంటూ సమాచారం అందుతోంది. ఆ సినిమా మమిత కెరీర్ గ్రాఫ్ ను మరింతగా పెంచుతుందనే విశ్వాసంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. మరో వైపు తమిళ మరో సూపర్ స్టార్ సూర్య హీరోగా రూపొందుతున్న సినిమా లోనూ మమిత బైజు నటిస్తోంది. సూర్యకు జోడీగా నటిస్తున్న నేపథ్యంలో ఆ సినిమాపై మమిత చాలా ఆశలు పెట్టుకుంది. ఈ రెండు సినిమాలు వచ్చే ఏడాదిలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతున్నా యి. ఈ రెండు సినిమాలు కాకుండా మమిత బైజు మరో కొత్త సినిమాలోనూ మమిత నటించేందుకు రెడీ అయింది. అది కూడా తమిళ సూపర్ స్టార్ మూవీ కావడంతో ఒకే సారి ముగ్గురు స్టార్స్ తో నటించే అవకాశం దక్కించుకున్న అరుదైన రికార్డ్‌ను సొంతం చేసుకుంది.

**ధనుష్ హీరోగా మమిత బైజు హీరోయిన్‌గా...** తమిళ సూపర్ స్టార్ ధనుష్ నటించబోతున్న D54 సినిమాలో మమిత బైజు హీరోయిన్‌గా ఎంపిక అయింది. అధికారికంగా బయటకు రానప్పటికీ కోలీవుడ్ వర్గాల్లో ఈ విషయమై ప్రముఖంగా చర్చ జరుగుతోంది. కోలీవుడ్ లో ఒకే ఏడాది అంటే 2026 లో ముగ్గురు సూపర్ స్టార్స్‌తో నటించిన సినిమాలతో మమిత బైజు బ్యాక్ టు బ్యాక్ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536